సిద్ధార్థ

విశాలమైన ఆ భవనంలో -

రాత్రి పది గంటల వేళ - "అమ్మా" అన్న పిలుపు. శారిక తత్తర పాటుతో నిలబడింది. ఆ పిలుపు వింటూంటే ఆమెకు ఆనందంగానూ ఉంది, ఆందోళనగానూ ఉంది.

"అమ్మా" మళ్లీ అదే పిలుపు. ఆ పిలుపులో దేనికో ఆరాటం. ఆ పిలుపు నిండా ఆర్తి.

శారిక హృదయం ఆనందంతో పొంగిపోయింది. ఇంతసేపూ తను సిద్ధార్థ కోసమే ఆరాటపడింది. అన్వేషించింది. అతను కనబడకనే కంగారు పడింది. తొమ్మిదిన్నరకు అలవాటుగా అతని గదివైపు నడిచింది. న్యాయంగా అతనప్పటికి నిద్రలో ఉంటాడు. తొందరగా పడుకుని తొందరగా లేవడం శారీరకారోగ్యానికే కాక మానసికారోగ్యానికి కూడా చాలా దోహదం చేస్తుందనీ, ప్రాతఃకాలాన మేల్కొనేవాళ్లు పాపభీతి కలవారై ఉంటారనీ, సూర్యోదయాన్ని దర్శించేవాళ్లు సృష్టి రహస్యాన్నరయ గలుగుతారనీ తన నమ్మకం. సిద్ధార్థవీ తన విశ్వాసాలే. నిద్రపోతున్న సిద్ధార్థ ముఖం ఎంతో స్వచ్ఛంగా అమాయకంగా నిర్మలంగా ఉంటుంది. ఆ ముఖం చూసేకనే తన హృదయం ప్రశాంతంగా అయి - నిద్రవొస్తుంది. అందుకే రోజూ పడుకోబోయే ముందు సిద్ధార్థ ముఖం చూసి మరీ తన గదిలోకి వొచ్చి మేను వాలుస్తుంది.

ఇవాళా అలాగే అతని గదికెళ్లింది. శయ్యమీద సిద్ధార్థ లేడు! ఆశ్చర్యం వేసింది. ఏ బాత్‌రూముకో వెళ్లాడేమో అని కొంచంసేపు ఎదురుచూసింది. ఉహూం. అతను పదినిముషాలయినా రాలేదు. తన మనసు పరిపరివిధాలపోయింది, కీడు శంకించింది. అతనికోసం గదిగదీ తిరిగి వెదికింది. అతను కనవడలేదు. గుండె జల్లుమంది. ఏంచేయడానికీ తోచక గదిలోకి వచ్చి నీరసంగా కూలబడిపోయింది.

సిద్ధార్థ ఏమయ్యాడు ? వేళకాని యీవేళ ఎక్కడికి వెళ్లాడు? తనతో చెప్పకుండా గడపదాటడే! తన అనుమతి తీసుకోనిదే పగటి పూటే ఎక్కడికి వెళ్లడే. ఈ రాత్రివేళ ఏ బలమైన కారణం అతన్ని బయటకు పంపగలిగింది ? సిద్ధార్థ తన చేయిదాటిపోతున్నాడా? ఇంకా సమయం రాలేదే ?

అసహనంగా, కిటికీలోంచి ఆశగా బయటకు చూస్తూ నిప్పులమీద నిలబడినట్లు క్షణక్షణమూ యుగంలాగ గడపసాగింది. తమ అనుబంధం చిత్రమైనదే కాదు. అతి బలీయమైనది కూడా. దీనిని సిద్ధార్థ అంత త్వరగానూ తేలికగానూ త్రెంచలేడనే నమ్మకంవున్నా ఎందుకో హృదయం ప్రమాదాన్ని శంకిస్తూంది. ఆరాటపడుతోంది. ఎంత ఆత్రపడింది తను సిద్ధార్థకోసం!.

ఇప్పుడు...

" అమ్మా" ఆ కంఠంనిండా ఎంత తహతహ !

ఆ అన్వేషణలో ఎంత ఆర్తి !

ఆ పిలుపు తన మనసుని సాంత్వపరుస్తుంది. సిద్ధార్థ అలా తనను వెదుక్కుంటుంటే ఎంత హాయిగా, ఆనందంగా శాంతిగా, తృప్తిగా గర్వంగా ఉంది! ఈ అనుభూతి చాలనిపించడంలేదు, కాని - అతన్ని ఎంతసేపు యిలా బాధించడం? వొద్దు .. సిద్ధార్థ తను

సంవత్సరాల తరబడి శ్రమించి గీసిన అద్భుత చిత్రం. తన ఊహలకూ భావాలకూ ఆశలకూ ఆశయాలకూ అహరహమూ అతికష్టపడి నిర్మించిన అపురూప శిల్పం. ఐతే.. యింకా తుది మెరుగులు దిద్దే పని మిగిలిఉంది. తన భావన సఫలమయితే సిద్ధార్థ పురుషోత్తముడే ఔతాడు. ఆదర్శ మానవుడౌతాడు. మనిషికి నిర్వచనంగా నిలిచిపోతాడు. కొంచెం తుదిమెరుగులు. అంతే..

"అమ్మా !.." మళ్లీ పిలుపు, ఈసారి మరింత గట్టిగా. దీపాలు వేసుకుంటూ, త్వరత్వరగా గదులు దాటుతూ, ఆ ద్వారం చేరింది శారిక. అప్పుడు.. హటాత్తుగా ఆ ద్వారంవద్ద ఆమెలో చలనం ఆగిపోయింది. గుండె వేగం ఒక్కసారి పెరిగిపోయింది. ఎన్నడూ లేనిది. యీ వేళలో సిద్ధార్థ యిటు వచ్చేదేం ? ఈ దిశలో యిప్పుడతనికేం పని ?

తడబడుతున్న హృదయంతో ...తలుపు తెరపించింది.

" అమ్మా"

ఎదురుగా.. సిద్ధార్థ. క్షణంలో ఆమె అతన్ని అపాదమస్తకమూ కంటి చూపుతో పరీక్షించింది.

అతని ముఖంలో కాంతిపుంజాలు. ఆ కన్నులలో వెన్నెల వెలుగులు. వదనమండలం అప్పుడే వికసించిన తామరపువ్వులా స్వచ్ఛంగా పవిత్రంగా...

కాని.. అతని దుస్తులనిండా ..రక్తపు మరకలు... ఇంకా అవి తడితడిగా మెరుస్తూనే ఉన్నాయి, అప్పుడే ఆరుతున్న రక్తచందనపు పూతలా. సిద్ధార్థ చేతులు రక్తసిక్తమై..ఇంక చూడలేకపోయింది శారిక. ఆమెలోని మాతృహృదయం తల్లడిల్లిపోయింది. సిద్ధార్థకు గాయాలయ్యాయా ? ఏమిటీ రక్తం?

ఆమె భయపడి.. కళ్ళు గట్టిగా మూసుకుంది. "సిద్ధార్థా ! ఏమిటి రక్తమండలాలు శరీరంనిండా? దెబ్బలేమైనా తగిలాయా ?" వణుకుతున్న కంఠంతో నీరసంగా ప్రశ్నించింది.

"ఏమైంది "

ఆమె కళ్లుతెరిచి ఆశ్చర్యంగా చూసింది. "ఏమిటి నువ్వంటున్నది? నీకేమి కాలేదు కద ? అమ్మయ్య.. నా గుండె కుదుటపడింది. మనస్సు స్థిమితపడుతోంది. ఆందోళన తగ్గింది.." గుండెలనిండా ఊపిరిపీల్చుకుంది శారిక.

"జీవితంలో.. తొలిసారిగా అన్యాయాన్నెదుర్కున్నాను. అంతం చేశాను. ఆ సంఘర్షణ, పోరాటం, తాలూకు చిహ్నాలే నమ్మా యివి." గర్వంగా నవ్వుతూ చెప్పాడు.

"ఏం చేశావు? ఆత్రంగా అడిగింది శారిక.

"నీ కళ్లతో నువ్వే చూద్దువుగాని, ప్రత్యక్షంగా చూసి..నన్నాశీర్వదిద్దువుగాని." శారిక చేయి అందుకోబోయాడు.

ఆమె అర్థంకానట్లు చూస్తూ...ఎక్కడికి అంది విస్మితురాలై .సిద్ధార్థ బయటకు చూపుతూ "అక్కడ చిన్న యిల్లు లేదూ? అక్కడికి.. అన్నాడు. శారిక విద్యుద్ఘాతం తిన్నట్లు ఆపాదమస్తకం కంపించిపోయింది. ఆమె మనసులోని ఆందోళన అవధులు మీరిందొక్కసారిగా..

ఔట్ హౌస్... సిద్ధార్థ తర్జనితో చూపినది అటు ప్రక్కకే.

ఆమె అతనిచేయి అందుకోకుండానే, వేటగాడిచే తరమబడిన లేడిలా పరుగుతీయ సాగింది.

ఆమెనందోకోడం..యౌవనంలో అడుగుపెడుతున్న సిద్ధార్ధకే కష్టమౌతూంది. శారిక మెదడులో భయంకరమయిన అనుమానపిశాచం. అదే ఆమెను తరుముతూంది ఔట్‌హౌస్ దిశగా రెండు నిముషాల కంటే ముందుగానే ఆమె గమ్యంచేరి, తెరచిఉన్న ద్వారంలోంచి ఆత్రంగా గదిలోకి చూసింది. గదిలో విద్యుద్దీపం ప్రకాశవంతంగా వెలుగుతూంది. ఆ కాంతిలో..నేలమీద..రక్తంలో పడివున్న...

"సిద్ధార్ధా" గావుకేక పెట్టింది శారిక.

"నేను మనిషినయ్యాను కదమ్మా? నన్నాశీర్వదించవూ..?"

ఆమె కళ్ళు చీకట్లు క్రమ్ముతున్నాయి. హృదయం అంధకార బంధురమైపోతూంది. యావత్ప్రపంచమూ..తానూ..శూన్యంలోకి లీనమైపోతున్నట్లు..

సిద్ధార్ధ ముఖంనిండా వెలుగు. ఆమె ముఖంలో కటిక చీకటి.

అతని పెదవులమీద చిరునవ్వు. ఆమె. వెక్కిపడుతూంది ఏడుపాపుకునే ప్రయత్నంలో.. అతని కన్నులలో గర్వం. ఆమె కన్నుల నిండా దైన్యం.

"ఎంతపని చేశావు సిద్ధార్ధా !" ఎలాగో అందామె గొంతు పెకిలించుకొని.

"ఎంతో మంచిపని చేశాను కదమ్మా.. నిద్రపోయేందుకు ప్రయత్నిస్తున్నాను. ఎక్కడినుంచో పెనుకేక వినపడింది. త్రుళ్ళిపడి.. క్షణం ఆలస్యం చేయకుండా.. కేక వచ్చిన దిశగా పరుగెత్తాను. ఇక్కడ.. యీ గదిలో.. ఒక మగవారు.. తాగినట్లున్నాడు. వొళ్ళు తెలియని మత్తులో ..అబల అయిన ఒక స్త్రీని చెరచబోతున్నాడు. త్రాగడం నేరం... ఆపైన..ఒక స్త్రీని బలాత్కరించడం.. మరీ నేరం. ఆ క్షణంలో నువ్వేజ్ఞాపకం వొచ్చావు. హృదయంలో నీ మాటలూ, బోధలే, మార్మోగ్రాయి. ఎదురుగా.. అతని చేతిలో విలవిలలాడుతున్న అబల. భరించలేక పోయాను. నేనేం చేస్తున్నానో నాకే తెలియనంత ఆవేశం ఆవహించింది. అతని చేతిలోని సీసాను లాక్కుని దానితోనే అతని తలమీద కొట్టాను. అతను కుప్పకూలిపోయాడు. అన్యాయం..అక్రమం. నేల కూలిపోయాయి. అరె.. ఆ స్త్రీ ఏదీ.?"

గుండె నెవరో పిండుతున్నట్లే ఔతూంది. శారికకు అతని ఒక్కొక్క మాట వింటూంటే. 'దుష్టశిక్షణా శిష్టరక్షణా గావించేను. అదే కదమ్మా మానవత్వం? నేను నువ్వు చెప్పినట్లే చేశానా ?" అమాయకంగా అడుగుతున్న అతన్ని చూస్తూంటే ఆమెకు పిచ్చెక్కిపోతూంది.

"నువ్వు శిక్షించింది.. హత్యచేసింది. మీ నాన్నగారిని నీకు జన్మనిచ్చిన తండ్రిని..."

"కాదు.. నేను శిక్షించింది... హత్యచేసింది. దౌష్ట్యాన్ని.. దౌర్జన్యాన్ని.. దుర్మార్గాన్ని..." స్థిరమయిన కంఠంతో చెక్కుచెదరకుండా బదులుచెప్పాడు.

"నువ్వు రక్షించినది శిష్టురాలిని కాదు. ఓ వ్యభిచారిణిని, తుచ్ఛమైన ధనంకోసం పవిత్రమైన శీలాన్ని కుదువబెట్టే పణ్యాంగనని" నిస్సహాయత నుంచి పుట్టే అపరిమితమయిన ఆగ్రహంతో అందామె.

"ఊహుం..ఒక అబలను.. మగవాడి బలానికి బలైపోతున్న ఒక స్త్రీని. దేవతలు కూడా

పూజించవలసిని స్త్రీమూర్తిని. ఆదిశక్తిని, సృష్టికి మూలమూ త్యాగానికి నిలయమూ ఐన ప్రకృతిని" బీరుపోని కంఠంతో బదులిచ్చిన సిద్ధార్థను వెర్రిదానిలాగే చూసింది శారిక. ఒక్కసారి ఆమెలో విచిత్రమూ అతి భయంక రమూ అయిన అనుభూతి కలగసాగింది.

శారిక రెండు భాగాలుగా విడిపోతూంది. విడిపోయింది. ఒక్కక్షణం.. ఆ రెండు భాగాలూ ఒకదానితో ఒకటి కలహించుకోవడం ప్రారంభించాయి. ఆ పోట్లాట తీవ్రంగా పరిణమించసాగింది. చివరకా ఘర్షణ తీవ్రాతితీవమై.. దుర్భరంగా మారసాగింది. రెండు చేతులతోనూ తలపట్టుకొని..గట్టిగా కళ్లు మూసుకుంది. ఆ సంఘర్షణ కంతులేనట్లుంది. అది ఆగకుండా సాగుతూంది. అమె భరించలేకపోయింది. ఒక్కసారి కళ్ళు తెరిచింది. ఎదురుగా విద్యుద్దీపపు వెలుగులో తననే సూటిగా ప్రశ్నిస్తున్నట్లు వారి కళేబరం రక్తంలో వికృతంగా.. పగిలిన శిరస్సు. దానినుంచి యింకా స్రవిస్తూన్న రక్తపుధారలు.

"సిద్ధార్థా !" అరిచింది శారిక.

"అమ్మా" ! నువ్వే కద నాకు నిజమయిన గురువు లేదా గుర్విణివి. ఇది నీకు నా గురుదక్షిణ బహుమతి."

మతిపోయింది ఆమెకు. ఇదా నాకు గురుదక్షిణ ! ఇదా తనకు బహుమతి! వైధవ్యమా తనకు బహూకృతి! సిద్ధార్థా ! నువ్వేమంటున్నావో నీకు తెలియడంలేదు !.. నువ్వేంచేశావో నీకర్థకావడం లేదు ! నువ్వు ..నీ చేతులతో నువ్వే.. నీ తండ్రిని హత్యచేశావు....

"రాజ్యంకోసం తండ్రిని హత్యచేసిన కొడుకులున్నారు. ఆస్తికోసం తండ్రిని చంపిన కొడుకులున్నారు ! స్త్రీకోసం తండ్రిని చంపిన కొడుకులూ ఉన్నారు. చరిత్రలో.. కాని యీ హత్యచరిత్రలోనే ప్రత్యేకంగా ఆశ్చర్యంగా మిగిలిపోతుంది సిద్ధార్థా ! యీ హత్యనువ్వు చేయలేదు,నేనే చేశాను! నిజంగా నేనే చేశాను."

"ఈ రక్తంతో నాకు విజయతిలకం దిద్దవూ అమ్మా? పరిపూర్ణ మానవుడిని కమ్మని హృదయపూర్వకంగా ఆశీర్వదించవూ" అడుగుతున్నాడు సిద్ధార్థ, అతని ముఖం ఎంత అమాయకంగా ఉంది!.

ఈ బహుమతి తాను స్వీకరించలేననీ.. అతను ఇస్తున్నది గురుదక్షిణకాక తనకు శాశ్వత దుఃఖమనీ తానతనికి తెలియజేయగలిగితే అతనేమైపోతాడు.? నిజంగా అతను నిజం ఆకళింపు చేసుకోగలిగితే.. నిలువునా కూలిపోడూ!ఊహూ.. అతనికెంతమాత్రమూ యీ చేదునిజం అవగతం కాదు. సిద్ధార్థ యింకా మనిషికాలేదు. అతను తను పూర్తిచేయని చిత్రం. ఇంకా మెరుగులు దిద్దవలసిన అసంపూర్ణ శిల్పం. జరిగిన హత్యకు బాధ్యత అతనిదెంతమాత్రమూ కాదు.వాస్తవంగా.. తనే హంతకురాలు.

కాని - ఇదిలోకం విశ్వసిస్తుందా ? చట్టం అనుమతిస్తుందా ?

"చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని నువ్వే శిక్షించడానికి నీకేమి అధికారంలేదు. అది ఘోరమయిన నేరం. అందుకు ".. అంటూ సిద్ధార్థని శిక్షించదూ? న్యాయస్థానానికి చెవులే కాని కళ్ళుండవంటారే, మరి దానికి మెదడూ హృదయమూ ఉంటాయా ? భగవాన్ ఎటువంటి పరిస్థితి తెచ్చిపెట్టావు.

"నన్నే చంపెయ్యలేకపోయావా సిద్దార్థా !" భోరుమంటూ ఏడ్చేసింది శారిక.

సిద్ధార్థ తెల్లబోయాడు. అతనికేమీ అర్థం కాలేదు. అంతా అయోమయంగా ఉంది. అమ్మ తనని అభినందనలతో ముంచెత్తుతుందని అనుకుంటే అశ్రువులతో అభిషేకం గావిస్తున్నదెందుకని? తాను చేసిన నేరమేమిటి? అమ్మ చెప్పినట్లే విన్నాడు. విన్నదే ఆచరించాడు. అందులో తప్పేముంది.?

శారిక భర్త కళేబరాన్ని పట్టుకొని కన్నీరుమున్నీరుగా విలపిస్తూంది. అమెకేం చేయడానికీ పాలుపోవడంలేదు. ఈహత్యానేరాన్ని తన మీద వేసుకొని సిద్ధార్థ జైలుపాలుకాకుండా కాపాడేందుకు మార్గమేమైనా ఉందా అని ఒకవంక ఆలోచిస్తూనే ఉంది, అంత దుఃఖంలోనూ ఉండీ ఉండీ ఆమె విశ్వనాద్ ముఖంవేపు చూసస్తూంది. రక్తం కారి భయంకరంగా మారిన అతన్ని ముఖాన్ని చీరచెంగుతో తుడిచి శుభ్రంచేసింది. అతని ముఖం యిప్పుడామెకు స్పష్టంగా కనిపిస్తూంది. ఆ కళ్ళు ఆమెను ప్రశ్నిస్తున్నాట్లే ఉన్నాయి. "శారికా ! నువ్వు నన్ను నిజంగా ప్రేమిస్తున్నావా ?"

ఆమె తడబడింది. తను... విశ్వనాథ్‌ని ప్రేమిస్తుందా ! ఉహూం ఎంతమాత్రమూ లేదు. మరి అతన్ని ద్వేషిసస్తూందా? ఏమో ..ఊహూ.. అతన్ని ద్వేషిస్తున్నట్లా అనిపించడంలేదు. ప్రేమకీ..ద్వేషానికి మధ్య ఏదైనా భావం ఉంటే.. ఏమిటది? శారికకు విశ్వనాథ్‌పట్ల మిగిలినది అభావంవంటి ఆ భావమేనా ?

విశ్వనాథ్ : శారికా ! పంచభూతాలతో కలిసిపోతున్నా, యిహలోకబంధాలు పూర్తికా తెగిపోలేదింకా.. ఏదీ, నేను ప్రాణం కోల్పోయి గంటైనా కాలేదుగా..? ఏడవకు, శారికా, ఏడవకు. నేను నీ కన్నీరు తుడవలేను. మరణించినవారికి ఆత్మశాంతి కోరుతారుగా జీవులు ? నా ఆత్మకు శాంతి లభించాలంటే నీనయనాల నుండి స్రవిస్తున్న దుఃఖాశ్రువులు తక్షణం ఆగిపోవాలి. ఏంచేసేది ?నేను వొట్టి దుర్మార్గుణ్ణి. నిన్ను కనీసం స్వేచ్ఛగా విలపించయినా విలపించనీయడంలేదు కదూ? చచ్చికూడా నిన్ను సాధిస్తున్నాను కదూ. నిన్ను క్షమించమనికోరను శారికా. నేనొక వింతమనిషిని. నా దృష్టిలో క్షమాపణ అనేది అర్థరహితమూ వ్యర్థమూ అయిన పదం. విచిత్రమయిన మనస్తత్వం అనుకుంటారేమో మామూలు మనుషులు. అనుకోనీ ప్రపంచాన్ని నేనెప్పుడు పట్టించుకున్నాను. నేనొక స్వేచ్ఛాజీవిని. ఎంత స్వేచ్ఛానువర్తినంటే.. ప్రేయసిగా, భార్యగా నీకు కూడా అర్థంకాని మనిషిగా మిగిలిపోయానంటే నేను కాలంతోనూ, లోకంతోనూ సమాంతరంగా బ్రతికిఉండకపోవచ్చు. తప్పొప్పుల బేరీజుకి పూనుకోవడంలేదు శారికా. ఎలాగూ భగవంతుడి పంచాయితీకి సన్నద్ధుడినే ఔతున్నాను. కాని.. నేనేమిటో.. నీకూ ముఖ్యంగా సిద్ధార్థకూ అర్థంకావాలి. అతని క్షమాపణ ఆశించి కాదు. ఈ ప్రపంచంలో మనుషుల మధ్య జీవించవలసినవాడు. జీవితమంతా ముందే ఉంది అతనికి, అందుకని

అదేకాక సిద్ధార్థ హంతకుడు కావటానికి నేను దోహదం చేశాను. అందుకని కూడా.

గగనసీమలో తేలియాడే మబ్బుతునకని దృష్టి కేంద్రీకరించి వీక్షించడం ప్రారంభిస్తే దర్శించేవారి స్థాయిని బట్టి ఒక్కొక్కరి కొక్కొక్క రూపంలో కనిపిస్తుంది. ఇది ఎవరికయినా ఎదురయ్యే అనుభవమే.

జీవితమూ అంతే. ఒకరికి జీవితం సుఖపడడానికి మాత్రమే. మరొకరికి ఇదొక పవిత్రమైన బాధ్యత. ఇంకొకరికిది ఉత్తమ లోకాలను చేరుకునేందుకు మార్గమధ్యంలో తగిలే మజిలీ. అందరి దృక్పథాలూ సరి ఐనవే. వీటిలో తప్పు అనేది ఉందనుకోను. వ్యసనపరులకి కూడా విశాల హృదయమూ ఆలోచించగలిగే అంతరంగమూ ఉంటాయి సుమా శారికా! నేను అసత్యం పలకడంలేదు. సజీవంగానే నేను చాలామేరకు సత్యాన్ని పాటించగలిగాను. యవ్వనంఎత్తున ఉన్న నీరు వంటిది. పల్లానికి పారడం నీటి స్వభావమైతే పరుగులు తీయడమూ ఉరకలు వేయడమూ యవ్వన సహజం. స్త్రీ వంక పురుషుడూ, పురుషుని వంక స్త్రీ పరస్పరాకర్షితులవుతారు. ఆ ఆకర్షణ చాలా బలంగా వుంటే వారి మధ్య బంధం ఏర్పడి అది శాశ్వతమౌతుంది.

ఎందుకు వచ్చాను నేను నెలవంక ? ఏమో జ్ఞాపకంలేదు. జమీ చూడడానిమేమో. అక్కడ నిన్ను చూశాను శారికా ? జ్ఞాపకం ఉందా ! అది ఎటువంటి దివ్యమైన క్షణం! మనం తొలిసారిగా ఒకరినొకరు చూసుకున్న క్షణం.

నీపాదాలముందు సెలయేరు పారుతూంది. సంధ్యాకిరణం ఏటినీటి మీదపడి ప్రతిఫలించి నీచెక్కిళ్ళను గులాబిరంగులో మెరిపిస్తూంది. ఎక్కడో కోయిలలూ, రామచిలుకలు ఆటలాడుకుంటూ ఆనందంగా కూస్తున్నాయ్. ఆకాశ తలంమీద రంగురంగు మబ్బులు చివరి సూర్యకిరణాల ప్రసరణంలో చిత్రవిచిత్రంగా మెరుస్తున్నాయ్. నువ్వు దిగంతాల అవతలివేపుకి దృష్టి సారించి దీర్ఘాలోచనలో నిమగ్నురాలివై ఉన్నావు. అత్యద్భుతమైన భంగిమ అది. చిత్రకారుడికి చక్కని చిత్రం గీసుకుందుకు ఆధారం కాగలిగే ప్రతీక అది. నివ్వెరపోయాను. పరవశంతో ప్రతిమలా నిలిచిపోయాను. నీసౌందర్యాస్వాదనలో తాదాత్మ్యం చెందుతూ ..సుప్రభాతాన విరిసిన సంపెంగ రెక్కలా పచ్చని నీ శరీరం మీదనుంచి పరచిన సౌందర్యరేకవంటి నీ వొంటిమీంచి, అస్తమయ భానుడు తన అఖరి వెలుగు కిరణాన్ని ఉపసంహరించుకుంటున్న అద్భుత దృశ్యాన్ని ఆదమరచి తిలకిస్తూ నిలచిపోయాను.

హృదయం కాంక్షతో నిండిపోయింది. నాకు తెలీదు నిజంగా అది కాంక్ష అనీ, మోహమేకావచ్చుననీ, ప్రేమనుకున్నాను. భక్తుడు దేవతకోసం పరితపిస్తాడే.. అలాగ పరితపించసాగాను నీకోసం. మనసులో ఒక ఒకగాఢమయిన వాంఛ. నిన్ను నాదాన్ని చేసుకోవాలి. నీ సౌందర్యాన్ని నా కౌగిటిలోకి ఎంత త్వరగా తీసుకోగలనా అని యవ్వనం తొందరచేయసాగింది. జీవితానికొకే అర్థమూ, గమ్యమూ శారిక ఐపోయింది. వయసు మహాశక్తివంతమైనది సుమా! వలపు మనిషిని మరి దేనిమీదకూ దృష్టిని పోనివ్వకుండా

కనిపించని బంధాలతో కట్టిపడేస్తుందేమో.

"శారికా ! నిన్ను ప్రేమిస్తున్నాను." హృదయం తొణికిసలాడుతూంటే, శరీరం చిరుచెమటలు పోస్తూంటూ, పెదవులు కంపిస్తూంటే ఎలాగో అన్నాను.గుండెబరువు ఒక్కసారి తగ్గినట్లు తేలికగా ఐంది. ప్రకటించని ప్రేమ ఎంత భారం !.. నువ్వు చూశావు, పద్మ పత్రాలవంటి కన్నులతో.. ఆ చూపులు వెన్నెల కిరణంలాగ సోకి నా హృదయంలోని ఆర్తికి శాంతినిచ్చాయి. నీ పెదవులునడుమ చిరునగవు, నిశ్చయంగా అది ఆమోదంకాదు, హాస్యముద్రే, హేళనా చిహ్నమే.?

"మేఘాలు భూమిమీదకు దిగడమూ, నదులు ఆకాశతలంలోకి ఎగయడమూ అసంభవాలు కావూ. ?

"ప్రేమ దేనినయినా సాధించగలదు. ప్రేమకి అసాధ్యమనేది ఉండదు. నా కంఠంలో ఖచ్చితానికి నువ్వు కొంచెం చలించినట్లున్నావు. ఒక్కసారి నా కళ్ళలోకి చూసి ఆ ఒక్క చూపుతోనే నన్నూ నా అంతర్యాన్ని బేరీజువేయగలిగినట్లు చిరుహాసం చిందించి వెళ్ళిపోయావు నా ఎదుటినుంచి కాని నా హృదయంలో మాత్రం మరీ స్థిరమై పోయావు. భౌతికంగా దూరమౌతున్నకొద్దీ మానసికంగా మరింత ప్రభావితం చేయడం ప్రేమ యొక్క ముఖ్యలక్షణం కాబోలనుకున్నాను. క్షణక్షణమూ నీ ధ్యాసే నిరంతరమూ నీ నామస్మరణమే, శారిక ! ..ఎంత అందమైన పేరు! నీలాగే నువ్వు లేనిదే జీవితమే లేదనిపించింది.

నవ్వుతున్నావు కదూ ? నమ్మలేకపోతున్నావు కదూ? కాని శారికా నేను చెప్పేదానిలో కొంచెమయినా అసత్యంకాని అతిశయోక్తికాని వుండవు సత్యహరిశ్చంద్రుడిని అనను కాని అబద్ధమాడడం నామట్టుకు నాకే నీచంగా కనిపిస్తుంది. మొదటినుంచీ అసత్యమంటే అసహ్యంనాకు. అనృతమంటే ద్వేషం.

ఈవిషయంలో జీవితంలో ఒకే ఒక్కసారి రాజీపడ్డాను. నీకోసం అది నీకు తెలుసు. అప్పుడు కూడా చాలా నీచంగా దిగజారాననుకోను. అర్ధాంగి అడిగినది కాదనలేక కొంచెం ఆత్మవంచన చేసుకున్నా నంతేనేమో. ?

జమీందారునీ.. లక్షలకధికారినీ ..యువకుడినీ ఐన నేను నిన్ను వివాహంచేసుకుందుకేమంత కష్టపడనక్కరలేక పోయింది. మీనాన్నగారికొక కబురు చిన్నమాట. ఆయనెంత పొంగిపోయారో అమాయకులు. "నా శారిక కేనా యింత అదృష్టం" ఉక్కిరిబిక్కిరైపోయారు. "కోరీ, వేడీ జమిందారు నాకు జామాతకానున్నాడా," వెర్రివాడు. నా ఆస్తిమాత్రమే చూడగలుగుతు న్నాడు. కాని తన అమ్మాయి ఎంతవిలువైనదో గ్రహించుకోలేకపోతు న్నాడు. ప్రాణంలేని బంగారం కంటే ప్రాణమున్న బంగారుబొమ్మ శారిక ఎంత అమూల్యమైనదో ఆయన అర్థం చేసుకోలేకపోతున్నాడు. ఆస్తికంటే అంతర్యం విలువ అపరిమితమని తెలుసుకోలేని అమాయకుడు. ప్రపంచంలోని ఐశ్వర్యమంతా కలిసినా ఒక మనిషికీ మనసుకీ సాటిరాదు. ఇది నిజంగా నిజం.

శారికా !.. నీమెడలో మాంగల్యం ధరింపచేస్తుంటే ప్రపంచాన్నే జయించినంత ఆనందం గలిగింది. నిజంగా అదృష్టవంతుడి ననిపించింది. నువ్వు ..నీ నిరుపమాన సౌందర్యం.. అరుదైన అంతర్యం ..అన్నీ నావయ్యాయి. కొన్ని నెలలపాటు ప్రపంచాన్నీ పరిసరాలనీ కాలాన్నీ కూడా విస్మరించి నీ సన్నిధిలో గడుపుతూఉండిపోయాను. నువ్వే సర్వస్వమూ అయ్యావు. నన్ను లోకం క్షమించకపోనీ, నువ్వు క్షమించకు, కాని.. ఎంత చేదుగా ఉన్నా ఆ మాట నీకు చెప్పకుండా నీనుంచి దాచలేను. ప్రేమ విసుగేసింది.! సౌందర్యం మొహంమొత్తింది. భార్య బోరుకొట్టింది.! అంతర్యం మార్పు కోరింది. ! మనసూ,తనువూ కూడా వైవిధ్యంకోసం వెంపరలాడసాగాయి. ఈ చపలత్వాన్నీ, చాంచల్యాన్నీ సహించలేదనుకుంటాను ప్రేమ. కాని నేనేం చేసేది ? మొదటి నుంచీ నాది బలహీనమైన వ్యక్తిత్వమేనేమో? ఆపైన అన్ని అవకాశాలనూ అందుబాటులో ఉంచుతూ అపరిమితమైన ఆస్తి-అగ్నికి వాయువులా, సమయానికే నువ్వు మీ యింటికి వెళ్ళిపోయావు గర్భం ధరించిన కారణంగా చాంచల్యాన్నీ చపలత్వాన్నీ స్త్రీకి అన్వయిస్తారు కాని నాకందులో అట్టే నిజం కనిపించదు. ఉద్యోగంలాగే అవీ పురుషలక్షణాలే అనిపిస్తాయి. సరే.. నా పరిస్థితి నీకర్థమైందనుకుంటాను, దార కి దూరంగా ఉండే పురుషుడు దారంలేని గాలిపటమే. తాత్కాలిక సుఖాలూ, అనుభవాలూ నాకు కొత్తకావు. వివాహోత్పూర్వమే చిన్న చిన్న అనుభవాలున్నాయి. నాలో సంఘర్షణ ఆరంభమైంది. వివాహితుడిగా, పరస్త్రీతో పరివశించడం అపరాధమేమో అన్నశంక. కాని వయసు శరీరాన్ని వేడెక్కించి నిలువనీయదు, ఈ తాపం భరించడం సులభంకాదు, నాలాంటి నిగ్రహశూన్యులకి ప్రేమలాగే వయసూ మనిషిని వివేకశూన్యుణ్ణి గావించగలిగేంత బలమైనదే. ఈ తాపానికుపశమనం స్త్రీ శరీర స్పర్శే అని తొందరపెడుతూంది మనసులోని ఒక సగం. వొద్దు వొద్దని పగ్గంపట్టి లాగుతూంది మరో సగం మనసు రెండు ముక్కలై పరస్పరం సంఘర్షణ భరించశక్యం కాక మదిరను ఆశ్రయించాను. నేను మధువుని తాగుతున్నంతసేపూ నేను నేనుగానే మిగిలిఉన్నాను. అందులో సుఖం కనిపించలేదు. కాని హద్దుమీరి, మధువు నన్ను త్రాగడం మొదలుపెట్టాక మెల్లమెల్లగా హాయిగా నేను మరెవరినో కాసాగాను. 'అహం' భావం అంతర్ధానం కాసాగింది, ఆనందం. అద్భుతమయిన ఆనందం. అదే బ్రహ్మానందం కాబోలు. వేదాంతులు చెప్పే చిదానందం, ఈస్థితిలో మనిషి తనకు తాను పూర్తిగా అతీతుడైపోతాడు. దీని తరువాతి దశ మానిని. సరిగ్గా యిలాగ వొళ్ళుమరిచిన స్థితిలోనే ఓ స్త్రీ నన్ను సేదతీర్చింది తనకౌగిలిలో. తప్పొప్పుల ప్రసక్తిలేదు. నరాలలో తాపం. శరీరంలో మధువు రగిలిస్తున్న జ్వాలలు. ఆవేడికి నిలువలేక ఆమె కౌగిలిలో ఆశ్రయం పొందాను, మగవాడి మనుగడకే ఆధారమైన స్త్రీ. ఆమే నాచెంత చేరకపోతే ఆ జ్వాలలో నేను దగ్ధం కాకుండా మిగిలేవాడినా? ఆ చలివేంద్రమే నన్నాదుకోక పోతే దుర్భరమైన తాపంతో బూడిదైపోయేవాడిని

కానూ ?

నెలలు గడిచాయి. నువ్వు వొచ్చావు. బాబునెత్తుకొని "సిద్దార్ధ" మీ నాన్నగారు సూచించిన నామధేయం కదూ. చెప్పావు నువ్వు ఆ పేరే ఖాయం చేద్దామనుకున్నాను. బాలసారె జమిందారీ ఫాయిదాలో మన భవనంలోనే జరింపించాం. వేడుకలూ వినోదాలూ అయ్యేసరికి చాలా రాత్రే అయింది. సిద్ధార్ధని చూసేసరికి, శారికా ! నాలో అనిర్వచనీయమైన అనుభూతి కలిగింది. అది ఇదమిత్థమని స్పష్టంగా ప్రకటించలేనిది. గర్వం..తృప్తి. ఆనందం.. ప్రపంచాన్నీ జయించినట్లు యిటువంటి అనుభూతులన్నీ కలిపితే.. అటువంటిది. చాలా ఎత్తు కెక్కితే ఎలాగ ఉంటుందో అలాగ అనిపించింది సిద్ధార్ధను చూసుకోగానే కాని యింకా ఆ గులాబి మొగ్గను కొనవేలితో మీటనేలేదు. ఆ మందార రేకుల పెదవులను లీలగా ముట్టుకోనేలేదు. ఆ పట్టుకుచ్చు జుత్తుని నిమురనే లేదు. కలువపూవులాంటి ఆ చిన్ని శరీరాన్ని నా హృదయానికి హత్తుకోనే లేదు. నక్షత్రాలలాంటి చిన్ని కళ్ళను హాయిగా చూడనేలేదు. ఔను ఇంటినిండా బంధువులు.. హడావిడి.. ఈ సంతోష సంరంభాలలో మనకి ఏకాంతం లభించలేదు. నువ్వూ ప్రయత్నించి ఉండవు. మిత్రులతో గడిపి , వేళమీరినా చాలా కోర్కెలతో నీ గదిలోకి వొచ్చాను శారికా, ఆ బాలసారెనాటి రాత్రి నువ్వు మాతృమూర్తివై కొత్త అందాలు సంతరించుకున్నావు. సిద్దార్ధను తనివితీరా ముద్దాడాలి.

నీ నవసౌందర్యాన్ని కౌగిటిలోకి తీసుకోవాలి, యిన్ని నెలల విరహానంతరం. బహుశా నీ గదిలో నేనడుగుపెట్టిన క్షణం దుర్ముహూర్తమేమో !

సిద్ధార్ధ ఉయ్యాలలో నిద్రపోతున్నాడు. నువ్వు మేలుకునే ఉన్నావు, నాకోసం నిరీక్షిస్తూ కాబోలు. శయ్యమీద మేను వాలిస్తే తలలో పూలు నలిగిపోతాయనేమో కూర్చునే ఉన్నావు. ద్వారం దాటి నీవంక రెండడుగులు వేశానోలేదో .."అక్కడే ఆగండి. ముందుకి రాకండి" అరిచావు గట్టిగా త్రుళ్ళిపడి అర్ధంకాక ఆగిపోయాను నీకేమయింది.?

"దయచేసి.. మీ గదికివెళ్ళి నిద్రపొండి," నీ కళ్ళలో కన్నీరు. కంఠం రుద్ధమైంది. అయోమయంగా చూశాను. "శారికా !" త్రాగినవారితో ప్రసంగించడం కూడా నిరుపయోగమే. దయచేసి వెళ్లండి."

నా అపరాధం అర్ధమైంది. శారికకు మధుసేవకులమీద మంచి అభిప్రాయం లేదు. తప్పుచేసేవారికి వారు దానికలవాటు పడిపోవడంవల్ల అది తప్పుగానో ప్రత్యేకంగానో కనపడక సహజంగానే అనిపిస్తుంది. అందుకే ఎదుటివారు ఎత్తిచూపితే తప్ప ఎవరూ వారి తప్పుని వారు తెలుసుకోలేరు. నేనూ అంతే అయ్యాను.

అభిమానానికీ అహానికీ చిన్న దెబ్బ తగిలింది. అయినా మెల్లగా అన్నాను. "సిద్ధార్ధనొక్కసారి తృప్తిగా చూసుకొని మనస్ఫూర్తిగా ఆశీర్వదించి వెళ్ళిపోతాను."

నువ్వు తల అడ్డంగా తిప్పుతూ "వాడి నొసట ఆ శాపాన్ని విధించకండి" త్రాగినవాడి

మాటలకు అర్థమూ ఉండదు. ఆశీస్సులకు బలమూ ఉండదు." అన్నావు అతి కఠినంగా

విషదంష్ట్ర గుండెలో గ్రుచ్చినట్లే గ్రుచ్చుకుంది నీమాట. గిలగిలలాడిపోయాను. శారికా ! సుకుమారీ, సుందరీ, ప్రేమమయిఐన నీలో యింత కాఠిన్యమూ, పరుషత్వమూ ఉండగలవని నేను ఊహించలేదు. అందుకే అంత విస్తుపోయాను. విభ్రాంతి చెందాను. సువాసన వాఘ్రాణించాలని సంపెంగను అందుకుంటే అది మిన్నాగై కాటువేస్తే? అలాగ అయింది నా పరిస్థితి. నీకు సమాధానం చెప్పలేక కాదు. నీమీద నా అధికారం ప్రదర్శించలేకా కాదు. నన్ను నేను సమర్థించుకోగలిగినా మౌనం వహించి వెనుతిరిగాను. ఐశ్వర్యం.. అభిజాత్యం.. వీటి లక్షణాలు నీకెలాగ తెలుస్తాయి.? నువ్వు సామాన్యకుటుంబం నుంచి వచ్చిన స్త్రీవి. నీకు నా అనురాగమే తెలుసు తప్ప నా వంశంలోని మగవాళ్ల ప్రవర్తనలతో కొంచెమూ పరిచయంలేదు మరి. జ్ఞానమూలేదు. కయ్యానికీ వియ్యానికీ నెయ్యానికీ సమానులే ఉండాలన్నది నిజమే అనిపించావు. మనసుకి తగిలిన గాయాన్ని మధువు మాన్పింది. హృదయంలోని ఆర్తిని మానిని చల్లార్చింది. అలాగ గడిచిందా శేషరాత్రి. నేనెక్కువ నష్టపోయాననుకోను.

ఒకవారం గడిచింది ఈ వారమూ మనం ఒకే భవంతిలో ఉన్నా మన మధ్య సందర్శనమూ లేదు. సంభాషణాలేదు. కొన్ని లక్షల యోజనాల దూరం ఏర్పడిపోయింది. ఆ సాయంత్రం నువ్వు కబురంపించావు... "వొస్తున్నానంటూ" హృదయం ఆనందంతో పున్నమినాటి సంద్రమే అయింది. నేను ఓడిపోవడం నాకెంత అయిష్టమో నువ్వు ఓడిపోవడమూ నాకంత అప్రియమే. కాని యిప్పుడు తప్పదు. ఎవరో ఒకరు సంధికి వొస్తే తప్ప యిద్దరమూ సుఖపడలేము. దూరం తరిగి దగ్గరికి కాలేము. నేను పశ్చాత్తాపపడ్డాను. నాదే అవివేకమేమో అనుకున్నాను. కనీసం నీ దృష్టిలో తప్పు చేసినవాడిని నేను. నేనే నిన్ను క్షమాపణ వేడవలసిందేమో. నువ్వు పరాయిదానివికావుగా ? ప్రేయసివి. అర్థాంగివి. నీ ముందు నేను అభిజాత్యమూ, ఆధిక్యతా ప్రదర్శించడమేమిటి ? అవివేకమూ తొందరపాటు కాకపోతే మగతపం తాలూకు బింకమూ పౌరుషమూ నీ ముందు ప్రదర్శించడమేమిటి ? పశ్చాత్తాపపడుతున్నాను, మనసులో అంతర్యం గందరగోళంగా ఉంది. నువ్వొచ్చి నాహృదయంలోని యీ చిరుతుఫాను నాపి మళ్ళీ ప్రశాంతతను ప్రసాదించాలి. ఆ క్షణంకోసం ఆత్రంగా నిరీక్షిస్తూ కూర్చున్నాను.

నువ్వొచ్చావు.

శారికా ! నిన్ను చూస్తునే నాహృదయం ఎందుకో కీడు శంకించింది. స్నానంచేసి ఆరబెట్టుకొన్న జుత్తు, ముడివేసుకోలేదు, జడావేసుకోలేదు. ఇంక పూలుముడుచుకోవడం అన్న ప్రశ్నెక్కడా? తెల్లచీర ధరించావు. వొంటిమీద అలంకారాలు అసలు లేవు. నుదుట మాత్రం బొట్టుంది. అది చిత్రంగా కనీ, కనీపించకుండా కలువపూవు అలంకారాలు లేకపోయినా అందంగానే ఉంటుంది. నువ్వు సహజ సుందరివే. కాని రూపం మనోభావాలకు కొంతవరకూ ప్రతిబింబం ఔతుంది. మనిషి

ఉద్దేశాన్ని అలంకరణ కొంతమేరకు సూచిస్తుంది అందుకే నేను ఆత్రుత చెందాను. భయపడ్డాను. దానికి తగినట్లే నువ్వు చేతిలోని సిద్ధార్ధను యిద్దరి మధ్యఉన్న బల్లమీద ఉంచి నాకెదురుగా, కాని దూరంగా అసీనురాలివయ్యావు. నేనేమీ ఎరుగనట్లు అమాయకత్వం నటిస్తూ.. సిద్ధార్ధనందుకోబోయాను.

"దయచేసి .. ఆగండి."

ఆగి..చూశాను. నువ్వు తలవంచుకున్నావు. ఏదో చెప్పాలనుకుంటు న్నావు.

క్షణాలు లెక్కిస్తున్నాను.

"మీరు మామూలుగానే ఉన్నారనుకుంటాను"

చేదుగా వినిపించిందా మాట. "ఊం రాత్రులు తప్ప మధుపానం గావించను."

"మంచిది, మీ రాత్రి కార్యక్రమాలు మిగిలినవి నాకు చెప్పవలిసిన పని లేదు. ఒక్కమాట చెప్పండి. ఆ అలవాట్లు మానుకోలేరా ? నేను లేనప్పుడు మీరెలా గడిపారో వివరంగా తెలుసుకున్నాను. నేనున్నప్పుడు మీరు వాటినాశ్రయించలేదు."

" శారికా ! నా గురించి కొంచెం తెలుసుకోవడం మంచిదే, ఉభయుల క్షేమం దృష్ట్యా నాకీ అలవాట్లు మొదటినుంచీ ఉండేవి. మధ్యలో నీతో గడిపిన కొన్ని నెలలు మార్పువొచ్చింది. నువ్వెళ్ళిపోయావు. మళ్లీ నేను పూర్వపు మనిషినైపోయాను. మూడో మనిషిని నా గురించి అడిగి ఆరాలు తీయడం నాకు అవమానకరం. వంశానుగతంగా.. ఐశ్వర్యం మూలంగా.. నాకుకొన్ని వ్యసనాలు సంక్రమించాయి. అవి నా రక్తంలోనివి. వాటిని వదులుకోగలనని, అసాధ్యమూ, అసంభవమూ అయిన శపథవాగ్దానాలు చేయను." ఖచ్చితంగానే చెప్పాను.

నువ్వు సూటిగా చూశావు, నా కన్నులలోకి "ఎంత బలహీనులు" !

"కాని..నాకూ ఒక బలమయిన సుగుణం ఉంది. అది చాలా అరుదైన పరిస్థితులలో తప్ప అసత్యమాడకపోవడం."

నా మాటలు పట్టించుకోనట్లు "అంత బలహీనులూ వ్యసనపరులూ మీరెలాగ ప్రేమించగలిగారు? అంటూ అడిగావు. నీ అజ్ఞానానికీ అమాయకత్వానికీ జాలిపడుతూ నిట్టూర్చి" వ్యసనపరులకు హృదయం ఉండదని నీవనుకుంటే క్షమించు నువ్వు తెలుసుకోవలసింది చాలా మిగిలిపోయింది. నిజానికి వాళ్ళ హృదయాలే మరింత విశాలంగా ఉంటాయేమో? అన్నాను. ఎందుకనో నీముందు కటువుగా ఉండలేకపోయాను. సూటిగానూ వాడిగానూ బదులుచెప్పి శరాలవంటి నీ పలుకులకు.. ములకులవటి మాటలతో తిరిగి గాయంచేయగలిగినా మెత్తగానే మాట్లాడాను. కారణం. నా సంస్కారమో, నీమీద ఉండే ప్రేమో, భార్యాభర్తల అనుబంధమో. నీ మాటల వెనుక నన్ను ప్రేమించినందుకో పెళ్ళిచేసుకున్నందుకో నువ్వు చాలా పశ్చాతాపపడుతున్నట్లు కనిపించావు. నా అహానికి గట్టి దెబ్బే తగిలింది.

"వ్యసనాలు హృదయాలని విశాలం చేస్తాయన్నది. కొత్తగా వినపడుతోంది."

వ్యంగ్యంగా అన్నావు నువ్వు.

"అది.. నీ అజ్ఞానం". నోరు జారాను నేను కూడా.

" నిజమే, నేను అజ్ఞానురాలినే. నేను వొచ్చింది. మీతో వాదించడానికెంత మాత్రమూ కాదు. ఇప్పుడు మన వివాహం వెనక్కి తీసుకోలేని తప్పటడుగనీ, పెద్ద పొరపాటనీ స్పష్టం అయింది. దీనికెలాగూ నిష్కృతి లేదు. ఈ జీవితంలో నేను కోరుకున్నదొక్కటే. శీలవంతుడైన భర్త. స్త్రీకే కాక పురుషుడికీ శీలం అతి ప్రధానమే అని మనస్ఫూర్తిగా నమ్మేవారిలో దురదృష్టవశాత్తూ నేనూ ఒకతెను. ఆ కోరిక ఎలాగూ పగిలిపోయింది. అందుకు విచారిస్తున్నా మిమ్మల్నొకటి వేడుకుంటున్నాను."

దీనంగా ఉన్న నీముఖం చూస్తూ ఆశ్చర్యంగా అడిగాను. " ఏమిటి" ?

" సిద్దార్థను నాకివ్వండి."

"శారికా ! ఇదేం కోరిక! నీ ఉద్దేశమేమిటి ! సిద్దార్థ నీవాడు కాకమరెవరివాడు.

''మన యిరువురికీ వాడిమీద సమానాధికారాలుండాలి న్యాయంగా, కాని, ఒక స్త్రీగా, సిద్ధార్థకు తల్లిగా, మీ భార్యగా.. నేను ప్రత్యేకంగా కోరుకుంటున్న దేమిటంటే వాడిమీద సర్వాధికారాలూ నాకే చెందాలని అంటే వాడి విషయం మేరకు ఎప్పుడయినా నా నిర్ణయమే తుది కావాలని."

" నీ భావం నేనర్థంచేసుకోగలుగుతున్నాను మెల్లగా నువ్వెందు కిటువంటి విపరీతపు కోరిక కోరావో కూడా అవగతమౌతూనేఉంది. శారికా ! నీ నిర్ణయం చాలా అన్యాయం సుమా ! ఏ మనిషి ఔన్నత్యమేనా వారి క్షమాగుణం బట్టే నిర్ణయించబడుతుంది. తప్పుని క్షమించడం నీకసలు చేతకాదా! భర్తపట్ల కూడా నీ పట్టుదలకీ సిద్ధాంతానికీ సడలింపు ఉండదా ? ఎటువంటి వ్యక్తిత్వం నీది. !"

"నేను సిద్ధార్థని తీసుకొని మా వూరు వెళ్ళిపోతాను" అన్నావు నువ్వు.

నీమాట నన్ను కలవరపరిచింది. అందుకే అన్నాను. ''శారికా ! అలాగ - చేసి నన్నవమానవరచకు. నలుగురిలోనూ నగుబాట్లపాలు చేయకు."

ఐశ్వర్యం - అభిజాత్యాన్నీ వ్యసనాలనీ మాత్రమే యిచ్చేదయితే సిద్ధార్థను దానినుంచి దూరంగా ఉంచాలనే నా కాంక్ష" కచ్చితంగా చెప్పావు.

"ఐశ్వర్యమే నీకు దూరంగా ఉంటుంది" అంటే ? అన్నట్లు చూశావు. కొంచెం ఆలోచించి చెప్పాను. "ఎలాగూ ఔట్‌హౌస్ ఉండనే ఉంది, నా మకాం అక్కడికి మార్చుకుంటాను."

"ఆపని నేనే చేయగలను. వైభవం నాకేమీ అలవాటు కాదు. నేను విలువ యిచ్చే సంపదవేరు.

"కాని నేను అంత ఉన్నంత వ్యక్తిత్వం కలవాడిని కాననుకుంటాను. జమీందారు భార్యగా నువ్విక్కడ ఉండడమే నాకు గౌరవం. గౌరవాభిమానాల గురించి నాకు పట్టింపు ఉంది మరి. ఎప్పుడో వస్తూంటాను నేనీ భవనంలోకి అదీ..లోకం కోసమే. నీకే విధమయిన అసౌకర్యమూ కలిగించను. నీ వ్రతానికి భంగం

కలిగించను."

వాగ్దానం చేశాను. నువ్వు కళ్లెత్తి చూశావు. నిజమేనా అన్నట్లు..

"మొదటే చెప్పాను నాలో ఒక సుగుణం.. సత్యవ్రతం.. కూడా ఉందని."

మౌనంగా సిద్ధార్ధని చేతుల్లోకి తీసుకొని వెళ్ళిపోయావు. నిజంగా నాకా క్షణంలో ఒక గాఢమయిన కోర్కె ఉంది మనసులో . అది సిద్ధార్ధను గుండెలకు హత్తుకొని ఆ పాలబుగ్గలను ముద్దాడాలనీ, ఆ సిల్కుజుత్తు నిమురాలనీ. కాని సిద్ధార్ధమీద నాకేమీ అధికారం లేదు. కొన్ని క్షణాల క్రిందటే నీకు ధారాదత్తం చేశాను. అడిగి.. వెలితపడడం నాకిష్టముండదు. అందుకని కోర్కెనే చంపుకున్నాను. "సిద్ధార్ధ" ఎంత ఆలోచించి పెట్టిన పేరో ! ఎంత దూరదృష్టితో చేసిన నామకరణమో. తల్లిదండ్రులిద్దరిలోనూ సగమేతల్లి మాత్రమే సిద్ధించింది వాడికి. జాలివేసింది వాడిమీద. హృదయం అర్ద్రమైంది. తరువాత నా జీవితం నీ వరకూ అసిధారావ్రతమే అయింది.

నీ భవనం మెట్లెక్కుతూనే నేను అయిష్టంగానయినా మరో మనిషిని కావలసివచ్చేది. ఆ మెట్లెక్కడానికి నేను మధుపానంచేసి ఉండకూడదు. సిగరెట్‌ని కూడా దూరంగా ఉంచాలి. ముఖంమీదకు చిరునవ్వు తెచ్చుకోవాలి. దేముణ్ణే నమ్మని నేను నీ పూజామందిరంలోకి బూట్లువిప్పి పవిత్రంగా ప్రవేశించి నువ్వు అన్యమనస్కంగా యిచ్చే తీర్ధప్రసాదాలు స్వీకరించాలి. ఆ భవనంలో ఉన్నంత సేపూ గంభీరంగానే మసలాలి. కొత్త అవతారం ఎత్తాలి. ఎందుకంత శ్రమను తీసుకున్నాను ? ప్రపంచంకోసం, లోకాన్ని మభ్యపెట్టడం కోసం.

శారికా నిజంగా నాకీ నటన ఎంతమాత్రమూ అంగీకారంకాదు. మనిషి ఒక్క జీవితమే జీవించాలనేది నా అభిలాషా, సిద్ధాంతము కూడా. శ్రీమంతుడయిన నేను నిన్ను త్యజించి, నా కిచ్చవచ్చిన రీతిలో జీవితం గడపలేకకాదు. నువ్వంగీకరించినా, మానినా నిజం ఏమిటంటే ఎక్కడో నీవంటివారు నూటికి, కోటికి ఒకరు తప్ప మిగలినవారందరూ సంపదకు సలాముచేసేవారే. ధనానికి దాసులే. నేను కోరితే తిరస్కరించే స్త్రీ ఉంటుందనుకోను. కాని .. నాకింకెవరినీ పునర్వివాహం.. ద్వితీయం.. చేసుకోవాలని అనిపించేదికాదు ఎన్నడూ. ఆంతర్యపుటడుగుపొరలలో నీమీది ప్రేమ చిరంజీవిగా నిలిచిఉందేమో ! అర్ధబలమూ, అంగబలమూ అవసరమయిన దానికంటె అత్యధికంగానే ఉన్న నేను, నిన్ను త్యజిస్తే..లోకమేకాదు, చివరికి నీ తండ్రికూడా యిదేమని నన్ను ఎదురుగావొచ్చి ప్రశ్నించడానికి భయంతో వణుకుతాడు. బాహాటంగా మనం విడిపోతే పదిమంది దృష్టిలోనూ నువ్వే నేరస్తురాలిగా అనుమానింపబడతావు కానీ, మగవాడిని కనుక నన్నెవరూ పల్లెత్తుమాట అనరు. ఈ వ్యవస్థలో విచ్ఛినమయిన ఏ సంసారానికేనా స్త్రీనే హేతువుగా పరిగణిస్తుంది సమాజం. అదీ నాకు తెలుసు నేనే పాపంచేసినా దాని తాలూకు మలినం నా చేతులకంటదనీ తెలుసు. అయినా నేనటు అడుగూ వేయలేకపోయాను,

ఆలోచించనూ లేకపోయాను. ఎందుకని ?

పంతాలూ పట్టింపులూ మనని శారీరకంగా దూరంచేసినంతగా మానసికంగా విడదీయ లేకపోయా యేమో! వివాహబంధం అంత సులభంగా వీడిపోయేది కాదేమో. నువ్వు నన్ను తీవ్రంగానే అవమానించినా నీ యెడల పూర్తిగా అభిమానం చంపుకోలేకపోయాను. నిన్ను త్యజించి - అవమానాలపాలూ అవహేళనపాలూ చేయడానికి నాకు మనస్కరించేదికాదు. నీపట్ల ఆ అభిమానమూ అపేక్షా అంతఃకరణా శాశ్వతంగా మిగిలిపోయాయి, నా అంతరంగంలో అంతేకాదు. ఇప్పుడు .. సిగ్గువిడిచి.. అహాన్నీ అభిమానాన్నీ చంపుకుని చెపుతున్నాను. మళ్లీ నువ్వు నన్ననుగ్రహిస్తావేమో అన్న ఆశకూడా నా హృదయకుహరంలో దీపకళికలా రెపరెపలాడుతూనే ఉండేది. అది ..శాశ్వత జ్యోతి. నా ఆశ పూర్తిగా నిరాధారమని భావించను. ఎందుకంటే..

ప్రపంచం ఒక పెద్ద మాయ ఐతే మనిషి అందులో చిన్న వింత మనిషికి అటు వరమూ యిటు శాపమూ కూడా మనస్సే. ఈ మనసు మనిషిని ఆడిస్తుంది. అందుకే అన్నాడు మిల్టన్, ''నాకమయినా నరకమయినా మానవ హృదయంలోనే ఉంటుంది, బాహ్యంగా కాదని ఇంత సత్యం శోధించి మానవాళి కందించిన మహాకవి గురించి కూడా నిజమో అబద్ధమో తెలీదుకాని ఓ అపప్రథ ఉంది. వివాహంకాగానే పారడైజ్ లాస్ట్ వ్రాశాడని, భార్య విరహం ప్రాప్తించాక పారడైజ్ రిగెయిన్డ్ రచించాడనీ, అది సరదాగానే తీసుకొని వదిలేద్దాం. మనిషి తాలూకు మనుస్సు లౌకికంగాకాక ఎదురుతిరిగి ఆలోచిస్తుంది. అతను విప్లవకారుడో, మేధావో, పిచ్చివాడో ఔతాడు. నా మనసు నన్నలాగ తయారుచేయలేదు కానీ..నీ ముందు దోషిగా నిలబడివలసిన అగత్యం కలిగించింది. శారికా ! నిర్మలమయిన అంతరంగంతో ఆలోచించు, ఈ క్షణాలలో ఎందుకో, నీ పంచాయితీలో నన్ను నేనే నివేదించుకోవాలనిపిస్తూంది. నేను తప్పు చెయ్యలేదని నీకు మాత్రం చెప్పుకోవాలనిపిస్తూంది.

తప్పు !.. ఈ పదం అతి మోసపూరితమైనది సుమా ! ఏ యిరువురు మనుషులూ ఒకే పోలిక ఉండనట్లే ఏ యిద్దరి మనసులూ ఒకే విషయాన్ని తప్పుగా చూడవేమో ఎవరికి వారే తమ పరిస్థితులనుబట్టీ వాతావరణాన్నిబట్టీ తప్పొప్పులు నిర్ణయించుకుంటారనుకుంటాను. మనిషి సుఖపడడం నేరమని ఎవరనగలరు ? ఈ సుఖం ఒక్కొక్కరికి ఒక్కొక్కచోట లభిస్తుంది. నువ్వెంతో ద్వేషించే మధువు - నాకు మహోదానందం యిస్తుంది. తెగత్రాగివొళ్ళుమరిచి శవంలా పడుండడం ఏం సుఖమని నువ్వు ప్రశ్నించవొచ్చు. శారికా ! జీవితమనే విసుగునుంచి విశ్రాంతి కల్పించేది మృత్యువు. పగటి విసుగును పారద్రోలేది రాత్రి. చైతన్యం వల్ల కలిగే గ్లానిని నిర్మూలించేది నిద్ర నిద్రలో సుఖమేమిటి? నిషాలోనూ అదే సుఖం. చైతన్యంనుండి .. జాగ్రదావస్థనుంచి .. సుషుప్తిలోకి క్రమంగా మెల్లగా జారడానికి చేయూతనిచ్చేది మధువు. జాగ్రదావస్థకీ సుషుప్తికీ మధ్యావస్థ ఎంత హాయైనది. అది రెండుసార్లు నీ భవనంలో గడపడానికి

అనుభవైకవేద్య మేతప్ప అనిర్వచనీయం. మధువుని సేవించడం జమీందారుగా నాకొక లక్షణం. కాలవమూ. ధనమూ కూడా నాకందుబాటులోనివే. పరస్త్రీ వాంఛ.. ఐశ్వర్యంతాలూకూ అవలక్షణమని అతి తేలికగా తీసిపారేశావు కాని. లోతుగా ఆలోచించు. ఎవరుపరులు ? ఏక్షణంలో నా హృదయంలో ఒక స్త్రీ పట్ల కోరిక కలిగిందో ఆ క్షణంలోనే ఆమెనాది. రాగరంజితమైన నా హృదయం ఆమె సౌందర్యానికి అర్పితమౌతుంది. ఆ అందాన్ని ఆర్తిగా వాంఛిస్తుంది. ఆమెకోసం సర్వమూ త్యజించడానికి సంసిద్ధమౌతుంది. ఏ సాహసమయినా చేసి, ఎంతశ్రమయినా తీసుకొని ఆమెను సాధించి పొందు అందుకునేవరకు మనసు నిలవదు. హృదయం కుదురుగా ఉండదు. వయసు చేసే అల్లరికాబోలిది! మరి నాలో లోపమో, ఆసుందరుల అల్పత్వమో కాని.. ఎవరిమీదా ఎక్కువకాలం మనసు లగ్నంకాదు, ఏ అందమూ శాశ్వతంగా నా ఆంతర్యాన్ని కట్టిపడేసుకోలేదు. నా మనసు ఏ పూవుమీదా మరోక్షణం నిలువని భృంగమేమో, కాని.. శారికా..! నువ్వు విశ్వసించగలిగితే..నామనసు నీముందు పరుస్తాను. నిన్ను ప్రేమించాను. వయసులోని మనసు వలపు వలలో చిక్కుకోవడమే కావొచ్చు. నీమీద ప్రేమమాత్రం క్షణికంకాలేదు అది హృదయంలో ఆరని జ్యోతే అయింది, దానికి నీ ప్రేమ అనే తైలం లభించకపోయినా నీ సౌందర్యం నిత్యనూతనం గానే భాసించేది, ఔను శారికా !

జెట్‌వశాన్‌లో నా విలాసాలకేమీ లోటులేదు. పగలంతా విందులు, వినోదాలు అటు సూర్యుడు అస్తమించడమేమిటి, యిటు మధుపాత్రతో మానిని సాక్షాత్కరించడ మేమిటి. సరసాలలో సరాగాలలో.. రేయికొక సుందరి, అనాఘ్రాత పుష్పం. యవ్వన విలాసం నాముందు నాట్యాలు సలిపేది. నా పొందుకోసం పరితపించేది. అద్భుతమైన అనుభవాన్నందించి రేయిని సార్థకం చేసేది. చందమామలో మచ్చ వుంటుంది. ఆ సౌందర్య నిలయాల శరీరం మీద మచ్చుకొక్క మచ్చయినా కనిపించదు. ఆ నీలాలను చూసి నీలిమేఘాలే సిగ్గుతో తలవంచుకోవాలి. ఆ శరీరకాంతికి సువర్ణమే సిగ్గుతో మగ్గిపోవాలి. మరి అంతటి అందాల భామలను పొందుతున్నా అంతర్యం ఎందుకు నీకోసం కొట్టుకోవాలి? ప్రతిరేయీ వసంతమే ఔతున్నా నీ సన్నిధిలో గడపాలని ఎందుకా వెర్రికోరిక ? నన్నవమానించే, అసహ్యించుకునే, నీవేపే ఎందుకు మొగ్గాలి మనసు? ఇక్కడ నన్ను శృంగార స్వర్గాలలో తేలియాడిస్తూ, నన్నపరిమితంగా గౌరవించే, కాంక్షించే సుందరీమణులిందరుండగా నా నుండి నీ వేపుకి వీచే గాలిని కూడా అసహ్యించుకునే నీకోసం ఎందుకు తాపత్రయపడడం ? అదే నాకు అర్థమయ్యేది కాదు. నిన్ను మరచిపోవడానికే మధువు సేవించేవాడిని, చిత్రంగా మధువిచ్చే నిషాలో నువ్వు మరింత ఆక్రమించుకునేదానివి, నా అంతరంగాన్ని.

ప్రపంచం కోసమని వారాని కొకటి

వచ్చేవాడిని. లేకపోతే నువ్వు చులకనైపోతావు, బంధువుల దృష్టికి, అప్పుడు నువ్వెంత నిర్దయగా ప్రవర్తించేదానివి. భోజనం వడ్డించి వైదొలగేదానివి. నీకు తెలుసు నే నిక్కడకు వొచ్చింది భోజనం కోసం కాదని నామీద కసితీర్చుకుందుకు నన్నలాగ శిక్షించేదానివి నేను ఎలాగో భోజనం చేసినట్లు నటించేవాడిని. రాత్రి నా గదిలో శయ్యమీద పొర్లేవాడిని. ఎంతకీ నిద్రరాదు. ఔను. నువ్వొస్తావేమోనని మిణుకు మిణుకు మంటున్న ఆశ ఏ వేళకి వొస్తావో అని నిరీక్షింపచేస్తూ నిద్రపోనిచ్చేది కాదు. ఆ ఆశకు ఆధారమా ! మనిషి మనసులో దృక్పథంలో ఏ క్షణంలో అయినా ఎటువంటి మార్పయినారా వొచ్చు. మధువూ మానినీ అంత క్షమార్హంకాని నేరాలుకావే. నేను చోరుణ్ణి కాను, అబద్ధలాడేవాడిని కాను, నువ్వు నన్ను క్షమించవచ్చునేమో ఏ శుభక్షణంలో అయినా ? అలాగ ఆశతో ఎదురుచూసేవాడిని. మధువు కూడా లేకుండా నిరీక్షించడం ఎంత నరకమో తెలిసేది. మెల్లగా తెల్లవారేది. నిరాశగా నిద్రలోకి జారిపోయేవాడిని. నువ్వు చాలా కఠినాత్మురాలివి, శారికా మూర్ఖురాలివి కూడా. నన్ను శిక్షించడంలో నువ్వేం కోల్పోతున్నావో ఒక్కసారి ఆలోచించుకోవేం! వెనుదిరిగి చూసుకోవేం! నన్ను బాధపెట్టేందుకు నువ్వూ బాధపడాల్సివస్తాందే అని ఎందుకు గ్రహించవు.? అమాయకరాలువి శారికా ! యౌవనం..అందం..ఆరోగ్యం..కాలంతోపాటు కరిగిపోవడం లేదూ.?

ఒక్కొక్కసారి నీతో అవన్నీ చెప్పెయ్యాలనేంత ఆవేశం కలిగేది కాని నువ్వు నన్నేం మాట్లాడడానికీ అవకాశం యిచ్చేదానివి కావు. నాగుండె మండిపోయేది. చాలా కోపంతో ఒక్కసారి నిన్ను బలవంతంగా కౌగిలిలోకి తీసుకొని నువ్వు కదలకుండా బంధించి నేను చెప్పదలచుకునేవన్నీ చెప్పెయాలని ఉద్రేకపడినా వివేకం తలెత్తి 'అర్ధాంగి మీదనా అత్యాచారం? అని ప్రశించేది అంతేకాక నాకింకో భయం కూడా ఉండేది, నేనునీ కిచ్చినవాగ్దానాన్ని ఏమాత్రం భంగపరచినా మిగిలిన జీవితమంతా నా ముందు నేనే అపరాధిలా నిలబడాలి.

నన్ను మరో రకంగా కూడా అతి దారుణంగా శిక్షించావు శారికా ? ఆ చిత్రహింసను తలచుకుంటే యిప్పటికీ మనసు జలదరిస్తోంది.

సిద్ధార్ధ ముద్దుగా బొద్దుగా ఉండేవాడు, పసిపాపగా మరీ చక్కగా ఉండేవాడు. చంటిపిల్లలు పాకుతూంటే అది ఎంత అద్భుతమైన దృశ్యమని పాలరాతి గచ్చుమీద.. పరచిన తివాచీమీద..సిద్ధార్ధ ప్రాకేవాడు. నల్లని దుబ్బుజుత్తు వేసుకొని.. విశాల నయనాలతో ప్రతి వస్తువునీ కుతూహలంగా పరికిస్తూ..ఎంతో ఆనందంగా, కొంచెం కొంచెం ముందుకు జరుగుతూ..వాడు పారాడుతూంటేమధ్యమధ్య నావంక కన్నెత్తి చూస్తూ.. అమాయకంగా బోసినవ్వులు నవ్వుతూంటే..నాహృదయం ఒక్కసారి వాడినెత్తుకోవాలని ఎంత పరితపించిపోయేదో! వాడు నావంక చేతులు చాచేవాడు. తనని ఎత్తుకోమని చెబుతున్నట్లు దొరకదు. ఆ రమణుల శరీరాలతో

చిన్నచిన్న కేకలు పెట్టేవాడు. నాలో చలనం లేకపోయేసరికి కోపంవచ్చినట్టు పిడికిళ్లు బిగించి. మూతి సున్నాలా పెట్టి పెద్దగా అరిచేవాడు, నన్నొక వింత మృగాన్నిలాగ చూస్తూ అదుగో.. అటువంటప్పుడే మనసుకి పగ్గాలు వేయడం అతి కష్టమైపోయేది, శారికా ! మనిషి ఎంత వ్యసనపరుడయినా పసిపాపలపట్ల వాత్సల్యాన్నీ ప్రేమనీ, అనుబంధాన్ని, ప్రదర్శించకుండా ఉండవలసిరావడం చిత్రహింసే. అందులోనూ అందంగా ఉండి అల్లరిచేసే చిన్నపిల్లలను చూస్తూ చేరదీయకుండా ఉండమంటే హృదయానికి రంపపుకోత. పసితనం అమితాకర్షణీయం. ఎవరి పిల్లలు అయినా చక్కగా అనిపిస్తే బుగ్గమీద చిటికివేసి నవ్వించకుండా ఉండలేము. సిద్ధార్థ చిన్నప్పుడు మరీ కాశ్మీరపు యాపిల్‌పండులా ఉండేవాడు బూరెబుగ్గలతో, ఎంతో ముద్దొచ్చే వాడు. వాడిని.. ఆ. బుగ్గలను ..ఒక్కసారి స్పృశించాలని నా పితృహృదయం పరితపించేది. మనసు ముందంజవేసేది. కాని ఎక్కడినుంచో నీ కుపితనేత్రాలు రెండూ ఆగమని గద్దిస్తున్నట్లు ఐ భయంగా నా చేతులని వెనక్కి తీసుకునేవాడిని. నేను ముట్టుకుంటేనే వాడు మలినపడిపోతాడా శారికా ? నా చేతులు పరిశుద్ధమైనవే. ఇవి ఎవరినీ హత్యచేయలేదే.? కనీసం శిక్షించనయినా లేదే.? మరెందుకని యివి అపవిత్రమయిపోయా యి.? ఓహో.. యివి మధుపాత్రనందుకుంటా యి. పరస్త్రీని ప్రేమగా నిమురుతాయి. అందుకే కదూ? అయ్యో శారికా.. తప్పొప్పులమధ్య నువ్వు గీసిన గీతలే సవ్యమైనవైతే నీ శిక్షాస్మృతే ధర్మమైనదైతే ప్రపంచంలో అందరూ కాకపోయినా ఎక్కువ మంది తండ్రులకి తమ బిడ్డలను ముట్టుకునే అర్హత మిగలదే!. నా నమ్మకం ఏమిటంటేయీ లోకంలో మంచివారిగా మిగిలిన అనేకులు అవకాశాలు లభించకనే. నువ్వు నిర్ణయించే మంచివారి సంగతి నేను చెప్పాను. నాదృష్టిలో మంచి చెడులకి అర్హతానర్హతలు వేరు. మనసుకీ తనువుకీ ఉపశమనమూ సాంత్వనా కలిగించే మధు మానినులు నా దృష్టికి తప్పులేదు. అసత్యమూ, అపహరణమూ, కృత్రిమమూ, వంచనా యివే నా భావనలో దుర్గుణాలు నా వరకు మాత్రమే. ముందే చెప్పాను. యీ తప్పొప్పుల నిర్ణయం మనిషి, మనిషికీ మారుతుందని, మెల్లగా నేనూ రెండు బ్రతుకులకలవాటుపడిపోసాగాను, ఎంతో అయిష్టంగానే, ఒక నేనే నేను.రెండవ నేను నేనుకాను, ఔట్‌హౌస్‌లోనే నా జీవితం. నీ భవనంలోది కేవలం నటన మాత్రమే. ఉండీ ఉండీ నా మనసు బాధపడేది. నేనెంత ఒంటరిని! భార్య ఉంది.దాంపత్యం లేదు. పుత్రుడున్నాడు, వాత్సల్యం లేదు, వారికి నేనేమికాను! ఈ ప్రపంచంలో మనిషికి పెద్ద శిక్షేమిటో తెలుసా శారికా ! భౌతికంగా అయినా మానసికంగా అయినా ఒంటరితనం. అందుకే కాబోలు జైలుశిక్ష విధిస్తూంటారు నేరస్తులకి, నీకొక సందేహం కలగవచ్చు. పగలు మిత్రులతోనూ రేయి రమణులతోనూ గడిపేనాకు ఒంటరితనపు బాధదేనికని.? మనిషి తానెవరిని కోరుకుంటాడో వారు తనవారు. వారి సన్నిధిలో ఉంటేనే అతనికి పదిమంది మధ్య ఉన్న తృప్తి భావనా కలుగుతాయి. వారికి దూరంగా... మిగిలిన వారెందరి మధ్య ఉన్నా అతను ఏకాకే. అతని మనసుకి నిందుతనం

ఆటలాడుకుందుకే కాని వారి అంతర్యాలలోకి నేను తొంగిచూసిందెన్నడు ! వారూ అంతే. వారికి కావలిసిన నేనిచ్చే కానుకలు. ఖరీదయినా కానుకలు. నా హృదయం వారికి అక్కర్లేదు. ఇవ్వడానికది నావద్ద లేనూ లేదు. సుఖమనేది కొంతవరకూ మాత్రమే శరీరంతో పొందగలం అధికభాగం అది మానసికమే.

సిద్ధార్ధమీద నాకు అధికారాలయితే లేకుండా చేయగలిగిగావు కాని శారికా, వాడిమీద నా ఆశలను నాశనంచేసుకోమనలేదు కరుణామయివై. నేనతని మీద ఆశలు పెంచుకోసాగాను. ఒకనాడు. సిద్ధార్ధ ముద్దుముద్దుగా మాటలు నేర్చుకుంటున్నాడు. నువ్వు నేర్పుతున్నావు. ఆ పదజాలం ఆ రాత్రంతా వింటున్నాను. అమ్మ..రామ..తాత..మామ్మ..శివ అంతే అక్కడాగిపోయింది. వాడినోట నాన్నా అనే పదం పలకడం కూడా నీకు కంటగింపే అని గ్రహింపుకి వచ్చాక నా గుండెల్లో శూలమే గ్రుచ్చుకుంది. జీవితంలో ఎన్నడూ అంత అవమానమూ, ఆవేదనా ఎరుగను నీ గుండెల్లో జాలే లేదా. లేశమయినా కరుణ లేదా? ఇంత కఠినరాలువా శారికా ! ఔనులే. నువ్వు సుగుణాలరాశివి, తప్పుచేయవు. తప్పులని క్షమించవు. నీ హృదయం సున్నితంగా ఎలా ఉండగలదు.? సిద్ధార్ధని నువ్వేం చేయదలచుకున్నావు. నా మీద నీ పగ తీర్చుకుందుకు వాడినొక ఉపకరణంగా తయారుచేయదలచుకోలేదు కదా! నాపై కసి తీర్చుకుందుకు ఆ పసివాడిని పావుగా తీర్చిదిద్దదలచుకుంటే అంతకంటే అన్యాయం మరేమి ఉండదని గ్రహించుకో శారికా. వాడిమీద సర్వాధికారాలూ నీవేకాని, ఆ హక్కులని నాశనం కోసం వినియోగించకు నువ్వొక్కసారి న్యాయం ఆలోచించు. సిద్ధార్ధ మన యిద్దరికీ సంతానమే. వాడికి నా వ్యసనాలు, దుర్గుణాలు రాకూడదని నువ్వు కోరుకోవడం అసమంజసం కాదు. కాని నా దృష్టికి నీ మొండితనమూ క్షమించలేని గుణమూ, యివి కూడా మనిషిలో చోటుచేసుకోరానివే. అందుచేత వాడిమీద నువ్వు నా ప్రభావం పడకూడదని ఎలా వాంఛిస్తావో, నేను నీ వొత్తిడికూడా వాడిమీద ఉండకూడదని కోరుకుంటాను. అది న్యాయం కాదూ? వాడిని స్వతంత్రంగా పెరగనీ వాడి భావాలూ, ఆలోచనలూ ఊహలు ఉద్దేశాలు సిద్ధాంతాలూ, విశ్వాసాలు వాడివే కాని. మనిషి వ్యక్తిత్వం స్వతంత్రంగానే రూపొందాలి. ఒక చెట్టునీడలో దాని విత్తునుంచి మొలకెత్తినదే అయినా మరో మొక్క ఆరోగ్యంగా పెరుగలేదు. సిద్ధార్ధ స్వతంత్రుడై మనలో ఎవరిది తప్పని తీర్పు చెవుతాడో? నన్ను తండ్రిగా స్వీకరిస్తాడేమో వ్యక్తి అయ్యాక? అది నా ఆశ శారికా. దాన్ని మూలంలోనే ముక్కలు చెక్కలు చేసెయ్యకూ అని ప్రార్ధిద్దామనుకున్నాను. కాని, నా ప్రార్ధన యిసుక నుంచి తైలం పిండబోవడమే ఔతుందనిపించి విరమించుకున్నాను. తప్పటడుగులు వేస్తున్న తన సంతానాన్ని చేయూతనిచ్చి నడక నేర్పించలేకపోవడం, తన కళ్లముందే వాడు పడుతున్నా ఏమీ సహాయంచేయకుండా చేతులు కట్టుకొని మిగిలిపోవలసిరావడం ఎంత బాధాకరమో తోచింది కాని నువ్వు నీకు సంక్రమించిన

అనుభవిస్తేనే తెలుస్తుంది.

సిద్ధార్థ పెరుగుతున్నాడు, బడికి వెళ్ళే వయసు వచ్చింది. అక్షరాభ్యాసం అతి ఘనంగా చేయాలని నా సంకల్పం, కాని నువ్వా ప్రసక్తి తీసుకురావడంలేదు. గారాబంతో ఆ విషయం మరిచావేమో అని అవేళ కదిపాను. 'శారికా! సిద్ధార్థకు విద్యాభ్యాసం ప్రారంభించగలిగే ప్రాయం వొచ్చిందనుకుంటాను.

"ఊఁ" అన్నావు నిర్లిప్తింగా,

"త్వరలో వైభవంగా ఆ ఉత్సవం జరిపిద్దామా"

"వొద్దు.." అనేశావు కఠినంగా

"శారికా" ఉలిక్కిపడ్డాను. ఆ సమాధానం నేనెన్నడూ ఆశించనిదీ అంగీకరించలేనిదీ, విద్యలేని మనిషికి విలువ ఏముంటుంది.? అయినా సిద్ధార్థకు విద్యావిహీనంగా ఉండవలసిన కర్మేమిటి.? "సిద్ధార్థకు చదువు వొద్దూ"

చదువు చెబుతాను. చెబుతున్నాను కూడా. దానికి అర్భాటమూ హడావిడీ అవసరం లేదంటున్నానంతే"

"సిద్ధార్థ మీద అన్ని అధికారాలూ నీవే. కాని వాడిది జమిందారీ వంశమని విస్మరించకు. వేడుకలకు వాడిని దూరంచెయ్యకు."

"వాడిని మనిషిని చెయ్యాలని నా ఆశయం"

" నీవెంత వ్యంగ్యంగా హేళనగా మాట్లాడగలవు! " ఎదుటివారి గుండెలలోకి ఎంత సూటిగా గురి చేయగలవు నీమాటలని, నీ వ్యంగ్యపు పలుకులు ఈటెలూ చాకులు అయి నా హృదయాన్ని చీల్చి చెండాడుతూంటే.. మరో నిముషం అక్కడ నీ ఎదురుగా ఉంటే నిగ్రహం సడలి. తొందరపాటు లో నిన్నేం చేస్తానో అని భయపడి రివ్వున లేచి వెళ్ళిపోయానక్కడినుంచి, నేనాగ్రహావేశపరుడను కానుకానీ రెచ్చగొడితే సహనం ప్రదర్శించగలిగే శాంతమూర్తినికాను. నీముందు మాత్రం నాలో ఎక్కడలేని శాంతమువొచ్చేది. వాదించి నిన్ను గెలవగలిగినా ఎందుకనో నీ ముందు ఎక్కువ మాట్లాడాలనిపించేది కాదు.

నిజానికి సిద్ధార్థ విద్యాభ్యాసంమీద నాకు చాలా ఊహలు, ఉద్దేశాలు ఉండేవి. కాలం మారుతోంది. మనుషులూ, విలువలూ మారుతున్నాయి. విద్యకు కూడా విలువలు మారుతున్నాయి. సిద్ధార్థకు ఆంగ్ల విద్య అలవర్చాలి. అందుకనువైనవి మిషనరీవాళ్లు నిర్వహించే కాన్వెంటులే కొంచెం మత ప్రసక్తిఉన్నా, ఆంగ్లభాషను ఆంగ్లంగా నేర్చుకోవాలంటే కాన్వెంటులే సరి అయిన విద్యాలయాలు. అవి మనిషిని తీర్చిదిద్దగలవు కూడా. ఇది నీకు చెప్పాలనుకున్నాను. కాని నేనేం చెప్పినా నిష్ప్రయోజనమని విరమించు కున్నాను. నాకాశ్చర్యం కొలిపిన విషయమేమిటంటే నువ్వు సిద్ధార్థను బడికి పంపలేదు. ఉపాధ్యాయులు యింటికి వొస్తున్న చిహ్నాలు కనిపించవు. మరి సిద్ధార్థ విద్య సంగతేమిటి ? ఒక్కసారి విచారించాను. సిద్ధార్థ మీద కొంచెమయినా అధికారాలుంచుకోనందు కు పశ్చాత్తాప పడ్డాను. అప్పుడు నాకు నా బిడ్డ మీద ఉండవలిసినవి అభిమానానురాగాలే కాని అధికారాలు కావనిపించింది. పుత్రుడిమీద అధికారం చూపడమనే భావనే నా కసహ్యంగా

హక్కులను దుర్వినియోగపరు స్తుంటే నాభావాలు మారాయి. మూన్నాళ్ల ముచ్చటే అయిన మన వైవాహిక జీవితపు తాలూకు ప్రభావం కొంతయినా నామీద ఎందుకు శాశ్వతంగా మిగిలుందో, ఎన్నటికి చెరుగని మచ్చలాగ! నేనెక్కువ పరితపిస్తున్నది. సిద్ధార్థకు దూరంగా ఉండవలసి వొస్తున్నందుకు నన్ను నువ్వు వాడికి కూడా నిషిద్ధవ్యక్తిగా చేసి వొదిలినట్లున్నావు. సిద్ధార్థకూడా నా ముందుకు, రాడు సాధ్యమైనంత వరకూ తండ్రిగా నాముచ్చట్లు నాలో దాచుకోవలిసిందే. అలాగ దాచుకున్న సరదాలు గుండెలను ఊచకోతే కోసేవి. ఇదేమి సంసార జీవితం.? నా భవంతిలోనే నతిధిని. నా ధర్మపత్నికి, నేను పరపురుషుడిని. నా పుత్రుడికి నేను అపరిచితుడిని! శారికా! భార్యగా నువ్వు కోరాలి. భర్తగా నేను తీర్చాలి. పుత్రుడిగా సిద్ధార్థ అడగాలి. తండ్రిగా నేనందించాలి. అందులోనే ఎంతో తృప్తి ఉంది. మనిషి కోరుకునేదదే కాని నాకు కొంచెమయినా లభించనిదీ అదే. అది ఐశ్వర్యం మూడ్చలేని లోటు. అర్థం -అనుబంధాలు కలిగించేంత ఆనందం కలిగించజాలదు.

శిల్పానికి రూపే తప్ప భావాలు ఉండవు. బయటకు నేను శిల్పంలాగే రాతిముఖం వేసుకుని ఉండడం అలవర్చుకుంటున్నాను. హృదయంలో రేగే అగ్నికీలల వేడి నా శరీరం మీదకు ప్రసరించకుండా అప్రమత్తంగా ఉంటున్నాను. అందుకే నాలో నిరంతరమూ జరిగే సంఘర్షణ తాలూకు ఛాయలైనా ఎవరికీ తెలియవు. కనీసం నీకు కూడా హృదయస్పందనను కూడా నిబిడీకృతంగా ఉంచుకోవలసిరావడం చాలా పెద్దం శాపం సుమా. రెండు పడవల మీద ప్రయాణం వంటిదే రెండు ముఖాల బ్రతుకు. మొదటిది మనిషిని శారీరకంగా చంపితే, రెండవది మానసికంగా అనుక్షణమూ హింసించి హింసించి వదులుతుంది. రెండు రకాల జీవితమంటే నాకు పరమ అసహ్యం కాని నా నొసట అదే లిఖించావు

మీ ఇంటికిరాక తప్పదు నాకు లోకంకోసం..నా కోసమూ. మీ యింటి మెట్లెక్కుతూనే పవిత్రుడునైపోయేవాడిని ఉహూం ఆ పాత్ర నటించేవాడిని నిజంగా నాకు తెలియదు నా నటన సిద్ధార్థను నాశనం చేస్తుందని. తెలిస్తే నీకిచ్చిన మాటను వెనక్కి తీసుకొని అయినా వాడి జీవితాన్ని రక్షించేవాడినే.

శారికా ! ఎందుకిలా కన్నీరు పెడుతున్నావ్ ? ! నామీద నిజంగా నీకే కొంచెమయినా ప్రేమ ఉందా? ప్రేమలేనిచోట కన్నీరుకి తావుండదు. అది నటనే ఔతుంది.? నీకు నటించవల్సిన అవసరమేముంది. నీ హృదయం శిలాసదృశమే తప్పుని క్షమించలేక నా జీవితం నాశనంచేశావు. నీదీ అనుకో విచిత్ర దాంపత్యమూ వింత జీవితాలూ అయిపోయాయి మనవి. మనని చూసి ప్రపంచం తెలుసుకోవాలసినదీ జాగ్రత్తపడవలసినదీ ఉందేమో. మంచిని నేర్చుకోవడంతో సరిపోదు. చెడుని కూడా తెలుసుకొని దూరంగా ఉండాలి. వెలుగులో కనిపించని కొన్ని నిజాలు చీకటిలోనే కనిపిస్తాయి. జీవితం వెలుగు చీకట్ల ద్వంద్వమే. పొంగిపోతున్నారు. నాకు లభించుతున్న

ఈ నలుపు తెలుపు గడులను దాటుకుంటూ ముందుకి సాగేదే మానవ జీవితం. కేవలం తెల్లగడులనే నమ్ముకుంటే జీవనఖేల రసమయంగా ఉండదు. మన దాంపత్యంలాగే తయారౌతుంది. నీ కన్నీరు తుడవాలని నాకుంది. కానీ..చేసిన వాగ్దానం వెనక్కిలాగుతుంది. ఏడవకు శారికా ఏడవకు. నీ కనుల నీలాలు నే చూడలేను. నేను వెళ్ళిపోతున్నాను శాశ్వతంగా ఏడవకేడవకు.

శారిక :- ఏడుపుకాక నాకు మిగిలిందేముంది?. ఏడవక నేను చేయగలిగేముంది?. నా పరిస్థితిలో ఉన్న ఏ స్త్రీ మాత్రం దుఃఖించడంకంటే ఏం చేయగలదు?. ఎటువంటి దయనీయమైన పరిస్థితి యిది. కన్నకొడుకు భర్తని హత్యచేశాడు. ఆ పుత్రుడు నా పుత్రుడు. ఆ భర్త-నా భర్త. ఆ యిరువురి మధ్యని నిలబడడానికి నేనెంత వొణికిపోతు న్నాను!. అంతరంగం నిలదీసి ప్రశ్నిస్తూంది. నువ్వు చేసింది తప్పుకాదా అని . ఏది తప్పు, ఏది ఒప్పు ? తిరిగి అడగాలనిపి స్తుంది.

నేను ఆయన్ని ప్రేమించలేదేమో అని విశ్వనాథ్ అనుమానం. ప్రేమిస్తే మరోలాగ ప్రవర్తించి ఉండేదాన్నని ఆయన ఉద్దేశం కాని ఈ విషయంలో ఆయన పొరబడ్డారని చెప్పక తప్పడంలేదు. వలపు గిలకరించకపోతే ఆ సాయంసంధ్యలో ఆయన నివేదించిన ప్రేమను నిర్లిప్తంగా వొదిలెయ్యక హృదయంలోకి తీసుకునేదాననేనా ? ఆ ముహూర్తం ..మే మిరువురమూ పరస్పర వీక్షణంగావించుకున్న క్షణం ఎంత దివ్యమైనది ఎంత ప్రతిభావంత మైనది.

ఏటిగట్టున నిలబడి కొండల కవతల చిత్రంగా ఔతున్న సూర్యాస్తమయాన్ని తిలకిస్తున్నాను. ఆకాశంలో రంగవల్లులు తీర్చిదిద్దునట్లు మేఘాలు, సూర్యకాంతి పడని కొండలు నలుపుకి తిరుగుతున్నాయి. పకృతి - నిత్యసుందరమే పరవశించి పరధ్యానంగా నిలుచున్న నేను ఉలిక్కివడ్డాను. తల తిప్పిచూశాను. వారెవరో తెలియదు. కాని గౌరవించాలన్న భావన కలిగింది. స్ఫటికంలాంటి శరీరకాంతి.స్వచ్ఛతా సరళతా మూర్తీభవించిన ట్లున్న ముఖం, సుందరమయిన విగ్రహం. చంద్రకాంతశిలలో మలచిన మహారాజులా ఆయన. ఒక్కసారి ఎందుకో నా కన్నె మనసు తొణికింది. హృదయం ఆర్ద్రమయింది. గుండె జల్లుమంది. అంతలోనే "యత్రరూపం తత్రగుణాః" అన్న ఆర్యోక్తి మెదిలింది మెదడులో, ఇంత సుందరుడు ఎంత సంస్కారవంతుడో ఎంత సుగుణశీలో ఊహించుకో సాగాను. ఆయన కన్నులలో ఎంత ఆరాధన. పలుకెంత తీయన నాకు తెలియదు వారు జమిందారని. నాకు వైభవం మీద వ్యామోహంలేదు. అడంబరాల మీద కోరిక లేదు, కాని వారునా ప్రేమనడిగినప్పుడు వారినొకవ్యక్తిగా మాత్రమే పరిగణించి అంగీకారం తెల్పాను. నమ్మినా మానినా యిదే నిజం విశ్వనాథ్. నాన్నగారు మీ వివరాలు చెప్పినప్పుడు నాకు భయంవేసింది. మీ అంతటివారు నన్నెందుకు స్వీకరించదలచుకు న్నారో నా అపరిపక్వ మేధ కందలేదు. కాని మీపట్ల నాకప్పటికే ఏర్పడి పోయిన ఆకర్షణ నన్ను మరోమాట చెప్పనీయలేదు. అమ్మానాన్నా

అదృష్టాన్ని తలుచుకుంటూ, నిజంగా వాళ్ల ఒకరకంగా అమాయకులే ఏమో, కాకపోతే పురాణాలూ ఉపనిషత్తులూ జీర్ణించుకోగలిగిన నాన్నగారు మనిషి సుఖం లక్షలరూపాయలలో ఉంటుందని భ్రమపడడమేమిటి ?

నన్ను అమ్మా నాన్నా ఎలా పెంచారని. సంస్కృతాంధ్రాలలో కొంచెం జ్ఞానం కలిగించారు. బడిపంతులయిన నాన్నగారు నాకు దేశచరిత్రను తెలియచేశారు. అమ్మ-పతివ్రతల కథలు చెప్పేది. అయితే అవి స్త్రీ వ్యక్తిత్వాన్ని కించపరిచేవీ కొంచెంచేసేవీ కావు. ఆ పాతివ్రత్యం పతిని తీర్చుదిద్దగలిగేదీ సన్మార్గంలో పెట్టగలిగే సాహసాన్నీ శక్తినీ యివ్వగలిగేదీ.

"స్త్రీ మగవాడి నీడ కాదు శారికా ! అతనికి అవసరాన్ని బట్టి నీడనివ్వగలిగేది. అతన్ననుసరించడమంటే అంటే గుడ్డిగా అతను చెప్పేది ఆచరించడంకాదు. సదస్వదిచక్షణ గావించి అతన్ని సన్మార్గంవేపు నడిపిస్తూ అతనికి జోడుగా అడుగువేయడం పుట్టిన క్షణం నుంచి పురుషుడిమీద స్త్రీ ప్రభావం ఉంటనే ఉంటుంది. శీలమనేది స్త్రీ కెంత ముఖ్యమో పురుషుడికి ఒ అంతే ముఖ్యమే, పురుషుణ్ని శీలవంతుడిగా ఉంచడం స్త్రీ బాధ్యత. ఇలాగ చెప్పేది అమ్మ నా వ్యక్తిత్వం అలాగే వికసించసాగింది. నాలో అవే భావాలుచైతన్యం సంతరించుకునేవి. నావి.. అనే ఉద్ధేశ్యాలూ సిద్ధాంతాలూ స్థిరపడసాగాయి. బలమైన విశ్వాసాలేర్పడ సాగాయి. నాకు అప్పుడు నిజంగా తెలియదునే నేర్పరచుకుంటున్న ఆదర్శాలే నా భ్యవిషత్తులో నావట్ల ఉరితాళ్ళౌతాయని. తప్పుచేసి పశ్చాత్తాపపడి, క్షమనర్థించడం కాదు, తప్పు చేయకపోవడమే ఔన్నత్యం, మనిషికి నిజమయిన సందప శీలమే. ఎవరి జీవితమైనా స్వచ్ఛంగానూ, పవిత్రంగానూ ఉండాలి. ఒక్క ఉప్పుగల్లు కడివెడు పాలనూ విరుస్తుంది. ఒక్క వ్యసనం, దుర్గుణం, జీవితాన్నంటిని చేరుస్తుంది. వివాహమై మీ యింటికి వొచ్చాను. ఇల్లంటే అదే భవనం మీ భవంతి నన్ను సాదరంగా ఆహ్వానించింది. చేరదీసింది. కాని అదెన్నాళ్ళు ఆశయాలు అదర్మాలు ఉన్నా నేనేమి అతీతురాలిని కాను. సామాన్య స్త్రీనే, నాది స్త్రీ హృదయమే. మీరు చూపుతున్న అనురాగానికి మురిసిపోయాను. మీ ప్రేమవాహినిలో తలమునకలయ్యాను. గర్భవతినయ్యేవరకూ అనుక్షణమూ నేను మీ వలపుజల్లులలో అమృతస్నానాలే చేశాను. గర్భందాల్చాక నా ఆనందం మరీ అధికమైందీ. జన్మకు సార్థకత లభిస్తున్నట్లు తృప్తి. ఈ సృష్టికి నేను సహకరిస్తున్నాను. ప్రకృతి నా మీద ఉంచిన భాధ్యతను సక్రమంగా నిర్వహించగలుగుతున్నాను. నేను పరిపూర్ణ స్త్రీని. మీకు అనురాగమయి అయిన అర్ధాంగిగా నా పాత్ర చక్కగానే నిర్వహించిగలుగుతున్నాను. కొంచెం కాలంలో "అమ్మ" పాత్ర కూడా అద్భుతంగా అతి సమర్ధవంతంగా పోషించగలగాలి. అమ్మ ఎంత తీయని పదం. ఏ భాషలోనయినా అతిమధుర మయిన పదం 'అమ్మ' మాత్రమే అనుకుంటాను. నాలో ఊహలు తీవెలు సాచుకుంటున్నాయి. కలలు పదేపదే తలలెత్తుతున్నాయి, సాగరంలో అలలలాగ. జన్మించబోయే శిశువు స్త్రీ అవాలని లోనుకావలసివచ్చిందని !

కానీ పురుషుడు కావాలని కానీ ప్రత్యేకమయిన కోరికేమిలేదు. భగవంతుడి దృష్టిలో - సృష్టిలో స్త్రీ పురుషులు సమానులే. ఒకరి ఆధిక్యతాలేదు, మరొకరి అల్పత్యమూ లేదు.

బాబు పుట్టాడు. సిద్ధార్థ అనేది నాకేతట్టిన పేరు. నాన్నగారి సూచన కూడా ఉన్నా అది వేరే విషయం. ఈ జీవితానికి వాడొక అర్థం చెప్పుకోగలగాలి. జీవితం వాడి కర్థంకాగలగాలి. అందుకని వాడు ''సిద్ధార్థ'' వాడిని పురుషోత్తముడిగా తీర్చిదిద్దాలని నా ప్రగాఢవాంచ వాడు మరో శివాజీ కావాలి. జిజియాబాయి పాత్ర ధరించడానికి నేను సంసిద్ధురాలినే. ఇంతవరకూ నా ధ్యేయం మిమ్మల్ని ఆనందపరచడం. సిద్ధార్థ పుట్టాక నా లక్ష్యం వాడు. సంతానవతి కాగానే స్త్రీ దృక్పథంలో యీ మార్పు సహజమనుకుంటాను.

భవనంలో వాడితో అడుగుపెట్టాను. మీకోసం మనసు తహతహలాడుతోంది. దేవతలపాపలాటి సిద్ధార్థను మీకు నేను చూపించి మీరు తృప్తిగా వాడివంక చూస్తుంటే నేను గర్వపడాలి నా జీవితం సఫలత చెందిందని సంతోషించాలి. తనువు మీ కౌగిలిలో కరిగిపోవాలనీ, మనసు మిమ్మల్ని పెనవేసుకోవాలనీ, ఆత్రత చెందుతున్నాయి, అవకాశంకోసం ఎదురుచూస్తున్నాను. పుత్రోత్సాహంతో మీరు చాలా అర్భాటం చేస్తున్నారు. విందులు... వినోదాలు భవంతి కోలాహలంగా ఉంది. మనకి ఏకాంతం లభించడానికి వాయిదా పడుతోంది. సరిగ్గా అప్పుడు ..తెలిసింది. కాలకూట విషంకంటె చేదునిజం, పాము కోరకంటె ప్రమాదకరమయిన నిజం. నేను లేనివేళ మీరు సాగించిన జీవితం.. దానిని మీరు విలాసమంటారు కాబోలు. నేను వ్యసనమంటాను, పతనమంటాను.

జూదం..పానం..జారత్వం మూడింటికి మూడూ వ్యసనాల్లో శిఖరాలే. మీరు వాటికి వశులయ్యారు. నా హృదయంలో కార్చిచ్చు చెలరేగింది. నేనెటు నిర్ణయించుకోవాలి.

వ్యసనం అంటే స్వప్నంలో కూడా ద్వేషమే. త్రాగుబోతనే పదం వింటూనే వొళ్ళు కంపరమెత్తి శిరస్నానం చేసేవరకూ శరీరమూ హృదయమూ స్తిమితపడవు. మీరు నాభర్త-పరస్త్రీ స్పర్శతో అపవిత్రులయ్యారు. మిమ్మల్ని ప్రేమించి నందుకు. మీవంటి కల్మషులకు నాకన్యాత్వాన్ని సమర్పించినందుకు నేను పశ్యాత్తాపపడ్డాను దేవుడనుకొని-దెయ్యానికి యీ శరీర కుసుమాన్నర్పించానే అని పశ్చాత్తాపపడ్డాను. ప్రాయశ్చిత్తం చేసుకోవాలి. లేకపోతే నాకు తోచదు. మీరు దీనిని సంకుచిత హృదయమనే అనండి. మరేమన్నా అనండి. నేను తప్పుచేయను. తప్పుని క్షమించనూ క్షమించను. ఇది నా బలహీనత అయినా సరే స్త్రీ లోలురూ మధుసేవకులూ అయిన మీతో కొన్ని నెలలు గడిపిన నేరానికి నా శేషజీవితమంతా మీ స్పర్శకు దూరంగా ఉండడం నాకు నిష్కృతిగా అనిపించింది. ఈ శిక్ష సరి అయినదే. అని మనసూ, అంతరాత్మా అంగీకరించాయి. పాతివ్రత్యం సంగతి? మీరు ప్రశ్నించవచ్చు. దానికి ముందే చెప్పాను. సమాధానం. పాతివ్రత్యం కంటే కూడా శీలమే ప్రధానమని వాచా మనసా కర్మణా విశ్వసించిన వింతస్త్రీని నేను నిర్ణయం తీసుకుందుకు ఎంత సంఘర్షణకు

సిద్ధాంతాలూ.. విశ్వాసాలూ.. నియమాలూ..ఎన్ని ఉన్నా నేను స్త్రీనే. నాలో స్త్రీత్వం నాకెదురుతిరగసాగింది. మనసుకీ తనువుకీ మధ్య జరిగిన హోరాహోరీ పోరాటమది. అంతరంగం కోలాహలమయమైంది. శరీరానికి అనుభూతులు కావాలి. అనుభవాలు కావాలి. వయసు చేసే ఒత్తిడి కొంచెంకాదు. అందులోనూ మిమ్మల్ని అమితంగా ప్రేమించానంతవరకూ, మిమ్మల్ని చేజేతులావదులుకోవడం ... దూరంచేసుకోవడం.. నాకిష్టమౌతుందా? సులభంగా సాధ్యపడుతుందా? ఈ ఆసిధారా వ్రతం చివరివరకూ నిలుపుకోగలనా? నేను నాకు విధించుకుంటున్నదేమిటి? భర్త ఉండగానే వైధవ్యం!. మంగళసూత్రం ఉండీ భర్తలేడనే భావాన్ని పెంచుకోవడం. ఎవరయినా క్షమిస్తారా నన్ను ! స్త్రీలోకం గర్హించదూ నన్ను! నాతిగల బ్రహ్మచర్యం అన్నపదమే ఉంది. భాషలో వాడుకలో నేను చేయబోతున్నది పతిగల బ్రహ్మచర్యం అనే పదాన్ని వాడుకలోకి ప్రవేశపెట్టడమే ఔతుందా ?

ఆదర్శం..అనుభూతి..రెండింటిలోఏటుమొగ్గాలి? వ్యక్తిగత విశ్వాసం..ప్రాతివ్రత్యం..ఏది గొప్ప. సంప్రదాయం ..విప్లవం.. దేనిది పైచేయి కావాలి.

నాకు తెలుసు .. నాలాంటి స్త్రీ లెందరో పరిస్థితులకు తలవొంచి, పతితులయిన భర్తలతో కాపురంచేస్తూనే ఉన్నారు. పతివ్రతల కథలూ చాలా మట్టుకు అలాగే ఉన్నాయి. ఇవన్నీ నా ఆలోచనలోకి రాకపోలేదు. మరి అవి ఏటువంటి క్షణాలో పాతివ్రత్యం కంటే వ్యక్తిత్వమే ముఖ్యమన్న కొత్తపంథాలోనే జీవితాన్ని నడిపించాలనుకున్నాను. నేను తలపెట్టినది త్యాగమని తెలుసు. యజ్ఞమని తెలుసు. కాని మనసు మార్చుకోదలచుకోలేదు. మీమీది ప్రేమని నాపట్టుదలే జయించింది. ఎంత గుండెదిటవు చేసికోవలసివచ్చిందని మీకామాట చెప్పడానికి! ఎంత కఠినత్వం ప్రదర్శించ గలిగానూ, మీరు నన్ను ముట్టుకున్నారో.. నేను మీకు దక్కను. నన్ను నేనే దహించుకొని ఆత్మత్యాగం చేసుకుంటాను. నాపడకగదిలోకి పొరపాటును కూడా మీరడుగు పెట్టకూడదు".

"స...రే..."

మీ రంగీకరిస్తారనుకోలేదు. మన మధ్య జరిగిన కొంత వాదనకేం, అది పెద్దలెక్కలోనిది కాదు. మీరెందుకు అంగీకరించారు. జీవంలేని కట్టెలాగ ఎందుకనా వనికిరాకుండా నామమాత్రపు భార్యగా నేను మీకుండి ఏమి ప్రయోజనం. అదే అడిగాను, మిమ్మల్ని ఆశ్చర్యంగా చూస్తూ "లోకంకోసం నువ్వు నన్ను విడిచిపెడితే లోకం నవ్వుతుంది. అదీగాక నాకో ఆశకూడా ఉంది.

"ఏమిటి ?"

"నీ పంతం శాశ్వతం కాదేమోనని, నాకు తెలుసు శారికా.. నీకు నామీద చాలా ప్రేమ"

"ఆ ప్రేమంతా ఇప్పుడు ద్వేషంగా మారిపోయింది. మీరు వ్యసన పరులన్న అనుమానం లవలేశం కలిగినా మిమ్మల్ని, మీ ప్రేమని ఎంతమాత్రమూ అంగీకరించి ఉండేదాన్ని కాను."

"నువ్వేవి వ్యసనాలుంటున్నావో అవి- చూడసాగారు.

ఐశ్వర్యవంతుల జీవితంలో సామాన్యమైన భాగాలే"

"ఐశ్వర్యం గురించి నాకు తెలియదు. పేదకుటుంబం నుంచి వొచ్చిన దాన్ని మరి. కయ్యానికేమో కాని నెయ్యానికి మాత్రం నమానులు కావాలన్న దాన్లో చాలా సత్యమున్నట్లుంది."

"నేను నిన్ను ఎగతాళి చేయలేదు శారికా"

" అలాగని నేను భావించడం లేదు." నా సంపద ఐశ్వర్యమూ నావి. కాంతాకనకాలు మీకెంత సంతృప్తినీ గర్వాన్నీ అతిశయాన్నీ యిస్తాయో నా విశ్వాసాలూ భావచైతన్యమూ నాకంతకంటే ఎక్కువ తృప్తినే కలిగిస్తాయి. నాజీవన విధానంలో నాకు పూర్తినమ్మకం ఉంది. ఈ ప్రపంచం సుఖశాంతులతోనూ నిజమయిన మనుషులతో నూ విలసిల్లాలంటే ఉపకరించేవి నా విశ్వాసాలు తప్ప మీ భ్రమలు కావని స్పష్టంగా చెప్పగలను."

"శారికా !"

"క్షమించండి ! ఇలాగ జరిగాక నేను కొంచెమూ దాచుకోదలచలేదు. సిద్ధార్థనికూడా నేను కోరుకుంటున్నాను. ఈ కోరిక తీర్చితే నిజంగా నేను అదృష్టవంతురాలినౌతాను. నేను గడపబోయే నిస్సారజీవితానికి అర్థమూ, ధ్యేయమూ ఏర్పడతాయి. సిద్ధార్థ నాకు అచ్చంగా కావాలి. నాకే అంతా కావాలి. వాడిని నేను నా యిష్టానుసారంగా పెంచుతాను. నాకు నచ్చిన రీతిలో మలుచుకుంటాను. నేను కోరుకునే వ్యక్తిత్వాన్ని వాడిలో రూపొందిస్తాను. వాడిమీద అన్ని అధికారాలూ నాకే చెందాలి. వాడి పెంపకంలో మీ ప్రమేయం ఏమీ ఉండకూడదు. మీ ఐశ్వర్యం తాలూకు అవలక్షణాలేమి వాడికి సంక్రమించకూడదు. మీ వ్యసనాల వారసత్వం వాడిని వరించకూడదు. అది నా ప్రగాఢ వాంఛ. నేను కోరుతున్నది చాలా తీవ్రమైనదీ, కఠినమైనది అని తెలుసు. కాని గత్యంతరం లేదు. నేను గడపబోయే రసవిహీనమైన జీవితం విసుగుగొల్పకుండా ఉండాలంటే నా ముందొక లక్ష్యం ఉండాలి, అది నిర్దిష్టమైనది కావాలి. సిద్ధార్థని నేను అలా తీసుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ మిమ్మల్ని యీ భిక్ష పెట్టవలిసిందిగా వేడుకుంటున్నాను.

"ఆవేశపడకు శారికా !.. ఆవేశం ఆలోచనను హరిస్తుంది. నీ ఊహ అసమంజసమే కాదు, అన్యాయం కూడా"

"ఎందుకని"

"పూవుని బలవంతంగా వికసింపజేయడం లాంటిదే ఒకమనిషిని తయారుచేయబోవడమూను, పుష్పం సహజంగా వికసించితేనే అందం. వ్యక్తిత్వ వికాసము అంతే. గిరిగీసిన బ్రతుకులో సహజత్వం లోపిస్తుంది".

" సహజత్వం పేరిట రాక్షసుడిగా రూపొందడం కంటే అసహజంగానైనా వికసించిన మానవుడే మేలు"

మీరు దెబ్బతిన్నట్లు చూశారు.

మెల్లగానే అన్నాను. "నాకు రెండు ముఖాల జీవితమంటే అసహ్యమే, నటిగా బ్రతకగలగాలనే కోరుతాను. అందుకే మీముందు నన్ను నేను స్పష్టపరుచుకున్నాను. చెప్పండి. సిద్ధార్థను బేషరతుగా నాకు శాశ్వతంగా ధారాదత్తం చేయదలుచుకున్నారా!"

మీరు సాలోచనగా సిద్ధార్థవంక

ఇద్దరికీ మధ్య బల్లమీద వరచిన కంబళిమీద పవళించి ఉన్నాడా పసిపాప.

"ఒక్కసారి వాడిని లాలించి..ముద్దాడి.. ఆశీర్వదించనీ..."

"క్షమించండి మీరు ముట్టుకుంటే వాడు అపవిత్రుడౌతాడు. మీ స్పర్శంటే ఏర్పడ్డజుగుప్స కారణంగానే కదా నేను మీకు అస్పృశ్యనౌతున్నది.

"శారికా" అరిచారు మీరు. మీ వదనాన్ని ఆగ్రహం ఆవరించింది. మీ నేత్రాలు అరుణిమను తెచ్చుకున్నాయి. నేను జంకలేదు.

"శరీరానికి నువ్వెందుకింత ప్రాధాన్యత నిస్తున్నావు మూర్ఖంగా ? సంస్కృతాంధ్రాలు చదివినదానవే.. శాస్త్రాలూ, పురాణాలూ ఘోషించలేదూ, పాపమనేది ఆత్మకే కాని శరీరానికి కాదని?"

హేళనగా నవ్వాను. "దానినే మెట్టవేదాంతం అంటారు. తప్పుచేసేవాళ్లు వెదుక్కునే రక్షణ అది.అంతరాత్మ లేనివాళ్ళు వెదిక్కొనే కుంటిసాకు అది.అంతరాత్మకలవాళ్ళు నిగ్రహరహితులై ప్రవర్తించరు. మనోనిగ్రహం కలవారికి, శారీరక నిగ్రహం అతిసులభం. తేల్చి చెప్పండి, సిద్ధార్థను నాకిస్తున్నారా ! మీరు తీసుకుంటున్నారా? వాడిని ప్రపంచం గర్వించే మనిషిగా తయారుకానిస్తారా లేక మధుపాత్రల వెనుకా వెలయాలుల వెనుకా క్రీనీడల బ్రతుకు పాల్జేయదలుచుకున్నారా ? "

ఒక్కసారి నా కళ్లల్లోకి సూటిగా చూశారు. ఆ చూపుని తట్టుకోవడం కష్టమే అయింది. అవి నా గుండెలనే చీల్చాయి. హృదయంలోకి చొచ్చుకుపోయాయి.

"తీసుకో"

ఎప్పుడు మీ నోట ఆమాట వస్తుందా అని ఆత్రంగా ఎదురుచూస్తున్నానేమో, మీరు అలా అనడమేమిటి, చటుక్కున సిద్ధార్థను చేతుల్లోకి తీసుకొని యివతలకి వచ్చేశాను. ఆలస్యం అయితే ఆ అమృతఫలం చేజారిపోతుందేమో అన్న భయంతో నాగదిలోకి వచ్చేశాను వరుగుపరుగున, తలుపులు మూసికొని తనివితీరా దుఃఖించాను. అప్పటకి గుండెలు తేలికవడ్డాయి. మనసుకు కొంచెం ఊరటకలిగింది తాత్కాలికంగా అయినా.

మనిషి మంచి చెడులు మరణంతో సరి అంటారు పెద్దలు. ఈ క్షణంలో మీమీద నాకేమీ పగా లేదు, ద్వేషమూ లేదు, అందుకే మనసు విప్పి నిజం మీకు నివేదించుకుంటున్నాను. ఎందుకో తెలుసా ? మీక్షమాపనలర్ధించి. నిజమే ఎందుకో నేను చేసింది. తప్పేమో అని సందేహం కలుగుతూంది. అంతేకాదు సిద్ధార్ధని హంతకుణ్ని చేసింది నేనే అంటున్నది అంతరాత్మ. జీవితాన్ని వెనక్కి తీసుకోగలిగే శక్తి నాకిప్పుడు భగవంతుడు ప్రసాదిస్తే నిశ్చయంగా నేను రెండో మార్గాన్నే ఎన్నుకుంటాను.

ఏ రెండు ముఖాల బ్రతుకునయితే నే నమితంగా ద్వేషించేదాన్నో, దేనికోసం మిమ్మల్ని దూరంచేసుకున్నానో అటువంటి బ్రతుకే మిగిలింది నాకు. మీముందు ఎంత కఠినంగా కనిపించేదాననో, మీ వెనుక అంత కన్నీరు కార్చే దానను. మీకు సిద్ధార్థమీద ప్రేమ అధికమేనని బంధుత్వం లేదు. ఏమీలేదు. రక్తపాతంతోనైనా

నాకు తెలుసు. వాడిని మీకు దూరంచేయాలని నేను రాక్షసంగానే ఆంక్షలు పెట్టేదాన్ని. అన్నింటినీ భరించి, వాడిని కనీసం కళ్ళతోనయినా చూసుకుందామని మీరు తరచుగానే భవనానికి వచ్చేవారు. మీ అవస్థకు మనసులో జాలిపడేదాన్ని, కాని బయటకు మాత్రం క్రూరంగానే ప్రవర్తించేదాన్ని. ఏక్షణంలోనూ నేను బలహీనురాలిని కాకుండా అతి జాగ్రత్తపడేదాన్ని. నాకు జరిగిన అన్యాయం తలచుకునేదాన్ని తరచుగా, ఎప్పటికేనా మీరు "క్షమించు శారికా !! నీకోసం.. మన ప్రేమకోసం..నేనన్ని వ్యసనాలనూ త్యజించాను. ఇకనుంచి వాటన్నిటికీ దూరంగా ఉంటాను. నన్ను చేర్చుకోవూ" అని అడుగుతారేమో అని ఆశపడేదాన్ని, ఎదురు చూసేదాన్ని. మీరలాగవొస్తే క్షమిస్తానని కాదు, ఆ మార్పు మీలో వస్తే సంతోషిద్దామని అంతే. ఆ క్షణం మీ జీవితంలో చివరివరకూ రాలేదు. ఎందుకువొస్తుంది. వ్యసనాల ఊబిలో అడుగుకి జారిపోవడమే తప్ప బయటపడడం అనేది అరుదు. అదీకాక మీరు మారవలసిన అవసరమూ లేదు. మీ ధనంతో స్త్రీల శరీరాలను కొనగలరు. సుఖించగలరు. మనసులోకి ఆలోచన రాకుండా మధుపానంలో మునగగలరు. మీ దృష్టిలో సుఖంగురించి ఉన్నతమయిన ఉద్దేశాలు లేవు. ఒక రకమయిన చీకటికి అలవాటుపడిపోయి అదే వెలుగనే భ్రమలో కొట్టుకుంటూ నిజమయిన కాంతిని చూడలేని, అర్థంచేసుకోలేని స్థితికి వచ్చేశారు. మిమ్మల్ని చూసి జాలివేసేదప్పుడప్పుడు. మీరే కాదు ప్రపంచంలో చాలా మంది అంతో యింతో మీలాగే ప్రవర్తిస్తున్నారు. " నన్ను మీరు పంజరంలో చిలకలాగ నీకూ ఎక్కువ ప్రపంచం తెలియదు. మనిషి ఎలాగ బ్రతుకుతున్నాడో, నేటి మానవుడి కోరికలూ, ఆలోచనలు ఏమిటో అవేమీ నీకు తెలియవు. అందుకే నీ ఆలోచనా సరళీ, జీవిత దృక్పథమూ ఛాందసంగానూ విడ్డూరంగానూ ఉన్నాయ్. నాగరికత గురించి నువ్వు తెలుసుకోవడం లేదు " శారికా. అన్నారు. అయితే మీరొక విషయం గమనించలేక పోయారు. నేను ప్రపంచ ధోరణిపట్ల, మనిషిలో వస్తున్న మార్పు పట్ల అమాయకంగానూ, అజ్ఞానంగానూ లేను. ప్రపంచాన్నీ మనిషినీ అర్థంచేసుకున్నాను. కనుకనే నా సిద్ధాంతాలూ, విశ్వాసాలూ వీటి విలువలతోపాటూ వాటి అవసరాన్నీ స్పష్టంగా గుర్తించాను. వీటి అవసరం మున్నెన్నడూ లేనంతగా ఉంది యిప్పుడే. చీకటిలోనే కదా దీపాలు అవసరం.?

నేటి మానవుడు పురుషార్థాలు నాలుగింటిలోనూ తొలిదీ చివరిదీ అయిన ధర్మమోక్షాలను మాని నడుమ రెండూ అయిన అర్థకామాలను మాత్రమే ఆశ్రయిస్తున్నాడు. అదే జీవితం అనుకుంటూ అంధకారంలో కొట్టుమిట్టాడుతున్నాడు. వీటి పట్లనే అతను అమితాకర్షితుడౌతున్నాడు.

అందుకే నేటి ప్రపంచం వంచనామయ మౌతూంది సామాన్యమానవుడి జీవితం నుంచి సత్యం శివం సుందరం అన్నవి దూరం ఐపోతున్నాయి. "మాతాపుత్ర హిరణ్యాయ.." అన్నది, నిజంగా నిజమౌతూంది. నేటి మానవుడి విషయంలో ధనం ముందు

సరే లక్షాధికారి కావడమే మనిషి ధ్యేయం. తన సుఖాన్నీ విలువనీ అన్నిటినీ రూపాయల పోగుకి కుదవబెట్టుకోవడంలో మనిషి అతనేం కోల్పోతున్నాడో అర్థంచేసుకోలేక పోతున్నాడు. ఈ ధనవ్యామోహం అనే అంధకారంలో అవినీతి, లంచగొండితనం వంచన, స్వార్థం అనే పిశాచాలు స్వేచ్ఛగా విహారాలు సల్పుతున్నాయి. ఇవి వీర విహారం చేస్తూ మనిషిని మరింత గ్రుడ్డివాడినిచేసి వదులుతున్నా యి. బ్రతుకు కంటె బంగారం విలువ పెంచుకో గలుగుతూందంటే యిదెంత దౌర్భాగ్యం కొద్ది రూపాయలకోసం ఎదుటివాడిని నిలువునా హత్యచేసేందుకయినా సందేహించడంలేదు నేటిమనిషి. ధన వ్యామోహం అంతగా ప్రబలిపోయింది. నేటి ప్రపంచంలో మరో దౌర్భాగ్యం ఏమిటంటే జన్మనిచ్చే స్త్రీ, పెంచి పెద్దచేసే స్త్రీ, జీవితాన్ని వెలిగించే స్త్రీ, సృష్టిని నిలబెట్టే స్త్రీ, మగవాడికి భోగ్యవస్తువులాగ మాత్రమే కనిపించడం. అతనికిప్పుడు ఆమె శరీరం నుంచి అనుభవమే కావాలి. ఆమె హృదయం నుంచి పొంగే అనురాగం అక్కరలేదు. దాని విలువనతడు అరయలేదు. స్త్రీని చూసి పురుషుడు మృగమే ఐపోతున్నాడు. అందుకే ఏ వార్తా పత్రిక తెరచినా మానభంగాల వార్త అసంఖ్యాకంగా దర్శనమిస్తున్నాయి. నేటి నాగరికతలో స్త్రీకి పవిత్రతతో పాటు భద్రతకూడా అంతరించిపోతూంది. స్త్రీ శరీరం వ్యాపారవస్తు వు. వ్యాపారాన్ని విస్తృతం చేయగలిగేఉపకరణం స్త్రీ సౌందర్యం. బయటకు అడుగుపెడితే గౌరవం మాట దేముడెరుగు, ఆమెకు భంగపాటే ఎదురౌతుంది. ఇందులో స్త్రీ బాధ్యతలేదనను కాని సౌందర్యం వస్తువులోనేకాక చూసే కళ్ళలోనూ ఉండాలన్నట్లు మార్పు పురుషుడిలో ఎక్కువ రావాలి. అందుకే ఎన్నడూ లేనంతగా సద్గుణాలూ, నైతిక విలువలూ యిప్పుడూ తమ ప్రభావం చూపవలసిన అవసరం ఉంది. ఆశయాలూ, ఆదర్శాలూ శతసహస్రదళ కమలాలై వికసించి ప్రపంచాన్ని పరిశుద్ధంగా వించవలసిన అగత్యం ఏర్పడింది. రాముడో బుద్ధుడో మళ్ళీ అవతరించి మానవాళిని సంస్కరించకపోతే మానవుడు మరీ అధః పాతాళానికి జారిపోతాడు. ఆ ప్రమాదం నుంచి ఎవరో రక్షించాలనుకోవడం వివేకం కాదు, ఈ మహాయజ్ఞానికి ప్రతివారూ యధాశక్తి సహకరించి తీరవలిసిందే. లేకపోతే దీని ఫలం మానవళికందదు. నేనూ నా శక్తిమేరకు కృషిచేయదలచుకున్నాను. ఈ కుహనా విలువల ప్రపంచ పద్మవ్యూహాన్ని ఛేదించడానికొక అభిమన్యుణ్ణి తయారుచేయదలచుకున్నాను. నా అభిమన్యుడి ఆయుధం కరవాలం కాదు. శాంతి, సహనం, సౌశీల్యం మనుషులలో పెంపొందించేందుకు నేనొక ఆదర్శమూర్తిని తీర్చిదిద్ద దలచుకున్నాను. ఒక దీపం వెలిగించాలని ప్రయత్నిస్తాను. అది కొన్ని దీపాలను వెలిగిస్తుంది. అలాగ వెలిగిన దీపాలు మరిన్ని దీపాలను వెలిగిస్తాయి. ఈ కాంతి పరంపరగా సాగుతుంది. ప్రపంచం నిండా కాంతి మానవాళికంతటికి శాంతి. ఐతే నేను మూర్తీభవించదలుచుకున్నది బుద్ధుణ్ణి కాదు. రాముడిని అహింసలో నాకుచాలా ఎక్కువ ఆశలేదు, ప్రస్తుత పరిస్థితులలో అన్యాయాన్ని

సహించడంకాదు. దాన్ని ఎదుర్కోవాలి. అప్పుడే అది త్వరగా తలదించుతుంది. కొంచెమయినా సంఘర్షణ ఉంటేతప్ప శాంతి అనేది ఉదయించదు. శాంతికోసమే అయినా యుద్ధం అనివార్యం. అది ఈనాటి తీరు. సిద్ధార్ధని అలాగే తయారుచేయదలుచుకున్నావు. అందుకే వాడిని అచ్చంగా అంతా నాకే ఉండాలని మిమ్మల్ని వేడుకున్నాను. సిద్ధార్ధని నేను సుగుణరాశిగా రూపొందిస్తాను. అతని సౌశీల్యపు సువాసనలు పరిసరాలను ప్రభావితం చేస్తూ తనవేపుకి ఆకర్షించుకుంటాయి. అతని వ్యక్తిత్వం వారికాదర్శప్రాయమౌతుంది. దీపాలనొకదాని నొకటి వెలిగించుకుంటూ వెళ్ళినట్లు వారు ఆదర్శాలను వ్యాప్తిచేస్తారు. క్రమక్రమంగా ఆ రాజ్యంలో స్త్రీ గౌరవింపబడుతుంది. పురుషుడికి కూడా శీలం అనేది ప్రధానమౌతుంది. దేశంలో వ్యసనమనేది మచ్చుకయినా కనిపించదు. మనుషులు రెండుముఖాలతో బ్రతకవలసిన ఆగత్యం ఉండదు. మానవజీవితం స్వచ్ఛంగా సహజంగా సరళంగా సాగుతుంది. అటువంటి వ్యవస్థ ఏర్పడడానికి సిద్ధార్ధ ఉపకరణం ఔతాడు. వాడి జీవితానికి పవిత్రమైన అర్ధమూ పరమార్ధమూ లభిస్తాయి.

నా భావాలు కొన్ని విని మీరు "ఆంగ్లంలో ఉటోపియా అంటారు. నువ్వు వర్ణించిన ఊహాప్రపంచాన్ని అది ఎన్నటికీ సాధ్యమయ్యేది కాదని విజ్ఞులే అంగీకరించారు. ఆదర్శం అన్న పదానికి అద్దమనే అర్ధముందని నీకూ తెలిసే ఉంటుంది. అద్దంలో కనిపించేవి మిధ్యాబింబాలు. ఇంకా సాపేక్ష సిద్ధాతం ఒకటుంది. ప్రపంచం దానిమీద అధారపడిసాగుతుందని ఐన్‌స్టీన్ అనే మహాశాస్త్రజ్ఞుడు సెలవిచ్చాడు. క్లుప్తంగా చెప్పాలంటే నలుపు లేనిదే తెలుపు లేదు. చెడులేనిదే మంచిలేదు. చీకటిలేని వెలుగు - అర్ధరహితం. జీవితానికి రెండోపక్క మృత్యువు. సుగుణం విలువపొందేది వ్యసనం వల్లనే. ప్రపంచంలో మంచి మాత్రమే మిగిలితే అందరూ ఒక్కలాగే ఉండే సమానత్వం సాధించబడిందో జీవితమంత విసుగైనదీ ఆకర్షణారహితమైనదీ మరొకటుండదేమో, అసలు - ప్రకృతిలోనే, సృష్టిలోనే అసమానతలున్నాయనీ వాటిని సరిచేయబోవడం అసాధ్యమే కాక అవివేకం కూడా అనీ.. అన్నారు.

నేను ఆశ్చర్యంగా చూశాను. మీరు నవ్వి "నేను యిప్పుడు నీకు చదువుకున్న మూర్ఖుడిలా కనిపిస్తున్నానుకుంటాను." అన్నారు. నేను మౌనం దాల్చాను. ఏమనగలను తెలియనివారికయితే తెలియజెప్పగలం కానీ తెలిసియు తెలియనివారికి జెప్ప బ్రహ్మదేవుని వశమే ! నా దీక్ష నిర్విఘ్నంగా సాగుతూంది.

సిద్ధార్ధను నా పద్ధతుల మేరకు పెంచుతున్నాను. వాడు ధరించే దుస్తుల నుంచి, తినే ఆహారం, తిరిగే మేర వరకూ నా జాగ్రత్తలూ నేను తీసుకుంటున్నాను. విద్యాభ్యాసం మొదలు పెట్టకమునుపే వాడికంట ఉత్తమ గ్రంధాలు తప్ప యితర పుస్తకాలు పడకుండా అమర్చాను. వాడికి ఆదర్శవంతమయిన సూక్తులే తప్ప మామూలు మాటలూ తేలికయిన భావాలు వినపడకుండా చేశాను. మాటలు వొచ్చినప్పటినుంచీ సుభాషితాలే పలికించసాగాను. దైవభక్తి , సాటిమానవుల పట్ల కరుణ,

సౌశీల్యం పట్ల ఆకర్షణ కలిగించే నీతికథలే చెప్పేదాన్ని. వాడికి చిన్నతనం నుంచి చెడు చెప్పి ఖండించడం అనే పద్ధతిలో కాక మంచిని చెప్పి అనుసరించమని ప్రబోధించే తీరునే పాటించాను. మీకర్థమయ్యేలా ఆంగ్లంలో చెప్పాలంటే నెగెటివ్ అప్రోచ్ కాక పాజిటివ్ అప్రోచ్‌నే స్వీకరించాను. అప్రియాన్నెందుకు వినాలి అనవసరంగా? ఈ కోణంలో నేను మహాత్ముణ్ణే అనుసరించాను. సిద్ధార్థకు తల్లిగా, గుర్విణిగా చెడుని కనకు - వినకు - చెప్పకు. అదీ నేనసురించిన పద్ధతి. మంచినే చూడు మంచినే విను, మంచినే చెప్పు." నేను గీయబోయే వర్ణచిత్రానికి సిద్ధార్థ నాకు తూలిక. నా ఊహల సిద్ధార్థ కొంత గౌతముడు కొంత గాంధీ కొంత రాముడు కొంత పరశురాముడు కొంత మానవుడు. వీళ్ళందరిలోని సుగుణాలని కలిపితే నేనూహించుకునే సిద్ధార్థౌతాడు.

అదొక దీక్ష. అదొక తపస్సు, అదొక నిరంతర యజ్ఞం. తెల్లవారినప్పటి నుంచీ సిద్ధార్థే నా ప్రపంచం. వాడే నా జీవితం. వాడితోనే నాకు కాలక్షేపం. వాడు వేసే అడుగు మంచి వేపుకావాలి. వాడు పీల్చే గాలి నిర్మలంగా ఉండాలి. వాడు తినే ఆహారం పరిశుభ్రమైనదవ్వాలి. ఆహారాన్ని బట్టి కూడా గుణాలూ వ్యక్తిత్వమూ వికసిస్తాయి. అందుకనే అన్ని జాగ్రత్తలు.

సిద్ధార్థ నిదురపోయే వరకూ బాగానే గడిచిపోయేది. పగలంతా వాడితో చక్కగా కాలక్షేపం జరిగిపోయేది. వాడు నిద్రపోయాక నా సమస్య తలఎత్తేది. ఒంటరితనం నన్ను భయపెట్టేది. శరీరం ఎదురుతిరిగేది. తీరని కోరికలు విచాశాల్లా చుట్టుముట్టేవి. నాహృదయం ఒక స్మశానమై అది వాటికి క్రీడారంగం అవుతుంటే అపరిమితమైన ఆవేదన ననుభవించేదాన్ని శరీరం దహించుకుపోయేది. వొంట్లోంచి జ్వాలలు రేగుతున్నట్లు మంటలుపెట్టేది, మనసు తపించిపోయేది. దేనికోసమో తాపం..దాహం.. దుర్భరమయ్యేవి. వెన్నెలలోకి వచ్చి కూర్చునేదాన్ని. కొంచెమయినా ఫలితముండేది కాదు. ఎంత నిగ్రహించుకుందా మన్నా మీరూ, మీ కౌగిలి జ్ఞాపకం వచ్చేవి, నన్నూరించేవి. నా తపన మరీ అధికమయ్యేది. మనసు లగ్నం అయ్యేది కాదు. మరో విషయం మీద పరిపరివిధాలా పోయేది. బయటకు చెప్పలేని భావాలు చెలరేగేవి. దూరంగా ఔట్‌హౌస్.. అందులోంచి అద్దాల కిటికీల్లోంచి దీపాలకాంతి రంగురంగులుగా, ఆకర్షణావలయాలు విరజిమ్ముతూ. నేనేం కోల్పోయానో దాని విలువ శతసహస్ర గుణితమై పశ్చాత్తాప పరిచేది. కోరిక వేధిస్తూంటే తాళలేక నేనే తప్పుచేశానంటూ మీ వద్దకు పరుగున చేరి మీ పాదాలమీద పడి "మీ కౌగిటిలోకి తీసుకొని నాలోని ఆరాటాన్నీ ఆవేదనని ఉపశమించచే యండి." అని వేడుకోవాలనిపించేది. కాని ఒక్కసారి నా ఆదర్శమూ, దీక్షా, యజ్ఞమూ జ్ఞాపకం వచ్చేవి. మనసు ఎడతెగని సంఘర్షణకు లోనైపోయేది. భరించలేక రాత్రి అయినా చల్లని నీళ్లలో శిరస్నానం చేసేదాన్ని తాత్కాలికంగా శాంతి లభించేది. నిద్రకోసం విశ్వప్రయత్నం గావించేదాన్ని, ఎప్పుడో పట్టేది, ప్రతి రాత్రీ యిలాగే అయ్యేది. శరీరాన్ని తేలికగా తీసివేయడం తొందరపాటే. శారీరక నిగ్రహం

కూడా సులభంగా సాధ్యమయ్యేదికాదు. ఎంత ప్రయత్నం కావాలి దీనికి కూడా ! మెల్లమెల్లగా సాధించగలిగాను. సిద్ధార్ధ పన్నెండేళ్ళ ప్రాయానికి వచ్చాక అప్పటికి హృదయం పొడారి పోయి ఎడారిగా మారింది. శరీరం ఆర్ద్రత గోల్పోయిందేమో. స్త్రీ పురుష సంబంధ సౌఖ్యంపట్ల, హృదయం స్పందించడం మానేసింది ఆ కోణంలో అంతవరకు ఎంత చిత్రహింస అనుభవించానో నా అంతరంగానికే తెలుసు. లోకం కోసమో, సిద్ధార్ధ కోసమో మీరు మా భవనానికి విచ్చేసేవారు. మిమ్మల్ని చూసేసరికి నిగ్రహం సడలిపోయేది. ఒక్కసారి మిమ్మల్ని తనివితీరా కౌగిలించుకొని తపన చల్లార్చుకోవాలన్న ఉద్రేకం ఉరకలు వేసేది, కాని యినగాచి నక్కలు పాలు చేసినట్లు, యిన్నాళ్ళు నిగ్రహించుకొని యిప్పుడు పతనం చెందడమా - అని వివేకం మేల్కొనేది. ఐతే రానురానూ ఈ ఆరాటమూ సంఘర్షణా తగ్గుముఖం పట్టసాగాయి. సిద్ధార్ధ పెద్దవాడవుతున్న కొద్దీ నా బాధ్యత అధికంగా సాగింది. నాకు తెలిసిందంతా వాడికి చెప్పెయ్యాలి. నా ఊహాలు.. ఉద్దేశాలు.. భావాలు.. సిద్ధాంతాలు.. విశ్వాసాలు.. ఆదర్శాలు.. అన్నీ వాడి మెదడులోకి ఎక్కించేయాలన్న వెర్రి ఆత్రతలో వాడి వయసునీ సమర్ధతనీ కూడా విస్మరించేదాన్ని, ఆవేశానికానకట్టు పడ్డాక నాపొరపాటు నాకు తెలిసివచ్చేది. ఎడారిలాంటి ఈ జీవితంలో నందనవనం సిద్ధార్ధే. నేను తరచుగా భగవంతుడ్ని ప్రార్థించేదాన్ని "నా యీ వొక్క కోరికను మాత్రం తీర్చు. సిద్ధార్ధ నా ఆశలపోగు, కలల పంట, నా జీవితం, నా ధ్యేయం నా లక్ష్యం అది నిర్విఘ్నంగా నెరవేరనీ" జీవితంలో ఘోరంగా ఓడిపోయిన యీ దీనురాలి పట్ల భగవంతుడికి దయ కలగలేదేమో. లేకపోతే చక్కగా సాగుతున్న గీతాన్ని మధ్యలో కర్కశంగా త్రుంచివేసినట్లు సిద్ధార్ధ కళ్ళు తెరిచి విశాలప్రపంచంలోకి అడుగుపెట్టకుండా యిప్పుడీ ఉత్పాతమేమిటి? అతన్ని హంతకుణ్ణి చేయడమేమిటి? ఎందుకు నామీద యింత నిర్దయ భగవంతుడికి. జీవితం నన్నెందుకింత దారుణంగా వంచించి వదిలింది.? నేనే కోరరాని కోరికలు కోరానని?

కన్నె వయసులో కలలు సహజమే. నేను కోరినదేమిటి ఐశ్వర్యంకాదు, రూపనీ గుణవంతుడైన భర్తని. అతడు శీలవంతుడు అయి ఉంటే చాలుననుకున్నాను. దేవుడికి వినోదమేమో? కాకపోతే కోరనివి అనుగ్రహించడమూ కోరుకున్నవి తిరస్కరించడమూ ఏమిటి? అతి చిన్న కోరిక..అందరానిదీ, ఎన్నటికి పొందరానిది ఐపోయింది. వేసిన అడుగ్గు వెనక్కిరాదు. ఈ జీవితమిక యింతే, వైవాహిక జీవితం తలచుకుంటే విసుగేవస్తుంది. వంచనే మెదలుతుంది జ్ఞాపకాలలో. మీరు నన్నెందుకలా మోసంచేశారు? మీ వ్యసనాలను తెలియనివ్వకుండా ఐశ్వర్యంతో మా నాన్నగారిని ఎందుకు మభ్యపెట్టారు.? మీరిలా చేయకపోతే మనిద్దరీ జీవితాలు వేరుగా ఉండేవి కద. మీరంటే ఒక వేపు ప్రేమ, మరోవేపు ద్వేషం ద్వంద్వంతో దగ్ధమైపోతూనే వచ్చానిన్నాళ్లుగా. సిద్ధార్ధే లేకపోతే ఏనాడో నా చేతులతో నేనే నా జీవితానికి ముగింపునిచ్చుకునేదాన్నే ఎందుకంటే నా

విశ్వాసాలకీ వాస్తవానికి పొత్తుకుదరదు. నా ఆశలకీ జీవితానికీ రాజీ కుదరదు. అలాగని స్పష్టంగా తేలిపోయింది. ఈ పంతం సడలదు, ఈ పట్టింపువదలదు నేనిలాగే నలిగిపోవాల్సిందే. సిద్ధార్థ అనే నక్షత్రాన్ని చూసుకుంటూ ఈ చీకటిలో ఒంటరిగా అంతులేని జీవన సాగరాన్ని చిన్న నావలో తరించాలని ప్రయత్నిస్తున్నాను. ఉండి ఉండి విసుగేస్తుంది. ఈ జీవితంలో రసమూ సారమూ ఏం మిగిలాయనిపిస్తుంది.

సిద్ధార్థ నా ఆశలకనుగుణంగా పెరుగుతున్నాడు. చాలా మట్టుకు విద్యలు నేర్పుతున్నాను. కొంచెం మాత్రం నేను నియమించిన ఉపాధ్యాయుడు. నేటి విద్యలో ప్రపంచజ్ఞానం అట్టే లేదు. మనిషికి- శీలం గురించీ నడవడిక గురించీ ప్రస్తుత పాఠ్యగ్రంథాలు అసలేమీ చెప్పవు. పతనం చెందుతున్న వ్యవస్థకి విద్యావిధానం కూడా ముఖ్యకారణవే ఔతుంది. అనలిదే మూలకారణమేమో. కాని సిద్ధార్థ మాత్రం జీవితానికి భవిష్యత్తుకి ఉపకరించే విద్యనే నేర్వగలుగుతున్నాడు. తల్లియడల గౌరవం..పెద్దలయెడ విధేయత..వినయం. .చక్కగా అలవరుచుకుంటున్నాడు. విద్యని మెదుడుతోనే కాక హృదయంతో కూడా అభ్యసించగలుగుతున్నాడు. వాడు నాకు గర్వకారణం. రేపు యీ నమాజం సిద్ధార్థని చూసి చాలా తెలునుకుంటుంది. నేర్చుకుంటుంది. అనుసరిస్తుంది. అది చాలదూ నా జన్మ సఫలం చెందడానికీ, నేను మురిసిపోవడానికీ ? సిద్ధార్థ రేపు తన తల్లి గురించి చెపుతాడు. తననంత గొప్పవాడిగా తీర్చిదిద్దిన వ్యక్తి ఆమె అని అప్పుడు నేనూ పొంగిపోనూ గతమంతా మరచి గర్వపడనూ ?

ఈ ప్రపంచంలో ఎన్ని విధాలయిన సన్మార్గాలకు అవకాశాలున్నాయో అన్నింటినీ నేర్పుతున్నాను. పుస్తకాలు నేను చదివి అవి నిజంగా మంచివయితేనే వాడిచేత చదివిస్తున్నాను. వాటిలో కొంచెమే మంచి ఉంటే మిగిలినది చదవకుండా జాగ్రత్తపడుతూ ఆ మంచినే నేను చెపుతున్నాను. సిద్ధార్థకు ప్రపంచంలోని మంచి మాత్రమే తెలియజేస్తున్నాను.

సూర్యోదయంకంటే ముందుగా మేల్కొని ముందు తల్లికి నమస్కరిస్తాడు. తరువాత భగవంతుడికి నమస్కరిస్తాడు. ఆపైన కాలకృత్యాలు తీర్చుకొని వ్యాయామం చేస్తాడు. పాలుతాగి పుస్తకం చేపడతాడు. నిత్యమూ నూర్యోదయాన్ని తిలకిస్తాడు. ప్రకృతి నారాధిస్తాడు.

అతని కంటికి స్త్రీ దేవతలా ఆరాధ్యనీయ, పూజనీయ, అమెకు నమస్కరిస్తాడు తప్ప నీచమయిన భావాలకు మనసులో తావివ్వడు. అంతేకాదు అతను దేనినయితే అన్యాయమూ అక్రమమూ నేరమూ అని భావిస్తాడో అది తన సమక్షంలో జరుగుతున్నట్లయితే అతను రంగంలోకి దూకి ఎదుర్కొంటాడు. అన్యాయాన్ని కేవలం మాటలతో ఖండిస్తే చాలదు, దానితో పోరాడి జయించాలి. అదే నేర్పాను సిద్ధార్థకు.

మధుపానమన్న మాటే అతనికి తెలియదు. మత్తు, మైకం, మాదకత యివన్నీ అతనికెన్నడూ ఎరుగని వింతలు. అంతేకాదు, తాగేవాళ్లు అతనికి శత్రువుల్లాగే కనిపిస్తారు. జూదం అన్నదీ అతనికి

అపరిచిత పదవే. జూదరులూ అతనికి శత్రువులే. అతనికి తెలిసినదల్లా సుగుణాలూ సౌశీల్యమే.

ఇప్పుడు మీ కళేబరాన్ని చూస్తూంటే నాకర్థమౌతూంది, నేను చేసిన పొరపాటేమిటో. మీరు చెప్పినది నిజమే. ఈ ప్రపంచం సాపేక్ష సిద్ధాంతం మీద ఆధారపడి నడుస్తుందేమో.

ఇప్పుడు నాకర్తవ్యమేమిటో సెలవివ్వండి. నాకేమీ పాలుపోవడం లేదు. సిద్ధార్థకు నిజం చెప్పడమే తెలుసు. అందుచేత యీ హత్యానేరాన్ని నామీదకు వేసుకున్నా ఫలితం ఉంటుందను కోను. రేపు న్యాయమూర్తి ముందుకి సిద్ధార్థ హాజరుకాక తప్పదు. ఆ సమయంలో అతను అబద్ధమెరుగని వాడు కనుక నిజం చెప్పక మానడు. పుత్రుడు తండ్రిని హత్యచేయడమే వింతకాగా, భార్య భర్తని హత్యచేసిందంటే విడ్డూరమే కాగలదు. అందులోనూ హతులు జమిందారు. అందుచేత జరిగిన సంఘటన పదిమందినీ మరింత ఆకర్షించుకుంటుంది. వారందరిముందూ మేము దోషులుగా నిలబడాలి. ఈ హత్య నేను చేశానని నేను, తాను చేశానని సిద్ధార్థా చెప్పడం జరిగితే న్యాయస్థానం విస్తుపోతుంది. మరింత ప్రచారం జరుగుతుంది. ఓ పట్టాన న్యాయం తెగదు. అయినా నా ధ్యేయం చెదిరిపోతుంది. నా దీక్ష చెడిపోతుంది. నా లక్ష్యమే సమూలంగా నాశనమై పోతుంది. నా ఆశ ఛిన్నాభిన్నమైపోతుంది. నా జీవితం నిరర్థకమైపోతుంది. నిజం తెలిస్తే చట్టం శిక్షిస్తుంది. అబద్ధమాడి సిద్ధార్థను రక్షించగలిగినా అదీ అతన్ని నాశనంచేయడమే ఔతుంది. నేనే అతన్ని అబద్ధమాడమని ప్రోత్సహిస్తే కంచే చేను మేసిన చందమౌతుంది. అతను నా నోట అబద్ధం వింటే దిగ్భ్రాంతుడౌతాడు. అతని నమ్మకాలన్నీ కూలిపోతాయి. అతని మెదడు సుడిగుండమౌ తుంది. ఏది సత్యం. ఏదసత్యం అన్న మీమాంసకు లోనవుతాడు. జీవితపు విలువలు తారుమారుఅవుతుంటే ఆకళింపు చేసుకోలేక అయోమయంలో పడిపోతాడు.

అతన్నాదుకుందుకు నేనుంటానో ఉండనో పక్కన. నేను లేకుండా ఒంటరిగా ఈ ప్రపంచంలో మనగలిగే జ్ఞానాన్ని నేనింకా సిద్ధార్థకు బోధించలేదు. నేను చేసిన పొరపాటదే. అందుకే ఈ విషమ సంధిలో చిక్కుకుని గిలగిలలాడుతున్నాను. నన్నునేను శాశ్వతమను కున్నాను. సిద్ధార్థ యిలా తొందరపడతాడను కోలేదు. దయనీయమేమిటంటే తానేం చేశాడో తెలుసుకోలేని అవస్థలోనున్నాడు సిద్ధార్థ. అతని ముఖం చూస్తూంటే నన్ను నేనే శిక్షించుకోవాలనిపిస్తుంది. నేనతనికి చేసిన ద్రోహానికి...ద్రోహం. ఔను. ద్రోహమే. మిమ్మల్ని సిద్ధార్థ హత్యచేసేందుకు మూలకారణం నేనే. నా అజ్ఞానం, నా అమాయకత్వం.

ఎంతో విజ్ఞానవంతురాలినని విర్రవీగానే తప్ప అతి ప్రాథమికమయిన విషయాన్నే విస్మరిస్తున్నానని గమనించలేకపోయాను. మీరు చెప్పినదే జీవిత సత్యం. మంచొక్కటే చాలదు. చెడుని కూడా తెలుసుకొని ఉండాలి మనిషి. లేకపోతే ఏనుగూ పదిమంది గుడ్డివాళ్ళ కథలోని ఓ అంధుడే ఔతాడు మనిషి. నేను ఓడిపోయాను. ఇప్పుడు నాకు కావలసింది గెలుపు ఓటమిలు కావు, ఈ విపత్కర పరిస్థితినుంచి బయటపడ డం. నేను సిద్ధార్థకు

నేర్పవల్సిన చదువులో మిగిలిపోయినదాన్ని అతనికి చెప్పడానికి అవకాశమివ్వడం. చేసిన తప్పుని దిద్దుకుందుకు అవకాశమివ్వడం.

ఇలాగ జరిగాక నేను జైలుకి వెళ్ళడానికేమి భయపడడంలేదు. పిరికితనంతో నేనిలాగ కోరుకుంటున్నాననుకోకండి, ఇప్పుడు నేను శాస్త్రోక్తంగానే విధవనయ్యాను. అనాటి నుంచి ఈనాటి వరకూ నేను నా మనసులో వితంతవుగా నటించాను. ఇప్పుడిదే నిజం చేశారు. భగవంతుడిటువంటి కోరికలను ఎక్కువ ఆలస్యం చేయకుండానే నెరవేరుస్తాడను కుంటాను.

మీరు లేని జీవితం ! విధవగా యీ అపరిణత సమాజంలో జీవించడంబందికా నాకంటే బాధాకరమే. దానికంటే జైలుశిక్ష చాలా నయం. మనసులో ముళ్లుగుచ్చే మనుషుల మాటలకీ, హేళనాభరితమయిన చూపులకి దూరంగా ఉండవచ్చు. కాని నేను జైలుకి వెళ్ళేదెలా నేనీ హత్యానేరం నెత్తిన వేసుకుందుకు వెనుకాడడం లేదు. కాని సిద్దార్థ నేను పెంచిన సత్యహరిశ్చంద్రుడు. అంగీకరించడే! అతను తానబద్ధమాడడు. తనకి తెలిసిన సత్యం అసత్యంగా రంగుమార్చుకుంటూంటే భరించనూ భరించడూ. అందుకేగా నాకీ మనస్తాపం.

మీరు అదృష్టవంతులు. అందుకే మీకే సమస్యాలేదు.

"నిన్ను మించిన సమస్య యింకేమిటి!" అంటారా ? పంతాలూ, పట్టుదలలు, ఆశలు, ఆశయాలు నన్నయితే నరకంలోకి తోసేసాయి. కానీ మీకేం మీరు హాయిగానే ఉన్నారు. మీ విలాసాలకూ, భోగాలకు అడ్డేముంది. మీకు స్త్రీ అయితే చాలు, యౌవనవతి అయితే చాలు. అమె భార్య అయినా వెలది అయినా ఒక్కటే. అల్పసంతోషులు. స్త్రీ శరీరం తప్ప ఆమె అంతర్యం మీకు అట్టే అవసరంలేదు. అందుకే కదా మీరూ నా అంతా మొండిగానూ ఉండిపోయారు. నేనప్పుడప్పుడు ఆశపడేదాన్ని. "శారికా ! నీకోసం తాగుడు మానేస్తాను, మద్యాన్ని ముట్టను. పరస్త్రీని వాంఛించను. జూదంజోలికి పోను. జరిగిన దానికి చాలా చింతిస్తున్నాను. దయచేసి గతంమరిచి నన్ను క్షమించి అంగీకరించవూ - అని ఒక్కసారైనా అర్థిస్తారేమో అని ! ఊహూ. నా ఆశ అడియాసే అయ్యేది, ఎప్పటికప్పుడు. మీరడిగితే నేనేమని ఉండేదాన్నని ! ఎందుకులెండి. గతజలసేతుబంధనం నిష్ప్రయోజనమూ నిరర్థకమూ. సిద్దార్థ ఎందుకు మిమ్మల్ని హత్యచేశాడో నేనూహించగలను. మీరు నన్ను యీ విషయంలోనూ క్షమించాల్సి ఉంది. మిమ్మల్ని వాడికి చాలా దూరం చెయ్యకపోతే వాడు కనీసం మీమీద అభిమానంతోనయినాఒక క్షణం ఆగేవాడేమో. పిత్రువాత్సల్యం మీరు చూపబోయినా నేను సైంధవుడిలా అడ్డుపడిపోయేదాన్ని అలాగే సిద్దార్థకూడా ఏ రాజకుమారుల కథలో వింటున్నప్పుడు "అమ్మా నాకు నాన్న" అంటూ అడిగేవాడు. నేను మాట దాటించేసేదాన్ని అంతేకాదు. కథలు చెప్పేటప్పుడు తండ్రిపాత్రను సాధ్యమైనంతవరకు తప్పించో, ప్రాధాన్యతను తగ్గించో చెప్పేదాన్ని, అలాగ నేను మీకు ద్రోహం చేశాను,. వాడికీ ద్రోహం చేశాను. ఇప్పుడు నన్ను నేనే

క్షమించుకోలేకపోతున్నాను.,

తీవ్రంగా ఆలోచించి చూస్తే అర్థమౌతుంది. దేముడు మనిషికి రెండు కళ్లెందుకిచ్చాడో, రెండు చెవులిందుకిచ్చాడో, మెదడూ, హృదయమూ ఒక్కొక్కటే ఎందుకిచ్చాడో.

చీకటి వెలుగూ రెండూ చూడాలనే రెండు కళ్లు.

మంచీ చెడూ రెండూ వినాలనే రెండు చెవులు.

అలాగ చూసినవీ, విన్నవి మెదడుతో శోధించుకొని ఓ అభిప్రాయం ఏర్పరచుకోవాలి. మెదడుని సక్రమమార్గంలో పెట్టేందుకు హృదయం.

సిద్ధార్థను నేను పెంచిన తీరు లోపభూయిష్టమే అనిపిస్తూందిప్పుడు. వాడికి ఒక్కకన్నే తెరిపించాను. ఒక్క చెవినే వినేందుకు సిద్ధం చేశాను. అతని మెదడు సగమే శోధించగలదు. అతని హృదయం సగమే స్పందించగలదు. అందుకే వాడు కన్నతండ్రినే హత్య చేసేంత మూర్ఖుడయ్యాడు.

పైగా వాడిని చూసి నేను గర్వించాలట

ఎటువంటి పెంపకం నాది. ఎంత మోసపోయాను. పరిమళభరితమైన పుష్పాలని పూస్తుందని పెంచిన మొక్క విషపువాసనలను విరజిమ్ముతుందా. ప్రపంచంలో అన్యాయాన్నెదుర్కునే విప్లవకారుడిని రూపొందించబోతే తనే ప్రపంచంలో కొత్త అన్యాయానికి నాంది పలికాడు. బుద్ధుణ్ణి చేయబోతే కసాయివాడయ్యాడు.

చూడండి.. మీరు నన్నపార్థం చేసుకోకండి. నేను మీ వ్యసనాలని ద్వేషించానేకాని మిమ్మల్ని ద్వేషించలేదు. నాకు మీమీద పగ లేదు. సిద్ధార్థ చేత మిమ్మల్ని హత్యచేయించానని ఊహించకండి. మీ మీద గెలుపుతీసుకోవాలన్న మాట వాస్తవమే కాని. ఇలాగ ఎంతమాత్రమూ కాదు. సిద్ధార్థను నేను మీకు వ్యతిరేకంగా ప్రోత్సహించలేదు. మీనుంచి దూరంగా ఉంచినా, మరోలా పెంచినా, ఆ రక్తంలోకి ఐశ్వర్యం తాలూకూ అభిజాత్యమూ వ్యసనాలూ ప్రవేశించకూడదనీ, వాడు ఆదర్శజీవి కావాలని ప్రత్యేకంగా పెంచానంతే. ప్రత్యక్ష హంతకుడు వాడయితే పరోక్షంగా హంతకురాలిని నేను. మిమ్మల్ని నిజంగా హత్యచేసింది - నా అజ్ఞానమూ వాడి అమాయకత్వమూ మేము నీడనిచ్చిన వృక్షాన్నే నరుక్కున్నాం అవివేకంగా.

ఇప్పుడు

సిద్ధార్థ భవిష్యత్తు అయోమయం.

నా జీవితం అంధకారబంధురం

ఈ క్షణాలలో నేను మిమ్మల్ని ఏంకోరుకోగలను.నన్నూ సిద్ధార్థని క్షమించమని ప్రార్థిస్తున్నాను. వ్యసనపరులయినా మీరు విశాలహృదయులు. ఐశ్వర్యవంతులయినా, సున్నితమైన మనసు కలవారు. ఆనాడు మీరాశీర్వదిస్తానంటే వొద్దని సిద్ధార్థను తీసేసుకున్నాను. ఈనాడు నేనే మిమ్మల్ని వేడుకుంటున్నాను. ఒక్కసారిగా వాడిని దీవించండి. ఆశీర్వదించండి. సిద్దార్థ కనీసం కన్నీళ్లయినా కార్చడం లేదనా! మరి..వాడు ..నిజంగా సిద్ధార్థే. వాడికి సగమే జ్ఞానం ఉంది. వాడికి సగమే హృదయముంది.అందుకే వాడు

జరిగినదెంత ఘోరమో అర్థం చేసుకోలేకపోతు న్నాడు. అందుకే శిల్పి మలిచిన శిల్పంలా నిలిచిపోయాడు. ఆ కన్నులలోకి కన్నీరు చిందకుండా, ఆ హృదయం స్పందించకుండా చేసిన పాపాత్మురాలిని నేనే. మనిషి కావలసినివాడిని సగం మనిషిని మాత్రమే చేశాను. ఈ దేశంలో స్త్రీకి కొడుకు కంటే భర్తే ఎక్కువ అన్న కఠోరనిజం నేనిప్పుడు చెప్పానో వాడొక్కసారి కుప్పకూలిపోతాడు. సుగుణరాశి అయిన సుతుని కంటెకూడా వ్యసనపరుడయినా భర్తే భారతస్త్రీకి అధికుడన్న చేదు నిజం వాడు అర్థం చేసుకోనూలేడు, అంగీకరించి భరించనూలేడు. అందుకే నారెండు కళ్లల్లోనూ ఒకటి మీకోసమూ మరొకటి వాడికోసమూ యింత కన్నీరు కారుస్తోంది.

సిద్ధార్థ : నా పేరు సిద్ధార్థ. నేనిప్పుడు అయోమయంలో పడిపోయాను. అమ్మ ఏడుస్తూంది. ఆమె దుఃఖానికి కారణమేమిటో నాకు తెలియదు. నిజానికి ఆమె అమితంగా సంతోషించాలి నేననుకున్నట్లు జరిగితే. ఆనందించడం లేదు సరికదా నా మాతృశ్రీ కన్నీరుమున్నీరుగా విలపిస్తూంది. అదీ అపవిత్రుడి శరీరాన్ని ఒళ్ళో పెట్టుకొని ! అతి పవిత్రురాలయిన మాతృమూర్తి ఆ దుర్మార్గుడిని స్పృశిస్తూ ఎందుకిలాగ మలినపరుచు కుంటూంది. తనని తానే? నాకేమీ అర్ధకావడం లేదు. అతని రక్తాన్ని తుడుస్తూంది తన పైటకొంగుతో. అతని శిరస్సు గుండెలకాన్చుకొని కన్నీటితో ప్రక్షాళనం చేస్తూంది. ఏమిటీ విచిత్రం. ఎప్పుడూ లేనిది అమ్మ అన్నీ యిలా చేస్తూందేమిటీరాత్రి ? నన్నెంతో ముద్దుగా చూసుకునేదల్లా యిప్పుడు శత్రువుని చూసినట్లు చూస్తుందేం దుఃఖపు తెరల మధ్య ? నేనేంతప్పుచేశాను. అమ్మ పెంపకంలో నేనసలు తప్పుచేస్తానా? తప్పు అంటేనే నాకు తెలియదే.

అవినీతి.. దౌర్జన్యం వీటిని సహించకూడదు. అవి విషపుపాముల కంటే ప్రమాదకరమైనవి. పాము కొద్దిమందిని మాత్రమే కాటువేస్తుంది. అదీ తన ప్రాణానికి భీతి కలిగితే మాత్రమే. దుర్మార్గుడు సమాజాన్నంతటినీ కలుషితం చేసి వదులుతాడు స్వార్థంకోసం. అందుచేత దుర్మార్గం కంటపడిందో దానిని అప్పటికప్పుడు అక్కడికక్కడే అంతమొందించాలి. క్షణమయినా జాప్యం చేయకూడదు. అన్యాయాన్ని నోటితోనే కాదు చేతితోనూ కూడా ఖండిచడమే ఉత్తమ మానవుడి లక్షణం. పట్టాలు తప్పి కూలిపోతున్న ఈ వ్యవస్థను పునర్నిర్మించడానికి శాయశక్తులా కృషీ త్యాగాలూ చేయడం ప్రతి మనిషికీ కర్తవ్యం. సుకుమారి అయిన స్త్రీ పూజనీయ. ఆమె మీద అత్యాచారం చేసే మగవాళ్లు జాతికి చీడ పురుగులే. అటువంటివారి నేరిపారెయ్యాలి. ఇలాగ బోధించేది అమ్మ. అన్యాయాన్ని ఖండించడంలో స్వపరభేదాలుండకూడదంది రోజులాగే యీ రాత్రి అమ్మ యిచ్చిన పుస్తకము "సౌజన్యము, సౌశీల్యము" చదివి తొమ్మిదిన్నర కాగానే అలవాటుగా పాలుతాగి దీపం ఆర్పి మంచంమీదచేరాను. భగవధ్యానం చేసుకున్నా ను. నిద్రపోవాలని కళ్లుమూసుకున్నాను. నిముషాలు గడుస్తున్నాయి కాని నిద్రపట్టడంలేదు. ఇదొక అరుదైన విషయం. ఎప్పుడో తప్ప యిలాగ జరుగదు. అమ్మ ధైర్యం

నాగదిలోకి వొచ్చింది నేను నిద్రపోతున్నానో లేదో చూడడానికి. అదీ ఆమె క్రమశిక్షణలోని భాగమే. తిండీ, నిద్రా, ఆట, విద్యా అన్నీ వేళకే జరగాలి. అదే మంచిదట. అమ్మ పద్ధతులన్నీ నాకు నచ్చుతాయి., కొన్ని తప్ప. అవేమిటంటే అమ్మ నన్ను ఒంటరిగా బయటకు తిరగనివ్వదు. నా యీడు కుర్రవాళ్ళతో ఆడుకోనివ్వదు. వాళ్ళు మా యింటికి రావలిసిందే. మేము మా భవనంలో ఆడుకుంటున్నా అమ్మ మమ్మల్ని గమనిస్తూనే ఉంటుంది? ఇబ్బందిగా అనిపించేది. తరువాత మాఇష్టం వొచ్చిన ఆటలు ఆడుకోవడానికి వీలులేదు. మాతోటలో ఎన్నో చెట్లున్నాయి. వాటి మీద చక్కగా కోతికొమ్మచ్చులాడుకుందామని మనసు ఉత్సాహపడేది నాకూ, మిగిలిన అబ్బాయిలకీ. కానీ చెట్లెక్కితే పడిపోతామట. దెబ్బలు తగులుతాయట. మరి మా తోటమాలి అప్పుడప్పుడు చెట్లెక్కి కాయలు కోస్తూంటాడు కదా వాడు పడడేం? వాడికి దెబ్బలు తగలవేం. ఈ సందేహాలు అమ్మనడగాలనిపిస్తుంది. కాని పెద్దలకు విధేయుడుగా ఉండాలి. వారిమాటకెదురుచెప్పకూడదు. పాఠాలు గుర్తుకు వొస్తాయి. అవన్నీ అమ్మ చెప్పినవే. ఉండుండి నాకు ఒంటరిగా అలా తిరిగి రావాలనిపిస్తుంది. కాని అమ్మకూడా నాతో వస్తానంటుంది. కారు తీస్తాడు డ్రైవరు. ఇవి నాకు నచ్చవు. బజారుకి వెళ్ళినట్లుగా వెళితే ఏంబాంగుంటుంది షికారు. పొలాలగట్లు, చెరువుగట్టు హాయిగా ఒంటరిగా తిరిగి చూడాలనిపిస్తుంది. అమ్మనడగడానికి ధైర్యం చాలదు. ఆమె కాదంటుందనికాదు. ఎప్పుడూ నేనడిగింది కాదనదు. కాని తనూ తయారౌతుంది. కుర్రాళ్లతో చేరితే దుస్సహవాసాలలవడుతాయిట. అందుకని తనతోనే స్నేహం చెయ్యమంటుంది. అమ్మ మంచిదే. నాతో ఆడుతుంది. పాటలు నేర్పుతుంది. ఒక్కసారీ కేకలెయ్యదు. ఉండుండి నన్ను ముద్దుపెట్టుకుంటుంది, వొడిలోకి తీసుకుని. నేను చక్కగా చదువుకొని అమ్మ అడిగినవాటికి సరైన సమాధానలిస్తానే. అప్పుడయితే "నా బంగారు తండ్రే ! రత్నాలమూట.. సుగుణాలరాశి..మంచిబాబు!" అంటూ నా తలని వెచ్చని తన గుండెలకదుము కుంటుంది. నా తలమీద టప్‌టప్‌మనీ కన్నీరు పడుతుంది. ఆశ్చర్యపడి అమ్మముఖంలోకి చూస్తాను. "ఏడుస్తున్నావా అమ్మా! దేనికి,".

ఇది దుఃఖం కాదు. బాబూ, ఆనందం, నువ్వు నా కలలను నిజంచేస్తున్నావని కలుగుతున్న మురిపెం. నువ్విలాగే పెద్దవాడివి కావాలి." అంటుంది. చాలా చిన్నప్పుడు నాకు అమ్మ ప్రతిరాత్రీ ఎన్నెన్నో కథలు చెప్పేది. అవన్నీ దేముళ్ళకథలూ మంచివాళ్ళ కథలే. వాటిమధ్య వచ్చే రాక్షసుల గురించి అడిగితే "అక్కర్లేదు సిద్ధార్థా వాళ్లగురించి నువ్వు తెలుసుకోకూడదు. ఎప్పుడూ మంచినే చూడాలి. నువ్వు మంచివాడివి." అనేది. నాకు మరో సందేహం కూడా కలిగేది, నాన్నగారి గురించి. నేను విన్న కథలలోనూ చదివిన వాటిలోనూ నాలాటి వాళ్ళందరికీ నాన్నలుండేవారు. వాళ్లు మా నాన్నగారిలా ఎప్పుడో వారానికో, పదిరోజులుకో ఓ సారి యింటికి రావడం కాక ఆ పిల్లలతో ఆ యింట్లోనే ఉండేవారు. ఆడుకునేవారు. చదువు చెప్పేవారు. బళ్ళో వేయించేవారు. ఒకసారి

చేసి ఆ విషయమే అడిగేశానమ్మని . "అమ్మా! నాన్నగారూ మనింట్లో ఉండరేం. ఎప్పుడో ఒకసారి వచ్చి నన్ను ఆడించకుండానే వెళ్ళిపోతారేం. నన్ను బళ్ళో వేయిం చరేం. బడికివెళ్ళి చదువుకోవాలిటగా అందరూ. బడి చాలా బాగుంటుందిటగా?" అమ్మ నావైపు అదోలా చూసింది. నాకు భయం వేసింది. "వొద్దులే అమ్మా! చెప్పొద్దులే, కోపంగా చూడకు" అన్నాను. తల వంచుకొని.

"మీ నాన్నగారికి పనులెక్కువ చాలా గొప్పవారు అందుచేత యింట్లో వుండేందుకు అట్టే కుదరదు. మరి నీతో ఎలా ఆడుకుంటారు? బడి బాగానే ఉంటుంది కానీ అంతకంటే మంచి చదువే నీకు నేను చెబుతున్నానుగా ! ఇంకా యింటికి వొచ్చే టీచరు చెపుతున్నారు. బడిలో మనకు కావల్సింది వాళ్ళు చెప్పరు. వారు చెప్పిందే మనం నేర్చుకోవాలి. అంతకంటే నువ్వు నేర్చుకునే పద్ధతే మంచిది" కాబోలనుకున్నాను.

అమ్మనాకు సూచన ప్రాయంగా చెప్పింది నాన్నగారితో అధిక ప్రసంగం చేయవొద్దనీ, ఆయన మీదపడకూడదనీ. నేను అలాగే ఉండేవాడిని. చుట్టు పక్కల వాళ్లు నన్ను బుద్దిమంతుడని అంటున్నారుట. వాళ్ళ పిల్లల్ని నన్ను చూసి నేర్చుకోవాలంటున్నారుట ఇవన్నీ అమ్మే చెప్పేది అమ్మే నన్ను తరచుగా పొగుడుతూనే ఉండేది. బాగా చదువుకున్నా అమ్మ ఆశించినట్లు జవాబులు చెప్పినా నన్ను ఎక్కువగా అభినందించేది.

ఆ రాత్రి నాకు నిద్రవట్టలేదని చెప్పానుకదా ! అంతకుముందే నాకు అమ్మ కీచకుడి కథ చెప్పింది. ఆ కథ గురించే ఆలోచిస్తున్నాను. ద్రౌపది- అమ్మ చెప్పిన ద్రౌపది – కీచకుడి చేత వరాభవించబడడం తలుచుకుంటూంటే నాకు కోపం వొచ్చేస్తూంది. ఇటువంటి కథవినడం యిదే మొదటిసారి నాకు. సరిగ్గా అప్పుడు

దూరంనుంచి ఎవరో కేకవేసినట్లు ఉంది. నేను కథ గురించి ఎంత తీవ్రంగా ఆలోచిస్తున్నానంటే ఆ కేక వేసింది ద్రౌపదే ఏమో అని అనుమానం కలిగింది. ఒక నిమిషం తరువాత వివేకం మేల్కొంది. బయటకు వచ్చాను గదినుంచి. భవనంలో ఎక్కువ దీపాలు వెలగడం లేదు కాని ఔట్‌హౌస్‌లో మాత్రం వెలుగుతున్నాయి. ఆ కిటికీలకున్న రంగురంగుల అద్దాల కాంతులు కనబడుతున్నాయి. ఒక్కసారి నాకు అమ్మమాటలు గుర్తుకువచ్చాయి. ఎప్పుడో అడిగాను ఆ ఇల్లు ఎవరిది? ఎంతో బాగుంటుంది.

"అది మీ నాన్నగారిది"

" ఒకసారి అది చూపించవూ"

"వొద్దు అది మనదికాదు"

"పోనీ యీ సారి నాన్నగారు వచ్చినపుడు అడిగేదా చూపించమని" ?

"వొద్దుసుమా " వారిస్తున్నట్లంది.

"ఏం అడిగాను?"

"అది మనకు నిషిద్ధ స్థలం మనం వెళ్ళకూడదు. అదొక పాపకూపం అక్కడ అడుగుపెట్టామో మనమూ అపవిత్రులమై పోతాం" అవేశంగా అంది అమ్మ.

'వివరంగా చెప్పమ్మా లేకపోతే నాకేం అర్థమౌతుంది."

"వొద్దు, అటువంటివి తెలుసుకోవడం అనవసరం.'

అమ్మ అలాగే ఆపేసిందా ప్రసంగం. నా మెదడులో ఔట్‌హౌస్ కుతూహలం రేకెత్తించేదిగా మిగిలిపోయింది.

ఔట్‌హౌస్ వైపు నుంచి కేకవినిపించింది. అక్కడ ఎవరికే ఆపద సంభవించిందో! అందులోనూ కేక వెలువడింది స్త్రీ కంఠం నుంచిలా ఉంది. స్త్రీని రక్షించడం మగవాడి కర్తవ్యం కాదూ? కర్తవ్యాన్ని నిర్వర్తించడం మానేస్తే నేరమే కాదూ?

భవనం దాటి తోటలోకి చేరాను.

వెన్నెల ఎంతబాగుంది. తోటలో చెట్లమీద పడుతోన్న వెన్నెల వింతగా మెరుస్తూంది. పగలు ఆకుపచ్చగా ఉండే ఆకులు వెన్నెల్లో నల్లగా ఉన్నాయేమో ? ఎండకీ, వెన్నెలకీ యిటువంటి తేడా ఉందా, రెండూ కాంతే ఐనా. ఇన్నాళ్లు నాకు తెలియనే తెలియదు.నేను తెలిసికోవలసినవి, నేర్చుకోవలసినవి చాలా మిగిలిపోయాయా అమ్మా ఎన్నెన్ని పాఠాలు చెపుతూ వచ్చిందని.

చల్లగా గాలివేస్తూంది. పైనుంచి వెన్నెల వెండినీరులా కురుస్తోంది. వెన్నెల్లో తోట మహాచక్కగా ఉంది. తోటలోంచి ఏవో పక్షులు కూస్తున్నాయి. ఉండుండి పక్షుల రెక్కల చప్పుడు.

మళ్లీ ఆర్తనాదం !

ఇంక నాకు ఏమీ తెలియదు. నేను నన్ను మరిచిపోయి పరుగెత్తాను. ఆ కేక ఔట్‌హౌస్‌లోనుంచే వెలువడింది. ఆకేక వెలువడిన చోటుకి చేరడం నాధ్యేయం. శబ్దవేదిలా దూసుకుపోయాను. సరిగ్గా లక్ష్యాన్ని చేరాను.

అదొక విశాలమైన హాలు. అటువంటి హాలుని నేనెన్నడూ చూడలేదు. మాభవనంలో , నిజానికంతకంటే విశాలమైన హాలులే ఉన్నాయి . ఆ హాలు గోడలకి మా గోడలకి మల్లె దేవుళ్ళఫొటోలు లేవు. బుద్ధుడు లేడు. రాముడు లేడు. గీతోపదేశం పొందుతున్న అర్జునుడు లేడు నరికదా నాకెన్నడూ పరిచయంలేని చిత్రాలున్నాయి. ఒక చిత్రంలో స్త్రీ, పురుషులొకరి కౌగిలిలో ఒకరు కరిగిపోతున్నారు. అర్ధనగ్నంగా ఉన్న స్త్రీ ఉందొక చిత్రంలో. పరిపూర్ణ లగ్నంగా ఉన్న స్త్రీ శిల్పం ఉందొక మూల. ఆ శిల్పం కనిపించదేమో అని కాబోలు అక్కడొక దీపం వెలుగుతూంది ప్రత్యేకంగా, ఆ గది గోడలనిండా అటువంటి చిత్రాలే, మూలమూలలా ఆ రకం శిల్పాలే. మతిపోయినట్లయింది. తేరుకొని చూశాను. ఆ గదిలో ఒక పురుషుడూ, ఒక స్త్రీ. మేజామీద సీసాలతోమెరుస్తున్న పానీయాలు, పళ్ళేలలో ఉన్న తినుబండారాలు, చాండ్లియర్స్‌నుంచి పడుతున్న మెత్తని వెలుగు, గదిలో ఒక వేపు విశాలమయిన మంచం. దానిమీద చక్కని శయ్య.

హఠాత్తుగా ఆ పురుషుడు స్త్రీ వేపు అడుగువేశాడు.

అప్పటికే ఆమె అర్దనగ్నంగా ఉంది. పాపం.. ఆమెకు మంచి బట్టలు లేవేమో, అతను ఆమె చెయ్యిపట్టుకొని తన వేపుకు, తనమీదకు లాక్కుంటున్నాడు. ఆమెకెవ్వుమని కేకవేసింది మళ్లీ.

ఇంక నన్ను నేను నిగ్రహించుకోలేక పోయాను. నా సమక్షంలో నా కళ్లముందు యిటువంటి ఘోరమూ, నేరమూ జరగడానికెంత మాత్రమూ వీలులేదు. దీన్ని నేను తీవ్రంగా గర్హించడమేకాదు. ఎదుర్కొంటాను కూడా ఖండించి తీరుతాను. అతనలా పశువులా ఆమెనాక్రమించుకోకూడదు. ఆ అబలను హింసించకూడదు. నేను సహించను నా రక్తం ఉద్రేకంగా వేడెక్కి మరుగుతూంది. అందుబాటులో ఆయుధమేదీ కనిపించలేదు. అతన్ని శిక్షించాలి. ఎలా ? వాళ్లు నన్ను చూసినట్లు లేదు. మూలగా ఉన్నారు. ఆమె నేను విన్న కథలో ద్రౌపది, అతను కీచకుడు...నేను భీముడినై యీ అన్యాయాన్ని అబలమీద జరుగుతున్న అత్యాచారాన్ని ఖండించాలి.

ఆవేశంగా..ఉద్రేకంగా..ముందుకురికాను. అతనిమీద పడ్డాను. అతను త్రుళ్ళిపడ్డట్లున్నాడు. ఆమెకూడా భయంగా ఒక మూలకు పరుగెత్తింది. అతను విజృంభించబోతుంటే నాచేతికందిన సీసాతో బలంగా అతని తలమీద కొట్టాను. ఆ దెబ్బ ఆమెకే తగిలినట్టు కేకవేసింది. ఒక్కసారి నావేపు చూసి ఏదో స్ఫురించినట్లు బట్టలు వేసుకొని అక్కడనుంచి పరుగెత్తింది. అతను కుప్పకూలిపోయాడు. నాశరీరం మీద, దుస్తుల మీద రక్తం చిమ్మింది. ఒక్కసారతను కన్నులు తెరిచి నన్ను చూసి ఎంతో ఆశ్చర్యంగా "నువ్వా సిద్ధార్థా" అన్నాడంతే. తల వాల్చేశాడు.

అప్పుడు గుర్తించాను. అతను మానాన్నగారే అని ! అయినా నాలో ఏమీ బాధకలగలేదు. అతనొక నేరస్తుడు. నేరం చేసినందుకు శిక్షననుభవించాడు.

నాకెంతో ఆనందంగా ఉంది. ఇంకెంతో గర్వంగా ఉంది. ఇప్పటికి నేను మనిషినవడం ప్రారంభించాను. అన్యాయాన్ని తొలిసారిగా నాకు నేనుగా ఎదుర్కొన్నాను. ఇది నా తొలివిజయం. శిష్టరక్షణ, దుష్టశిక్షణలకు నేడే నాందిపలికాను. అన్యాయంమీద విజయశంఖం పూరించగలిగాను. ఒక స్త్రీ మీద జరుగబోతున్న అత్యాచారాన్ని సమయానికి నివారించగలిగాను. అమ్మ చెప్పిన పాఠాలను మొదటిసారిగా ఆచరణలో పెట్టాను. ఇందుకు నన్ను అమ్మ అభినందిస్తుంది. ఆశీర్వదిస్తుంది. ఎంతో ఆనందిస్తుంది. నేను సాధించిన విజయాన్ని అమ్మకు చూపాలి.

భవనంవేపు నడవసాగాను. ఆనందంతో నా మనసు తేలిపోతూంది. ఎందుకో నాకు గర్వంగా అనిపిస్తూంది. త్వరగా నడిచి అమ్మను చేరాను. అమ్మ నాకోసమే వెతుక్కుంటూందని నాకు తెలియదు. అమ్మ తన గదిలో లేదు. ఎక్కడుంది. పిలుస్తూ ప్రతీ గదీ వెదికి అమ్మను కనుక్కున్నాను. నన్ను చూసి ఒక్క క్షణం ఆనందించి అంతలోనే కంగారుపడడం ప్రారంభించింది. ఏం జరిగిందో చెప్పమంది. నేను చెప్పలేదు. ఆమె చెయ్యిపట్టుకొని ఔట్‌హౌస్‌కు తీసుకువచ్చి నేనుచేసిన ఘనకార్యం చూపాను. చనిపోయిన అతన్ని చూసింది అంతే. అమ్మ ఎన్నడూ లేనంతగా మారిపోయింది. ఒకటే ఏడుపుకి లంకించుకుంది. అసహ్యంగా రక్తాలు కారుతున్న అతన్ని, ఆ దుర్మార్గుణ్ణి, నీచుణ్ణి,

తన వొడిలోకి తీసుకొని కన్నీరు కార్చసాగింది.

ఏమిటీ అమ్మ ? ఆనందించవలిసిన తరుణంలో దుఃఖిస్తుంది. "అమ్మా అతను ఒక స్త్రీ మీద అత్యాచారం చేయబోతున్న పాపి, నీచుడు, నేను సరిగ్గా సమయానికి రాకపోతే ఆ స్త్రీ యితని పశుబలానికి బలైపోయి శీలం కోల్పోయి ఉండును. అపవిత్రురాలయిపోయి ఉండేది. నువ్వతన్ని ముట్టుకోకు. మైలపడిపో తావు."

అమ్మ నావంక ఎలాగ చూసిందని ! భయం వేసింది. కుంచించుకుపోయాను, నాలోకి నేనే. తప్పుచేసినవాడివంక చూసేటట్లు చూస్తూందే నావొంక ఒక్కమాటయినా అనదేం.

"అమ్మా ! నువ్వతన్ని ముట్టుకోకు.. అపవిత్రమౌతావు." మళ్ళా హెచ్చరించాను.

ఈసారామె కళ్ళు నిప్పులే కురిశాయి. "నేను హిందూ స్త్రీని, నాకు భర్తకంటే పవిత్రుడైవరూ ఉండరు. చివరకు పరమేశ్వరుడయినా పతిదేవుడి తరువాతే." "నీకు నాకంటె కూడా అతనే ఎక్కువా" దెబ్బతిన్నట్లు గిలగిలలాడిపోయింది. నాహృదయం. అమ్మ యిప్పుడు కొత్తగా మాట్లాడుతూంది. కొత్త విషయాలు చెబుతోంది.

"మీ నాన్నగారాయన. గౌరవించడం నేర్చుకో. నీ ప్రశ్నకు సమాధానం చెబుతాను విను, అర్థంచేసుకో, ఆవేశపడకు. ఈ దేశంలో స్త్రీకి పుత్రుడికంటే భర్తే అధికం."

"కాని ..ఆయన.. అపవిత్రుడు, స్త్రీమీద అత్యాచారం చేయబోయినవాడు."

"మధువు సేవిస్తారూ, జూదమూ ఆడుతారు అయినా సరే." కటువుగా ఉందామె స్వరం. నేను నివ్వెరపోయాను. నిర్ఘాంతపోతూనే అడిగాను.

"నిజంగానా" "నూటికి నూరుపాళ్ళు" ఖచ్చితంగా అంది. నాకు మతిపోయింది. ప్రపంచమంతా గిర్రున తిరుగుతున్నట్లయింది. ఏమిటీ దమననీతి ! ఏమిటీ ద్వంద్వం నాకు చెప్పినదొకటి, తనుచేసేదొకటి, "మరి నాకిది ఎందుకు చెప్పలేదు" నిలదీసినట్లే ప్రశ్నించాను.

"నువ్వు మగవాడివి కనుక స్త్రీ ధర్మాల గురించి నీకు చెప్పనవసరం లేదేమో అనుకున్నాను. పైగా నువ్వు తొందరపడ్డావు.

"అమ్మా"

"ఔను నువ్వు హంతకుడివయ్యావు. నీ తండ్రినే హత్యచేశావు."

"నేను హత్యచేసింది అన్యాయాన్ని" రోషంగా అన్నాను.

"కాని ఆ అన్యాయం నీ తండ్రి. పితృహత్య మహాదారుణం. ఘోరపాతకం"

"తప్పుచేసినవారిపట్ల స్వపరభేదాలుండ కూడదని నువ్వే బోధించావు."

"సిద్ధార్థా!" జాలిపడుతున్నట్లు చూసింది నావంక. "ఏ నియమానికయినా కొన్ని సడలింపులుంటాయి."

"ఈ విషయం నువ్వింతవరకూ నాకు చెప్పలేదు."

"మనిషివి కనుక నీకు నువ్వే తెలుసుకోగల వనుకున్నాను."

"నువ్వు నన్ను గీతమీద నడిపించావు. నువ్వు గీసిన గిరి దాటకుండానే నేను నడిచాను. నీ పెంపకంలో నాకు నేనుగా ఆలోచించుకునే

స్వతంత్రతకి అవకాశంఎక్కడయినా ఉండేదా !"

" అదే పొరపాటు చేశాను."

"కాని పొరపాటుచేసింది నువ్వయితే నేనెందుకు బలికావాలి."

"సిద్ధార్థా ! " ఆవేశం ఆపుకోలేనట్లు అరచింది."

"ఔను. నేరం చేసింది నువ్వు. దానిని నామీదకు నెట్టబోతున్నావు. నేను చేసింది నూటికి నూరుపాళ్లు సమంజసమే. నువ్వు నేర్పిన విద్య నేరం చేసినవాడు తండ్రయినా సరే. అతనిపట్ల విచక్షణ చూపమనడం లేదు."

"ఆపు ..నేను వినలేకపోతున్నాను. నీకేమీ తెలియడం లేదు. నీకు జ్ఞానం బోధించానో, అజ్ఞానం బోధించానో నాకే అర్థం కాకుండా పోతూంది. నాకంతా అయోమయంగా ఉంది. సిద్ధార్థా ! నన్ను నిలదీయకు. నేనెటూ చెప్పలేని సందిగ్ధంలో విలవిలలాడిపోతున్నాను."

"ధర్మాధర్మాలూ, సత్యాసత్యాలూ వీటిని తేల్చిచెప్పవలిసిన అవసరం ఏర్పడినపుడు మౌనం వహించడం కూడా మహాపాపమే ఔతుంది. – అని భగవద్గీతాసారం బోధించావే.. నీకు నేను జ్ఞాపకం చెయ్యాలా? " ఏమిటో అమ్మ అతి చిత్రంగా మారిపోయింది. ఎందుకిలా శిలలాగ ఉండిపోతావు. " నేనెన్ని అడుగుతున్నా ఉలుకుపలుకూ లేకుండా ! ఇప్పుడు అంతా అయోమయంగానూ ఆశ్చర్యంగానే ఉంది. నాన్నగారు భవనానికి వచ్చినపుడు ఎలా ఉండేవారు. జోళ్లు అవతల విప్పి కాళ్ళు కడుక్కొని పూజా మందిరంలోకి వచ్చి దేముడికి నమస్కరించేవారు. సిగరెట్ కాల్చేవారుకారు. మరి అక్కడ ఔట్‌హౌస్‌లో ఒక దేవుడు బొమ్మయినా లేదు. కాల్చిపారేసిన సిగరెట్లు, మేజామీద సీసాలతో ఏమిటది." తను దానితోనే అన్యాయాన్ని అంతంచేశాడు. ఆ సీసా పగిలి ఎటువంటి వాసన వచ్చింది. ఇప్పటికీ గది నిండా అదే వాసన. భవనంలో దేవుడికి ఊదొత్తులు వెలిగించే నాన్నగారు ఔట్‌హౌస్‌లో సిగరెట్ పీలుస్తూ కనపడ్డారు. అమ్మచెప్పలేదు కాని అదెందుకో నాకు చాలా తప్పులాగ కనిపించింది. అమ్మకి దగ్గరగా అయినా రాని నాన్నగారు ఇక్కడ ఎవరో స్త్రీని బలవంతంగా తన మీదకి లాక్కుంటూ కనిపించేసరికి నేను భరించలేకపోయాను. మతిపోయింది నాకు ఉద్రేకంలోనూ, అన్యాయాన్ని అణిచివేయాలన్న ఆవేశంలోనూ, ఒక మంచిపనిచేసి నా జీవితాన్ని సార్థకంచేసుకుందామన్న ఉత్సాహంలోనూ. నాన్నగారు చేస్తున్నది ఘోరమైనా నేరంలా కనిపించింది. అంతే విజృంభించేశాను. ముందు వెనుకలాలోచించవలసిన అవసరం నాకేమి కనిపించలేదు. మంచిపనికి ఏ క్షణమయినా సుముహూర్తమే అని ఎన్నోసార్లు చెప్పింది అమ్మ.

అమ్మ నన్నెందుకు శిక్షిస్తూందో, నన్నెందుకు తీవ్రంగా నిందిస్తూందో నాకేమీ తెలియడంలేదు. అంతకంటే నన్నపరిమితంగా వేదిస్తున్నదేమి టంటే, "నా ఆశలు నాశనమయ్యాయి. నా కలల మేడ కూలిపోయింది. నా వ్రతం చెడిపోయింది. నా దీక్ష నడలిపోయింది. నా జీవితమే విఫలమైంది." అంటూ నన్ను పట్టుకొని అమ్మ ఏడ్వడం.! ధర్మాధర్మాలలో ధర్మాన్నే చెప్పింది. న్యాయాన్యాయాల్లోని న్యాయాన్నే చెప్పింది. కర్తవ్యాకర్తవ్యాల్లోని కర్తవ్యమే బోధించింది.

నుగుణదుర్గుణాలలోని నుగుణాలనే చిత్రీకరించింది. నేను ఆ మేరకే ఆ సగం మేరకే తెలుసుకోగలిగాను. ఔను. నేను సిద్ధార్థను మరి.

దోషి శిక్షార్హుడనే తప్పు ఆ శిక్ష విధించే అధికారం నాకు లేదనీ అందుకు సమర్ధమైనది చట్టమనీ అమ్మ చెప్పలేదు. అమ్మ చెప్పినవే తప్పు చెప్పనివేమీ నాకు తెలియదు. నేను అమ్మ బోధనలు మలిచిన మనిషిబొమ్మనంతే. నాకదలికలన్నీ అమ్మ చేతిలోని దారాలను బట్టే. నేను అమ్మ ఆడిన ఆటల్లో పావుని. ఇదంతా అమ్మకు తెలుసు. ఇలా జరిగాక నన్ను నన్నుగా గాక తన కోరికల రూపంగా పెంచి పెద్ద చేసిన అమ్మకు యిప్పుడు నన్నిలా నిందించేందుకు అధికారమూ న్యాయమూ ఎక్కడినుంచి వచ్చాయి. నేను నేను కానప్పుడు నేను చేసిన తప్పొప్పులు నావెలా అవుతాయి. ? కర్మణ్యేవాధికారస్తు.. మాఫలేషు కదాచన అని చెప్పలేదూ భగవద్గీతలో! నా దైవం అమ్మ. నా కర్మలకు బాధ్యురాలు అమ్మే. ఆమె మలిచిన శిల్పాన్ని నేను. అందుచేత నేను చేసిన కార్యాల మంచిచెడులు నన్నంటవు. ఆమెకే చెందుతాయి. ఈ ప్రాధమిక సత్యాన్నీ, న్యాయాన్ని, ధర్మాన్ని ఎందుకు మరిచిపోయింది.

నేను సిద్ధార్థను.

అమ్మ సగమే చిత్రించిన చిత్రాన్ని.

అర్ధభాగమే చెక్కిన శిల్పాన్ని.

సగమే మలచిన మనిషిని. సగం మనిషిని.

మీరు న్యాయం ఆలోచించండి. నేనెంతవరకూ అపరాధిని. నేరం హంతకుడిదా, అతని చేతిలోని కత్తిదా ?

కాలగర్భంలో మరో ఆరేళ్లు గడిచాయి. ఇప్పుడు నా వయస్సిరవై రెండు. ఇప్పుడు నేను పూర్తయిన శిల్పంలా పూర్ణ పురుషుడిని. అమ్మ నన్ను సగం మనిషి చేసి వొదిలితే మిగిలిన సగమూ అనుభవాలు పూర్తి చేశాయి. ఆదర్శాలూ, ఆశయాలూ నాలోని అర్ధభాగం ఐతే అనుభూతులూ అనుభవమూ మిగిలిన అర్ధభాగం.

ఓహ్! మీరు గతించిన ఆ అధ్యాయం తాలూకు పరిణామం గురించీ ఫలం గురించీ ఆలోచిస్తూ పరాకుగా ఉన్నారా ! నిజమే మీకుతూహలం సమంజసమే. అది ఎలా ముగిసిందో క్లుప్తంగా చెబుతాను. ఇప్పటి జ్ఞానంతో అప్పటి కథను చెబుతున్నాను. కనుక మీకు సులభంగానే అర్ధమౌతుంది.

నేను తండ్రిని హత్య చేశాను. కారణమేమయినా ఫలితం అది. అమ్మకి నన్ను జైలుకి పంపడం అమిత బాధాకరమయిన విషయం. ఆత్మహత్యా సదృశం. నాన్నగారు జమిందారుగా బ్రతికినవారు. ఐశ్వర్యానికి లోటు లేదు. ఈ రోజుల్లో ధనం సాధించలేనిది లేదు. కొండమీద కోతే కాదు., న్యాయపీఠం మీద నరోత్తముడిని కూడా క్రిందికి దింపగలదీధనం. ఐతే. ఒక్కొక్క మనిషికి ఒక్కొక్క వెల ఉంటుంది. ఆ ధర మనం చెల్లించగలగాలంతే మాకు ఐశ్వర్యానికి కొదవేమిటి. అమ్మ పేరుమోసిన న్యాయవాదిని పిలిపించింది, రాత్రికి రాత్రే. పిలిపించే ముందు నాకు చెప్పింది. "సిద్దార్థా దయచేసి నా కోరిక తీర్చవూ – కోరిక కాదు ..ప్రార్ధన ".. "అదేమిటమ్మా..మాతృమూర్తివి నీవు. నీ

పుత్రుడిని నేను. నువ్వు నన్ను వేడుకోవడమూ కోరుకోవడము ఏమిటి. ఆజ్ఞాపించాలి గాని."

"పోనీ .ఆజ్ఞ. తు.చ. తప్పకుండా పాటిస్తావా"

" నీకెందుకు కలిగింది నాపై అటువంటి సంశయం."?

"మంచిది. నేను వాంఛించిందదే. కొంచెం సేపట్లో ప్లీడరుగారు వస్తారు. వారేం చెబితే అదే చెయ్యాలి. ఏం చెప్పమంటే అదే చెప్పాలి."

"అలాగే"

"నాన్నగారిని నువ్వు చంపినట్లు ఎవ్వరితోనూ అనకూడదు."

"అబద్ధమాడేదా !" తెల్లబోయి చూశాను. అమ్మా ! నువ్వేనా చెబుతున్నది ! " ఎంత గిలగిలలాడిపోయింది." అమ్మా. నేనలా అడిగేనరికి. ఆమె ముఖం వివర్ణమూ రక్తహీనమూ ఐపోయింది. "నువ్వెంత భయంకరమైనా పరిస్థితిలో చిక్కుకున్నావో నీకు తెలియదు. ఐనా ప్రాణ విత్త మానభంగము లందు బొంకవచ్చునధిప. అఘము లేదు. - అన్నారులే..."

"ఇప్పుడు నాకు దేనికి భంగమొస్తుందని?"

"ప్రాణానికీ, మానానికీ. నాతో వాగ్వాదం చేయకు. చెప్పినట్లు విను నీ కాళ్ళు పట్టుకుంటాను." ఏడ్చేసింది.

"సరే" అన్నాను, నా సందేహాలను నాలోనే యిముడ్చుకొని.

న్యాయవాది వొచ్చాడు. అమ్మ నన్ను ఆ గదిలోకి వెళ్ళిపొమ్మని ఆయనతో చాలా సేపు మాట్లాడింది. ఇద్దరూ ఔట్‌హౌస్‌లోకి వెళ్ళినట్లున్నారు. తెల్లవారుతుంటే పోలీసులు వచ్చారు. అంతే నాకు తెలుసు. అమ్మ ఒకసారి ఆ న్యాయవాదికి చాలా డబ్బివ్వడం మాత్రం చూశాను. ఇప్పుడర్థమౌతూంది. నేను చేసినది నేరమనీ, దానిని డబ్బుతో అమ్మ మాఫీ చేయించిందనీ !

నన్ను కనీసం కోర్టుకయినా పిలువలేదు. నేను అబద్ధం చెప్పవల్సిన అగత్యమే ఏర్పడలేదని అమ్మ ఆనందం వెలిబుచ్చింది. కేసు ముగిసిపోయింది అతి తొందరలోనే. అప్పుడు నన్ను పిలిచింది ఓనాడు తన గదిలోకి. "సిద్ధార్థా..నువ్వింకా చదువుకోవాలి."

"నువ్వు చెపుతూనే ఉన్నావుగా"

" అది చాలదు. నేను నీకు సగం మాత్రమే చెప్పగలిగాను. మిగిలినది నీ అంతట నువ్వే తెలుసుకోవాలి. నిన్ను మంచిచోట చేరుస్తాను. తరువాత యీ భవనమూ అవీ అమ్మేద్దామనుకుంటున్నాను. నీ అభిప్రాయం చెప్పు."

"నా అభిప్రాయమేమిటి ! అమ్మవి. అన్నీ తెలిసినదానివి."

" నిజానికి వీటన్నిటికీ అధికారివి నువ్వే. నైతికంగా కూడా నాకు హక్కులేదు, అవసరమూ లేదు. అందుకే యిక యిక్కడ ఉండలేమని.. అమ్మేద్దామనుకుంటున్నాను. నువ్వు కాలేజిలో చేరుదువు గాని. పట్నంలో యిల్లు తీసుకుని వంటవాడిని పెట్టుకొని ఉందువుగాని."

"నువ్వు",

" నా గురించి చింతలేదు. ఒంటరిదానను. ఎక్కడుంటే దినం తీరదు.?"

"నాతోనే ఉండొచ్చుగా"

"వొద్దు ! నువ్వు యికపైన స్వేచ్ఛగా, స్వతంత్రంగా పెరిగి వికసించాలి. ఎండపడని- నిరంతరము నీడలోనే ఉండే మొక్క తాలూకూ పెరుగుదల ఆరోగ్యంగా సాగదు. ఎండా నీడా రెండూ ఉంటేనే మొక్కకి మంచిది. తట్టుకునే శక్తి వొస్తుంది. చిరుగాలికి కూలిపోదు."

అమ్మ ఉద్దేశం స్పష్టంగా అర్థమైంది. ఆమె చాలా పశ్చాత్తాపపడుతున్నట్లుంది. ఆమె కళ్ళను చూనస్తాంటే. ఏదో ధృడనిశ్చయానికే వొచ్చినట్లుంది. అదీగాక నిజం చెప్పాలంటే నాకూ ఆ కొత్త జీవితంపట్ల ఆకర్షణ కలుగుతోంది. అతి ప్రేమకూడా ఒక విధమయిన బందికానాయేమెూ. నాకు స్వేచ్ఛగా ఉండాలనిపిస్తూంది. కొత్తదనపు జీవితంవేపు మనసు ఉరకలూ పరుగులూ వేస్తూంది. యింతవరకూ అనుభవిస్తూవొచ్చిన జీవితం మీద విసుగేస్తూంది. అందుకే నేనింకేమీ అనకుండా మౌనంగా ఉండిపోయాను అమ్మ మాటను శిరసావహిస్తున్నట్లు.

"సిద్ధార్థా !" గంభీరంగా పిలిచింది అమ్మ.

"ఏమిటమ్మా"

"నాకొక వాగ్దానం చేయి. నీమేలుకోసమూ.. నామేలు కోసమూ.."

" చెప్పమ్మా." బుద్ధిగా కూర్చున్నాను.

"నువ్వు చేసిన పని - అదే - మీ నాన్నగారిని నీ చేతులతో చంపడం. ఎట్టి పరిస్థితులతోనూ ఎవరికీ చెప్పకూడదు. సాధ్యమైనంతవరకూ నీ గతాన్ని ఎవరికి చెప్పకు"

"అలాగే ! కాని ఎందుకని ! అదంత నీచమైనదా! అసహ్యకరమైనదా?"

"మున్ముందు నీకే తెలుస్తుంది. ప్రపంచ జ్ఞానం తగినంత కలిగాక, మేధస్సూ మనస్సూ వికసించాక.."

"సరే"

కొంచెం రోజులలోనే నేను పట్నానికి వచ్చేశాను. చెరలోంచి బయటకు వచ్చినట్లు అనిపించింది. ఒక్కసారి కొత్త జీవితం.. స్వేచ్ఛ..స్వాతంత్ర్యం. ఒంటరితనం. కొత్త స్నేహాలు.. కాలేజి వాతావరణం. ఉక్కిరిబిక్కిరి చేశాయి. ప్రతీదీ నాకు వింతే. కొన్ని నెలలకు గాని నేను నూతన వాతావరణాని కలవాటుపడలేకపోయాను. తరువాత అదే సహజంగా అనిపించడం ప్రారంభించింది. ఎప్పుడయినా గతం గుర్తుకు వస్తే, గత జీవితమే అసహజంగా తోచేది. నేను ధనవంతుడిని. ఖర్చుకు వెనుకాడను. కనుక నాకు స్నేహితులెక్కువ మందే తయారయ్యారు. వాళ్ళతో కలిసితిరగడంలో ప్రపంచం కొంత వరకూ అర్థమయ్యేది. డబ్బుకుండే శక్తితోపాటు, దాని పట్ల ఆకర్షితులై మనుషులెన్ని ఘోరాలు చేస్తున్నారో కూడా తెలియవచ్చేది.

వయసుకి సహజంగా పెరుగుతున్నాను నేను. ఆ వయసుకి లక్షణమయిన వలపుజల్లు నా హృదిలోనూ కురిసి హృదయాన్ని ప్లావితం గావించింది. స్త్రీ సౌందర్యం మించిన దైవత్వం. పవిత్రతా మరేమి లేదేమో. స్త్రీ పురుషుల నడుమ ఉండే ఆకర్షణ- అది వలపే అయినా, ప్రేమయినా.. దాన్ని మించినది మరేదీ లేదేమో. లేకపోతే కవులందరూ ప్రేమ గురించే గేయాలు

వ్రాశారేం. రచయితలందరూ దానినే కథావస్తువుగా తీసుకుంటూ వచ్చారేం. యుగయుగాలుగా వొస్తున్నా యీ ప్రేమకుసుమం వాడిపోకుండా యిప్పటికి తాజాగా సుందరమైన రేకులతోనూ సువాసనలతోనూ నిత్యమూ వికసిస్తూనే ఉందేం? షేక్స్ ప్రియర్ ..కీట్స్.. బైరన్.. షెల్లీ మహాకవులందరికీ ప్రేమే ఆరాధ్యనీయమూ లక్ష్యమూ అయింది.

ప్రత్యక్షంగానూ, పుస్తకాల ద్వారానూ సమాజం నాకు మెల్లమెల్లగా పరిచయమౌతూంది. నేను సమాజంలో మసులుతున్నాను. ఎన్నెన్ని అనుభవాలు.. ఒక పూట తిండికోసం ..పిల్లలిక గంజినీళ్ళ కోసం.. శరీరాన్నమ్ముకొనే స్త్రీలున్నారు. తన సుఖంకోసం.. డబ్బుకోసం.. ఎదుటిమనిషిని హత్యచేసేందుకయినా సంకోచించని సంకుచితులున్నారు. మిధ్యాగౌరవాల కోసం జీవితాన్ని పణం పెడుతున్న అమాయకులున్నారు. వంచకులున్నారు. హంతకులున్నారు. వీళ్ళే కాదు. పేదరికంతో ముస్తైత్తుకునే వాళ్ళు కూడా ఉన్నారు. పేరుకుపోయిన ధనాన్నేంచేసుకోవాలో తెలియనివాళ్ళున్నారు. కార్లలో తిరిగేవారు. కాళ్ళు లేనివాళ్లు, భవనాలలో నివసించేవారు మురికివాడల గట్టున ముడుచుకొని పడుకునేవాళ్ళు. యాచకులు - దాతలు, వ్యభిచారులు - పవిత్రులు, పాపులు - పుణ్యులు, స్వార్థపరులు - త్యాగజీవులు, అధములు - ఆదర్శప్రాయులు, మంచివాళ్లు - చెడ్డవాళ్లు, వీళ్లందరూ నేనున్న ప్రపంచంలోనే ఉన్నారు. నాతోటే బ్రతుకుతున్నారు. నేను వారిమధ్య పెరుగుతున్న, వాళ్ల లాటి మనిషిని. వాళ్ళు నాలాంటి మనుషులు.

ప్రకృతిలో ప్రపంచంలో మానవజీవితంలో అన్నీ ద్వంద్వాలే , మిట్లపల్లాలు, శిఖరాలు, లోయలు, వెలుగూ - చీకటి, మంచీ-చెడూ, కరుణ - కార్పణ్యం, కలిమి - లేమి. సుగుణం - దుర్గుణం, పవిత్రత - అపవిత్రత. లక్ష్యం - నిర్లక్ష్యం. శ్రద్ధ - అశ్రద్ధ. ప్రేమ- పగ ఇంకా ఎన్నెన్నో ద్వంద్వాలు. విచిత్రమేమిటంటే జీవితమంటే ఏ ఒక్కటీ కాదు. అన్నీను, మంచి చెడూ కలిస్తేనే మనిషి. లోతుగా శోధించగలిగితే మంచిలో చెడునీ, చెడులో మంచినీ కూడ చూడగలగవచ్చు. మానవ జీవితమనే నాణానికి మంచి ఒక వేపయితే చెడు మరొక వేపు. ఏవేపు లేకపోయినా నాణెం ఉండడం ఎలాగ అసాధ్యమో ద్వంద్వాలలో ఏ ఒకటి లేకపోయినా మానవజీవితమూ లేదు. యూనివర్శిటీలోంచి బయటకు వచ్చేటప్పటికి గ్రంధస్థమైన జ్ఞానంతోపాటు నా చుట్టూ ఉండే సమాజం నుంచి విజ్ఞానాన్ని అలవరుచుకున్నాను. ఒక మనిషీ మరొక మనిషీ వేరు. ఒక మెదడు ఆలోచించినట్లు మరొక మెదడు ఆలోచించదు. ఒక మనసు స్పందించినట్లు మరొక మనసు స్పందించదు. సామీప్యం ఉండవచ్చు కానీ సారూప్యం ఉండదు. సృష్టిలో ఎంత వైవిధ్యం. ఎంత భిన్నత్వం.

ఐతే .. ఉండుండి నాకొక భయంకరమయిన స్వప్నం వొచ్చేది. ఆ స్వప్నంలో రెండు చేతులు.. రక్తసిక్తమై వేళ్లనుంచి రక్తాలు కారుతూ.. ఎర్రగా భయంకరంగా.. నా

ముఖంమీదకు వొచ్చేవి. నాన్నగారి తల పగిలి రుధిరం స్రవిస్తూ..నా ముఖం ముందు నాట్యమాడేది నవ్వుతూ.. మొండెం లేని తల .. రక్తం చిందుతూ.. గాలిలో తేలుతూ.. నన్ను ముద్దుపెట్టుకునేది.

త్రుళ్ళిపడి లేచేవాడిని. ఏ.సి.రూములో పడుకున్నా శరీరమంతా స్వేదం క్రమ్మి ఉండేది. నా కల కర్థం నాకు తెలుసు. ఆ ఎర్రని చేతులు నావే, నేను హంతకుణ్ని. గతంలో నేను చేసిన హత్యను జ్ఞాపకం చేస్తూ ఆ కల చాలా భయపెట్టేది. అర్థరాత్రి లేచి కూర్చునేవాడిని నిద్రపట్టక. ఈ పాప పంకం..రక్తపంకం కడుక్కునేదెలా ? ఒకనాటి రాత్రి నాకు చిత్రమైన అనుభవం కలిగింది, అది వాస్తవమా అన్నది వేరే ప్రశ్న. ఎప్పటిలాగే ఆ శిరస్సు నన్ను ముద్దుపెట్టుకుంది. నేను త్రుళ్ళిపడలేదు. గుండె బిగబట్టుకుని భరించాను..అప్పుడా తల అంది "కృతజ్ఞతలు సిద్ధార్థా ! ఈ స్పర్శకోసమే జీవితమంతా తపించాను. నిన్ను ముద్దుపెట్టుకోవాలనీ, ఆశీర్వదించాలనీ ఎంత పరితపించిపోయానో ! తీరని ఆవాంఛ మూలంగానే నా ఆత్మకు విముక్తి లభించలేదు. ఇన్నాళ్లకి.. నా కోరిక తీరింది.."

" మీరు నన్నెందుకు ముద్దుపెట్టుకోలేకపోయారు , మీ పుత్రుణ్నే కదా ? నన్నాశీర్వదించ డానికి మిమ్మల్ని అడ్డిన దెవరు ?"

" నా వ్యసనాలు, వాటి మూలంగా నన్ను తననుంచీ, నిన్ను నానుంచీ దూరం చేసిన మీ అమ్మ సిద్ధాంతాలూ పవిత్రతా. నేను తాగేవాడిని.. జూదమాడేవాడిని, స్త్రీలతో సుఖించేవాడిని చాలా మంది జమీందార్లలాగే. నేను వ్యసనపరుడిననీ, అపవిత్రుడిననీ నేను నిన్నుకానీ తనని కానీ ముట్టుకోకూడదనీ ఆంక్ష విధించింది మీ అమ్మ. ఆమె కిచ్చిన మాట నిలుపుకుందుకు.."

" అయ్యో ! అమ్మ ఎంత తొందరపడింది ! వ్యసనాలు కూడా జీవితంలో ఓ భాగమే కదా ! వాటిని క్షమించగలిగితే .."

"క్షమించడమనేది మీ అమ్మకి తెలియదు. తప్పుచేయకూడదన్నదే ఆమె సిద్ధాంతం,. దానికి సడలింపు లేదు.."

" తప్పు చేయనిదే మనిషెలా ఔతాడు ? క్షమించలేనిది జీవితమెలా అవుతుంది."

" నిన్నూ తన అడుగుజాడలలోనే నడిపించింది. సిద్ధార్థా ! నువ్వు నన్నెందుకు హత్యచేసావో తెలుసునా ?"

"మీరెవరో స్త్రీ మీద అన్యాయంగా అత్యాచారం జరపబోతుంటే.. ఆమె కేకలు విని.."

" అది అత్యాచారం కాదు, శృంగారం! ఆ కేకలు మా రాసకేళిలో ఒక భాగమే.. ఆస్త్రీకి నేనంటే అమిత యిష్టం."

"అయ్యో ! ఎంత మూర్ఖుడినైపోయా నాక్షణాలలో.."

" ఆ మూర్ఖత నీది కాదులే ."

" నన్ను క్షమించరూ నాన్నగారూ ?"

సిద్ధార్థా నాకిప్పుడు ఎంతో ఆనందంగా ఉంది. నిన్ను నేను క్షమించనక్కర్లేదు. నువ్వు నన్నర్థంచేసుకున్నావు. అమోదించావు. అది చాలు. నాకు మహదానందంగా ఉంది. నాకోరిక తీరింది. నాకు విముక్తి లభించింది. సిద్ధార్థా

ఇది మీ అమ్మకు చెప్పకు. భరించలేదు. ఇంక నేను నీకు కనిపించను."

"నాన్నా"

"ఓహ్ ! నీ స్పర్శ ఎంత హాయిగా వుంది. దీనికి దూరంగా అన్నాళ్ళెలా ఉండగలిగానో! చాలు యీ అనుభూతి ..వొస్తాను. సిద్ధార్థా."

అలా నాన్నగారు మాయమైపోయారు. అంతేకాదు, ఆ భయంకరమైన కలకూడా రావడం మానేసింది. నా చేతులు రక్తపంకంతో కనిపించడంలేదు. నాన్నగారు నన్ను క్షమించారు. అది చాలు. నాకు తృప్తిగా, హాయిగా ఉంది. నేను హంతకుణ్ణేమో అన్న భయమూ భావమూ నా అంతరాత్మను వీడిపోయాయి. యూనివర్సిటీ చదువు ముగిసిన సందర్భంగా ఒక్కసారి అమ్మని చూడాలనిపించింది. ముందుగా వ్రాసి బయలుదేరాను. అమ్మకూడా రమ్మని వ్రాసింది. నన్ను చూడాలని తనకీ ఉందట.

ఆరేళ్ళయిపోయింది, యిద్దరమూ ఒకరినొకరు చూసుకొని. అమ్మ యిచ్చిన ఆశ్రమం అడ్రసు నాకాశ్చర్యం గొలిపింది. అక్కడకు చేరాను. అమ్మ అరవిందాశ్రమంలో ఉంది.

పేరు చెబితే నన్ను ఒక కుటీరానికి తీసుకువెళ్లారు. ఆ కుటీరంలో ఉంది. "వొచ్చావా సిద్ధార్థా"

"అమ్మా"

"ఎన్నాళ్ళయింది నిన్ను చూసి" అంటూ దగ్గరకు తీసుకుంది.

"ఏమిటమ్మా ఇలా అయిపోయావు."

"ఎలాగ" ? పేలవంగా నవ్వింది.

"చిక్కిపోయావు. చాలా వృద్ధురాలివైపోయి నట్లు."

"అభిమానం అలా అనిపిస్తుంది."

"కాదు. నిజమే."

"జీవితంలో నాకేం ఉత్సాహం మిగిలిందని ఆరోగ్యంగా ఉంటాను. నా మాటకేం. నీ గురించి చెప్పు."

"ఏం చెప్పేది"

"ఏం నేర్చుకున్నావీ ఆరేళ్లలో"

"ఎమ్మే పరీక్షలు వ్రాసాను. తప్పకుండా కృతార్థుడనౌతాను"

"ఆ చదువు గురించి కాదు నే అడిగేది."

"మరి"

"జీవితం గురించి, జీవితపాఠాలేం నేర్చుకోగలిగావని."

"కొంచెం చెప్పు"

"ప్రపంచమంతా ద్వంద్వాలమయం. మానవజీవితమూ అంతే. ప్రతి మనిషిలోనూ మంచీ ఉంటుంది, చెడూ వుంటుంది. చాలామంది మనుషులు రెండేసి జీవితాలు గడుపుతుంటారు. బయటకు కనిపించే మనిషొకటి. లోపలి మనిషి మరొకటి. దాని వల్ల చాలా అనర్థాలు కలుగుతాయి. కాని ఎవరూ యీ రెండు ముఖాల జీవితంనుంచి ఎదగలేరనుకుంటారు. ఇదొక చిత్రం. తప్పుచేయడమూ, క్షమించగలగడమూ మనిషి

నేర్చుకోవాలి."

ఆమె పొంగిపోయింది.

కళ్ల వెంట నీరుబుకుతూంది.

ఒక్కసారి నన్ను గట్టిగా కౌగిలించుకొని, "చాలు సిద్ధార్థా..చాలు. నువ్విక సిద్ధార్థవు కావు. పూర్ణమానవుడివే" అంది.

"అమ్మా"

"ఔను ఈ ప్రపంచంలో నువ్వు బతకగలవనే విశ్వాసం నాకు కుదిరింది. నాకు చాలా సంతోషంగా ఉంది. నీ జీవితం సఫలమైంది. నేనోడిపోయాను. ఈ ఓటమే నాకెక్కడిలేని సంతోషమూ కలిగిస్తూంది."

"అమ్మా"

"అడ్డుపడకు. నా సంతోషానికడ్డురాకు. నాకెంత ఆనందంగా ఉందంటే" ఉక్కిరిబిక్కి రౌతూంది అమ్మ.

"నువ్వసలే నీరసంగా ఉన్నావు." నా మాట పూర్తికానేలేదు. అమ్మ ఆనందంపట్టలేక దగ్గుతూంది. ఉక్కిరిబిక్కిరౌతుంది. ఆయాసపడు తోంది నాకేమిటో కంగారుగా..భయంగా ఉంది.

"అమ్మా"

"సిద్ధార్థా.." నా చేతిని గట్టిగా పట్టుకుంది.

"అమ్మా !" ఆత్రంగా పిలిచాను. నా కళ్లలోకి నీళ్లు వొచ్చేస్తున్నాయి. నా చేతిని పట్టుకున్న అమ్మ చేయి పట్టు వొదిలేసింది.

అమ్మ నావడిలోకి వాలిపోయింది.

"అమ్మా !" గట్టిగా కేకవేశాను. దిగంతాలు పిక్కటిల్లేలా. కాని

అమ్మకి నాకేక వినిపించదు. నేను చెప్పాలనుకున్న అనేక యితర విషయాలు వినిపించవు.

నా కేక విని నలుగురూ వచ్చారు.

జరగవలిసిన కార్యక్రమాలు ఎవరో జరుపుతున్నారు.

నేను నిశ్చైతన్యంగా నిలిచిపోయాను.

చితి వెలిగించాను.

అమ్మ శరీరం దగ్ధమౌతూంది.

చెలరేగుతున్న మంటలను చూస్తూంటే నాలో రకరకాల ఆలోచనలు పుడుతున్నాయ్.

అమ్మ జీవితంలో ఏం సుఖపడింది ?

రెండుముఖాల జీవితం నాన్నగారిది. అది అమ్మని కాటేసింది.

నన్నూ కాటేసింది. ఆయననూ కాటేసింది.

నేనయితే బయటపడగలిగాను.

అమ్మ శాశ్వతంగా బలైపోయింది.

దహనం పూర్తయిందని ఎవరో నన్నవతలకి నడిపించుకు వెళ్తున్నారు.

నేను యాంత్రికంగా కదులుతున్నాను.

నాలో ఒకే ఒక్క ప్రశ్న

ఈ జీవిత మేమిటి! దీని కర్థమేమిటి.?

- సమాప్తం -